RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




హైదరాబాద్ 19 సెప్టెంబర్ 2026 శనివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:96

## 22-ఏ సమస్యల పరిష్కారానికి ఉన్నతస్థాయి కమిటీ

### పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**

హైదరాబాద్, సెప్టెంబర్ 18: 22-ఏకు సంబంధించిన అన్ని అంశాలను ఫాస్ట్‌ట్రాక్‌లో పరిష్కరించేందుకు ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శాసనసభలో ప్రకటించారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం జీఓఆర్టీ నెం.564 జారీ చేసింది. సీసీఎల్‌ఏ డీఎస్ లోకేష్‌కుమార్ చైర్మన్‌గా, లా సెక్రటరీ పాపిరెడ్డి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్‌గాంధీ హనుమంతు సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేశారు.

ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో జీఓ 118 ప్రకారం 9,700 ప్లాట్ల రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన మెమోను ప్రభుత్వం జారీ చేసిందని మంత్రి తెలిపారు. సెప్టెంబర్ 19 నుంచి రెగ్యులరైజేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని చెప్పారు. దశాబ్దాలుగా ప్లాట్లు తీసుకుని ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న వారు నిబంధనల ప్రకారం స్థానిక అధికారులను సంప్రదించి రెగ్యులరైజ్ చేసుకోవాలని సూచించారు.

సింగరేణి ప్రాంతాల్లో ఇళ్ల స్థలాల రెగ్యులరైజేషన్ కోసం గతంలో జారీ చేసిన జీఓ 76ను అనుసరించి శనివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో సింగరేణి ప్రాంత ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించి ప్రక్రియను ప్రారంభిస్తామని తెలిపారు. హెచ్‌ఎండీఏ, డీటీసీపీ, జీహెచ్‌ఎంసీ అనుమతులతో లేఅవుట్లు వేసి, రెవెన్యూ రికార్డుల్లో 22-ఏలో ఉన్న ప్రాంతాలను జాబితా నుంచి తొలగించే అంశంపై ఒకటి రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని మంత్రి వెల్లడించారు. ముఖ్యమంత్రి శాసనసభలో ప్రకటించిన 10--12 అంశాలపై నెల రోజుల్లో నిర్ణయాలు తీసుకుని 22-ఏ దరఖాస్తుదారులకు ఉపశమనం కల్పిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

## కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలి

### కేంద్ర మంత్రిని కోరిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ఎల్‌నినో ప్రభావం కారణంగా రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనడంలో కేంద్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కోరారు. దక్షిణ రాష్ట్రాల వ్యవసాయ సదస్సులో పాల్గొనడానికి శివరాజ్ సింగ్ చౌహాన్ హైదరాబాద్ వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి వారిని కలిసి వర్షాభావం, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను కేంద్ర మంత్రికి వివరించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు , పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజురు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రానికి అవసరమైన సహకారం అందించాలని కోరుతూ వివరాలతో వినతిపత్రాన్ని అందజేశారు

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయ రంగంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని తెలిపారు. అలాగే, తాగునీరు, విద్యుత్ కొరత తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసిందని



వివరించారు ఎల్‌నినో నేపథ్యంలో రాష్ట్రంలో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహిస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. పంటల మార్పిడిపై రైతులను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని గుర్తించి రాష్ట్రానికి అవసరమైన సహకారాన్ని అందించాలని కోరారు. ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలన్న ఆలోచనతో 250 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో పండ్లు, కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేస్తున్నామని ఈ సందర్భంగా చెప్పారు. ఖఓంజఉ పథకంలో భాగంగా మొదటి విడతగా రాష్ట్రానికి 2 లక్షల ఇండ్లను కేటాయించిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ అందుకు కేంద్ర మంత్రి కి ముఖ్యమంత్రి కృతజ్ఞతలు చెప్పారు. రాష్ట్రంలో 11,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలకు ఇండ్లు మంజూరు చేయాలని గత జూలైలో కేంద్రమంత్రికి ఢిల్లీలో వినతిపత్రం అందించిన విషయాన్ని ప్రస్తావించారు. రాష్ట్రంలో డిమాండ్‌కు అనుగుణంగా మిగిలిన 9.56 లక్షల ఇండ్లను కేటాయించాలని ఈ సందర్భంగా కేంద్రమంత్రిని కోరారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యాన్ని అందిస్తున్నామని, అలాగే సన్న వడ్లకు రూ. 500 బోనస్‌ను అందించి ప్రోత్సహిస్తున్నామని వివరించారు.

## ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పై హైకోర్టు అనర్హత వేటు

### ఖైరతాబాద్ ఎమ్మెల్యే స్థానం ఖాళీ

### స్పీకర్, ఎన్నికల కమిషన్?కు సమాచారం ఇచ్చిన ధర్మాసనం



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైద్రాబాద్ సెప్టెంబర్ 18:ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు తెలంగాణ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ ఫిరాయింపు అంశంలో తెలంగాణ హైకోర్టు కీలక తీర్పునిస్తూ ఆయనపై అనర్హత వేటు వేసింది. దానం నాగేందర్ విషయంలో స్పీకర్ నిర్ణయాన్ని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తప్పుపట్టింది. అనర్హత పిటిషన్లు కొట్టివేస్తూ స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు రద్దు చేసింది. ఈ మేరకు ఖైరతాబాద్ స్థానం ఖాళీ అయినట్లు స్పీకర్, ఈసీకి హైకోర్టు తెలిపింది.

ఇదీ కేసు నేపథ్యం

దానం నాగేందర్?పై అనర్హత వేటు వేయాలంటూ బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిలు వేర్వేరుగా పిటిషన్లను దాఖల చేసిన విషయం తెలిసిందే. దానం నాగేందర్ బీఆర్ఎస్ తరపున శాసనసభ్యుడిగా గెలిచి ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరారని, 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో హస్తం పార్టీ తరపున పోటీ చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. 10వ షెడ్యూల్ ప్రకారం వ్యవహరించకుండా, రూల్స్?కు విరుద్ధంగా నడుచుకున్నారని, ఆయనపై అనర్హత వేటు వేయాలని వారు హైకోర్టును కోరారు. పార్టీ ఫిరాయింపులకు సంబంధించిన శాసనసభాపతికి పలు ఆధారాలు సమర్పించామని, వాటిని పరిగణనలోకి తీసుకోకుండా సరైన ఆధారాలు లేవంటూ స్పీకర్ ట్రెబ్యునల్ మార్చి 11వ తేదీన ఉత్వర్వులిచ్చిందని హైకోర్టు ధర్మాసనం దృష్టికి తెచ్చారు. స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై పూర్తి స్థాయిలో విచారణ జరిపిన సీజే ధర్మాసనం ఖైరతాబాద్ ఎమ్మెల్యే స్థానం ఖాళీ అయినట్లు స్పీకర్, ఎన్నికల కమిషన్?కు సమాచారం ఇచ్చింది. హైకోర్టు తీర్పుపై సుప్రీంకు వెళ్లే యోచనలో దానందానం నాగేందర్? సుప్రీంకోర్టుకు అప్పీల్?కు వెళ్లే యోచనలో ఉన్నట్లు సమా చారం. హైకోర్టు తీర్పుపై ఆయన న్యాయ వాదులతోచర్చిస్తున్నారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ దానంతో సమావేశమ య్యారు.

## వచ్చే ఏప్రిల్ నాటికి పనులు పూర్తి కావాల్సిందే...

**గత పుష్కరాల్లో తలెత్తిన సవాళ్లు ఈసారి పునరావృతం కావొద్దు**

**ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసుకుని సమష్టిగా ఏర్పాట్లు చేయండి**

**"గోదావరి పుష్కరాలు-2027" కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో అధికారులకు మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాలు**

కుంభమేళా తరహాలోనే రాబోయే గోదావరి పుష్కరాలను నిర్వహించాలన్నది రాష్ట్ర ప్రభుత్వ సంకల్పమని, అందుకు అనుగుణంగా వచ్చే ఏప్రిల్ నాటికి పనులు పూర్తయ్యేలా ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసుకుని సమష్టిగా ముందుకెళ్లాలని అధికారులను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. గత పుష్కరాల్లో తలెత్తిన సవాళ్లు ఈసారి పునరావృతం కాకుండా క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని వారికి దిశా నిర్దేశం చేశారు.



కుంభమేళా తరహాలోనే రాబోయే గోదావరి పుష్కరాలను నిర్వహించాలన్నది రాష్ట్ర ప్రభుత్వ సంకల్పమని, అందుకు అనుగుణంగా వచ్చే ఏప్రిల్ నాటికి పనులు పూర్తయ్యేలా ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసుకుని సమష్టిగా ముందుకెళ్లాలని అధికారులను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. గత పుష్కరాల్లో తలెత్తిన సవాళ్లు ఈసారి పునరావృతం కాకుండా క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని వారికి దిశా నిర్దేశం చేశారు.

మిగతా 2 లో

## ట్రాన్స్‌కో ఉద్యోగి కుటుంబానికి 1 కోటి బీమా చెక్కు అందజేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందిన టీజీ ట్రాన్స్‌కో ఉద్యోగి మహమ్మద్ ముజాహిద్ కుటుంబానికి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క రూ. 1 కోటి ప్రమాద బీమా చెక్కును అందజేశారు. అసెంబ్లీలోని తన చాంబర్‌లో మృతుడి తల్లి (నామిని)కి ఈ పరిహారాన్ని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం చేతుల మీదుగా అందజేశారు. రంగారెడ్డి జిల్లా కొత్తూరులోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో జూనియర్ లైన్‌మన్ గా పనిచేస్తున్న మహమ్మద్ ముజాహిద్ (26) 2025 నవంబర్ 5న నైట్ షిఫ్ట్ ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళ్తుండగా జరిగినరోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్ర ప్రభుత్వం, టీజీ ట్రాన్స్‌కో ఉద్యోగులకు ఎస్‌బీఐ శాలరీ ప్యాకేజీ కింద కల్పిస్తున్న ప్రమాద బీమా పథకంలో భాగంగా బాధితుడి కుటుంబ సభ్యులు 2026 ఫిబ్రవరిలో క్లెయిమ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. శాఖాపరమైన ప్రక్రియ వేగవంతం చేసి, ఆగస్టు 20న రూ. 1 కోటి పరిహారాన్ని మృతుడి తల్లి ఖాతాకు సకాలంలో జమ అయ్యేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్కో సీఎండీ కృష్ణ భాస్కర్ పాల్గొన్నారు.

## కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ రెండోరోజూ సర్వే..388ఎకరాలపైఅధికారుల దృష్టి

**సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో 388 ఎకరాలపై అధికారుల దృష్టి**

**మూడు గ్రామాల సరిహద్దుల్లోని భూముల గుర్తింపు, పరిశీలన**

**పాత రైతుల వివరాలు, రెవెన్యూ రికార్డుల సేకరణ**

**సర్వే వివరాలతో నివేదిక సిద్ధం చేస్తున్న ప్రత్యేక బృందాలు**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్ పరిసర ప్రాంతాల్లో రెవెన్యూ అధికారుల భూ సర్వే రెండో రోజూ కొనసాగింది.

సిద్దిపేట జిల్లా మార్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామంలోని ఫామ్‌హౌస్‌ను ఆనుకొని ఉన్న భూములను అధికారులు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఎర్రవల్లి, వెంకటాపూర్, వరదరాజపూర్ గ్రామాల సరిహద్దుల్లో విస్తరించి ఉన్న సర్వే నంబర్ 325లోని 388 ఎకరాల భూములపై అధికారులు ప్రధానంగా దృష్టి సారించారు. గురువారం ఈ మూడు గ్రామాల సరిహద్దులను గుర్తించిన బృందాలు, రెండో రోజైన శుక్రవారం ఆ భూములకు సంబంధించిన పాత రైతుల వివరాలను, ప్రస్తుత రెవెన్యూ రికార్డులను సేకరించాయి.

ఏడీ సుదర్శన్ రాథోడ్, డీఐ సేవియా నాయక్ పర్యవేక్షణలో నాలుగు ప్రత్యేక బృందాలు ఈ సర్వే ప్రక్రియను నిర్వహించాయి. క్షేత్రస్థాయిలో సేకరించిన సమాచారం, రెవెన్యూ రికార్డుల ఆధారంగా అధికారులు సమగ్ర నివేదికను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు.

అయితే, ఈ సర్వే చేపట్టడానికి గల కచ్చితమైన కారణాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

ప్రజాబలం

19 సెప్టెంబర్ 2026 శనివారం

# పొంచి ఉన్న హిమముంపు

హిమాలయాలు ఒక విశాలమైన సహజ జల వ్యవస్థ. దీని కారణంగా ప్రవహిస్తున్న నదులు దక్షిణాసియాలోని వందల మిలియన్ల కొద్ది ప్రజలకు జీవనాధారంగా ఉన్నాయి. హిమానీనదాలు వేగంగా కరుగుతుండటం, అలా కరిగిన నీటితో ఏర్పడిన సరస్సులు, అస్థిరంగా మారుతుండటం, మరోవైపు పర్వత ప్రాంతాలపై పర్యవేక్షణాలోపం కారణంగా హిమాలయాలు ప్రమాదకర దశకు చేరుకుంటున్నాయని తాజా పరిశోధన తెలిపింది.నేపాల్, టిబెట్‌లో 1,300 మందికి పైగా ప్రాణాలు కోల్పోయి, భారీ విధ్వంసం సంభవించిన వరదల తర్వాత ఈ వివరాలు వెలుగులోకి వచ్చాయి. హిమాలయ పర్యావరణ వ్యవస్థలో వేగంగా వస్తున్న మార్పుల కారణంగా ఏ స్థాయిలో ముప్పు పెరుగుతోందో ఈ పరిశోధనా ఫలితాలు తెలిపాయి.గ్లోబల్ కన్సల్టెన్సీ సిస్టమిక్ రిపోర్ట్ ప్రకారం, హిమాలయాల్లోని హిమానీనదాలు దశాబ్దం కిందటితో పోలిస్తే ఇప్పుడు 65 శాతం వేగంగా ద్రవ్యరాశిని కోల్పోతున్నాయి. ఈ నివేదికను ఇంటిగ్రేటెడ్ మౌంటైన్ ఇనిషియేటివ్ రూపొందించింది. దీనికి ఐసీఐఎంవోడీ, జీబీ పంత్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ ఎన్విరాన్‌మెంట్ సాంకేతిక సహకారం అందించాయి.హిమాలయ-కారాకోరం ప్రాంతంలో 40వేల హిమానీనదాలు ఉన్నట్లు అంచనా వేయగా, వాటిలో కేవలం 21 హిమానీ నదాలను మాత్రమే నిరంతరం,సమగ్రంగా పర్యవేక్షిస్తున్నారని రిపోర్టు చెబుతోంది. ఈ పర్యవేక్షణ లోటు ఆందోళన కలిగించే విషయమే. ఎందుకంటే హిమాలయాల భౌగోళిక స్వరూపం వేగంగా మారిపోతోంది.హిమానీనదాలు కరిగి వెనక్కి తగ్గుతున్న కొద్దీ, వాటి వెనుక పెద్ద పెద్ద సరస్సులు ఏర్పడుతున్నాయి. వీటిని రాళ్లు, మంచుతో కూడిన అస్థిరమైన సహజ అడ్డంకులు నిలువరించి ఉంచుతున్నాయి. సమయంలో ఉష్ణోగ్రతలు పెరగడంతో పెర్మాఫ్రాస్ట్ , అంటే శాశ్వతంగా గడ్డకట్టిన నేల క్రమంగా కరిగి అస్థిరంగా మారుతోంది. ఎత్తైన పర్వత వాలు కూడా బలహీనపడుతోంది. దీని వల్ల ఒక ప్రమాదం మరో ప్రమాదానికి దారితీసే అవకాశం పెరుగుతోందని ఈ రిపోర్టు చెబుతోంది. ఈ ముప్పు స్థాయి ఎంత ఉంటుందో భారత్ వద్ద ఇప్పటికే ఆధారాలు ఉన్నాయి.భారత్ భూభాగంలో సుమారు 18 శాతం హిమాలయ ప్రాంతమే ఉన్నప్పటికీ, దేశంలో సంభవించే విపత్తుల్లో దాదాపు 35 శాతం ఈ ప్రాంతంలోనే జరుగుతున్నాయని నివేదిక చెబుతోంది.2025లో భారత హిమాలయ ప్రాంతంలోని అధికప్రమాదం ఉన్న 189 హిమానీనద సరస్సులపై నిర్వహించిన శాస్త్రీయ అంచనా తర్వాత వాటిల్లో 56 సరస్సులను 'అత్యంత ప్రమాదకరమైనవిగా' వర్గీకరించినట్టు జూలైలో కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌కు తెలిపింది. భారత హిమాలయ నదీ పరివాహక ప్రాంతాల్లో 10 హెక్టార్లకు పైగా విస్తీర్ణం ఉన్న 2,485 హిమానీనద సరస్సులను కేంద్ర జల సంఘం పర్యవేక్షిస్తోందని ప్రభుత్వం వెల్లడించింది.సహజ ఆనకట్టలను బద్దలుకొట్టుకుని కొట్టి హిమానీనదాలుఒక్కసారిగా పొంగిపొర్లితే ఎంతటి విధ్వంసం జరుగుతుందో హిమాలయాలు ఇప్పటికే చవిచూశాయి.2023లో హిమానీనద సరస్సు ఉప్పొంగి వచ్చిన వరదల కారణంగా సిక్కింలో కనీసం 70 మంది చనిపోయారు. రహదారులు, వంతెనలు, జలవిద్యుత్ ప్రాజెక్టులు ధ్వంసమయ్యాయి. 2021లో ఇలాంటి విపత్తు కారణంగా రిషిగంగా, ధౌలిగంగా లోయల్లో భారీ వరదలు సంభవించి 200 మందికిపైగా మరణించారు.అయితే హిమాలయాల నుంచి పొంచి ఉన్న ప్రమాదం ఇలాంటి భారీ వరదలకే పరిమితం కాలేదు.ఈ శతాబ్దం మధ్య నాటికి చాలా హిందూ కుష్ హిమాలయ నదీ పరివాహక ప్రాంతాల్లో 'పీక్ వాటర్' ఏర్పడుతుందని ఐసీఐఎంఓడీ పేర్కొంది. అంటే, హిమానీనదాలు కరిగే కొద్దీ నదుల్లోకి చేరే నీటి పరిమాణం ఒక దశలో గరిష్ఠ స్థాయికి చేరుతుంది. ఆ తర్వాత హిమానీనదాలు మంచు ద్రవ్యరాశిని కోల్పోతూ పోవడంతో ఆ నీటి ప్రవాహం క్రమంగా తగ్గడం మొదలవుతుంది.హిమాలయాలపై ఆధారపడటం వల్ల ఆర్థికంగా ఎంత ప్రమాదకరమో ఈ కొత్త పరిశోధన స్పష్టం చేస్తోంది.హిమాలయాల నుంచి లభించే నీరు భారత జీడీపీలో దాదాపు 20 శాతానికి ఆధారంగా ఉందని నివేదిక అంచనా వేసింది. గోధుమ, వరి, టీ సాగుతో పాటు జలవిద్యుత్, తీర్థయాత్రల ఆధారిత ఆర్థిక కార్యకలాపాలకు ఈ నీరే కీలకంగా ఉందని తెలిపింది."హిమాలయాలు మన భూమికి మూడో ధ్రువం లాంటివి, ఆర్కిటిక్ లేదా అంటార్కిటికా ధ్రువంలా కాకుండా ఇక్కడ కోట్ల మంది ప్రజలు నివసిస్తున్నారు" అని ఆర్థికవేత్త లార్డ్ నికోలస్ స్టెర్న్ అన్నారు.ఇది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కీలకమైన మౌలిక వసతులతో ముడిపడి ఉంది," అని ఆయన అన్నారు. అయితే వాటికి ఆధారంగా ఉన్న పర్యావరణ వ్యవస్థ "పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయే కీలక దశకు చేరువవుతోంది" అని ఆయన హెచ్చరించారు.హిమాలయల్లో హిమానీ నదాల కరుగుదలకు బ్లాక్ కార్బన్ దాదాపు మూడోవంతు కారణమని సిస్టమ్‌ఐక్యూ పరిశోధన అంచనా వేసింది. ఇందులో అధిక భాగం మైదాన ప్రాంతాల్లోని ఇటుక బట్టీల నుంచి వెలువడుతోంది. మంచు, హిమానీనదాలపై పేరుకునే ఈ మసి ఎక్కువ సూర్యకాంతిని గ్రహించడం వల్ల అవి మరింత వేగంగా కరుగుతాయి.ప్రపంచవ్యాప్తంగా వెలువడే గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలతో పోలిస్తే, బ్లాక్ కార్బన్ కాలుష్యాన్ని తగ్గించడం భారత్, పొరుగు దేశాలు నేరుగా చర్యలు తీసుకోగల అంశం అని నివేదిక పేర్కొంది."హిమాలయాలు ఒక కీలక మలుపు దశకు చేరుకుంటున్నాయి. లక్షలాది మంది ప్రజల ప్రాణాలు, జీవనోపాధి ఇప్పుడు ప్రమాదంలో ఉన్నాయి," అని సిస్టమ్‌ఐక్యూ సీనియర్ డైరెక్టర్, నివేదిక ప్రధాన రచయిత అరుషి చోప్రా అన్నారు. "హిమానీనదాలు పదేళ్ల క్రితం కంటే ఇప్పుడు మరింత వేగంగా కరుగుతున్నాయి" అన్నారు. బ్లాక్ కార్బన్ కాలుష్యాన్ని తగ్గించడం, హిమానీనదాల పర్యవేక్షణను పెంచడం, ముందస్తు ప్రమాద హెచ్చరిక వ్యవస్థలను మెరుగుపరచడం, కొండ ప్రాంతాల్లో పర్యాటక రంగాన్ని మార్చడం వంటివి ఉన్నాయి.విపత్తును ఎదుర్కొనే సన్నద్ధతను పెంచడం నివేదిక సూచించిన ప్రధానమైన లక్ష్యాల్లో ఒకటి. ప్రమాదం ముంచుకొచ్చినప్పుడు జనాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించడం నుంచి కీలకమైన నిర్మాణాలు దెబ్బతినకుండా కాపాడటం వరకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో ప్రభుత్వాలు ముందే నిర్ణయించుకోవాలని పేర్కొంది.మరో ముఖ్యమైన సూచన పర్యటకంపై పునరాలోచన. భారత హిమాలయ ప్రాంతంలో ఏడాదికి దాదాపు 40 కోట్ల పర్యటక సందర్శనలు నమోదవుతున్నాయి. పర్యటకుల సంఖ్యను వీలైనంతగా పెంచడమే లక్ష్యంగా కాకుండా, పర్యటకం ద్వారా వచ్చే విలువ స్థానికంగానే మిగిలి, తిరిగి ఆ ప్రాంత అభివృద్ధికి ఉపయోగపడేలా విధానాన్ని మార్చాలని పరిశోధకులు సూచిస్తున్నారు.హిమాలయాల్లో ఎదురయ్యే ప్రమాదాలు రానురాను మరింత సంక్లిష్టంగా మారుతున్నాయని ఐసీఐఎంఓడి డైరెక్టర్ జనరల్ పెమా గ్యామ్‌ట్షో తెలిపారు."హిమానీనదాలు కరిగిపోతున్నాయి. శాశ్వతంగా గడ్డకట్టిన నేల, ఎత్తైన కొండ వాలు ప్రాంతాలు మరింత అస్థిరంగా మారుతున్నాయి. దీని వల్ల దిగువ ప్రాంతాల్లోని ప్రజలు, అక్కడి మౌలిక సదుపాయాలు కూడా ఒకదానితో ఒకటి ముడిపడిన వరుసగా సంభవించే ప్రమాదాల బారిన పడే ముప్పును ఎదుర్కొంటున్నారు" అని చెప్పారు.

# వచ్చే ఏప్రిల్ నాటికి పనులు పూర్తి కావాల్సిందే...

మొదటి పేజీ తరువాయి


శుక్రవారం ఆయన అధ్యక్షతన అసెంబ్లీ కమిటీ హాల్‌లో నిర్వహించిన "గోదావరి పుష్కరాలు - 2027" కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా... గోదావరి పుష్కరాల సన్నద్ధత, ప్రముఖ దేవాలయాల వద్ద అభివృద్ధి పనులు, ఘాట్ల నిర్మాణం, రవాణా, మౌలిక వసతులు, ఇతర ఏర్పాట్ల పురోగతిపై సమీక్షించారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... పుష్కర ఏర్పాట్లలో సమన్వయ లోపం తలెత్తకుండా జిల్లాలవారీగా ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. రద్దీ అధికంగా ఉండే టైర్-1 ప్రాంతాల్లో అత్యాధునిక సాంకేతికతతో కూడిన కమాండ్ కంట్రోల్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా చేపట్టాల్సిన అదనపు ఏర్పాట్లపై ఘాట్ల వారీగా ప్రత్యేకంగా కలెక్టర్లతో క్షేత్రస్థాయి అధ్యయనం చేయించామన్నారు. పుష్కరాలు మొదలయ్యే నాటికి పూర్తయ్యే అవకాశమున్న పనులకే తొలుత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు. చివరి వరకూ వేచి చూడకుండా గ్రౌండ్ రియాల్టీకి అనుగుణంగా ప్రతి పనికి ఒక నిర్దేశిత గడువును విధించుకోవాలని ఆదేశించారు. ఆయా పనుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేలా ఇంటిగ్రేటెడ్ డ్యాష్‌బోర్డ్‌ను వెంటనే అందుబాటులోకి తేవాలని స్పష్టం చేశారు. ఇంజినీర్ల కొరత తలెత్తకుండా ఆర్‌అండ్‌బీ, ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్‌పై తీసుకోవాలన్నారు. పుష్కరాల సమయంలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ముందే ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాలని చెప్పారు. భద్రాచలం వద్ద ఎస్‌టీపీ నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. ఎన్ని నిధులనైనా కేటాయించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని, పుష్కర ఏర్పాట్లు, పనుల నాణ్యతలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దని తేల్చి చెప్పారు.

# జీవో 118 బాధితుల సమస్యపై మంత్రులతో మధుయాష్కిగౌడ్ భేటీ

**పూర్తి యాజమాన్య హక్కులతో రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కరించాలని సూచన**

**రేపు ఎల్ బీ నగర్ లో బాధిత కాలనీల ప్రజలతో సభ నిర్వహిస్తున్నట్లు వెల్లడి**

**ప్రభుత్వ నిర్ణయంతో వేలాదిమంది బాధితులకు శుభవార్త లభించిందని పేర్కొన్న మధుయాష్కి గౌడ్**



ఎల్బీనగర్ నియోజకవర్గంలోని జీవో 118 బాధిత కాలనీల ప్రజలకు రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కరించేందుకు ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి గారు, రెవెన్యూ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అసెంబ్లీలోశుభవార్త ప్రకటించారని.. వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్ పర్సన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ గారు పేర్కొన్నారు.

రెవెన్యూ మంత్రిపొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆహ్వానం మేరకు.. మధుయాష్కీ గారు ఈరోజు అసెంబ్లీలోని వారి ఛాంబర్ లో మంత్రిని కలిశారు. మాజీ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి గారు, బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షులు పర్వతి గణేష్ రెడ్డి జీవో 118 బాధిత కాలనీల ప్రతినిధులతో పాటు మంత్రి గారిని కలిసి మాట్లాడారు.

ఈ సందర్భంగా వారి ఛాంబర్ లో మంత్రి తో పాటు హై పవర్ కమిటీ అయిన సీసీఎల్‌ఏ లోకేష్ కుమార్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ స్పెషల్ సెక్రటరీ రాజీవ్ గాంధీ హనుమంతు గార్లతో ప్రత్యేకంగా సమావేశమై.. ఎన్నో ఏళుగా ప్రజలు ఎదుర్కొంటున్న రిజిస్ట్రేషన్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. గతంలో తప్పులు తడకగా జీవో 118తో ఇచ్చిన డీడ్ ఆఫ్ కన్వీనియన్స్ తో ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించారు. తప్పుల తడకగా ఇచ్చిన జీవో 118 ను పక్కన పెట్టి.. న్యాయపరమైన చిక్కులకు అవకాశం లేకుండా 22A నుంచి తొలగించేలా చూడాలని మధుయాష్కి గారు, బాధిత కాలనీల ప్రతినిధులు కోరారు.

స్పందించిన మంత్రి హై పవర్ కమిటీ ప్రతినిధులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. బాధిత కాలనీల ప్రతినిధుల ఆకాంక్షలకు అనుగుణంగా, వారి సూచనలను పరిగణలోకి తీసుకొని రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కరించేలా ఉత్తర్వులు జారీ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు ని కూడా వారు కలిసి రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కారం పై తమ అభిప్రాయాలు తెలియజేశారు.



**ఎల్బీనగర్ 118 GOకు సంభందం లేకుండా 22A ప్లాట్స్ క్లియరెన్స్ పై మంత్రుల భేటీ**

**మంత్రి శ్రీధర్ బాబు, పొంగులేటి, అధికారురతో మధు యాష్కి సమావేశం**

**నేడు బిన్ రెడ్డి కి మంత్రి పొంగులేటి**

**రిజిస్ట్రేషన్ కు ఎలాంటి ఇబ్బంది లేకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం: పొంగులేటి**

**LB nagar లో 9వేల కుటుంబాలకు భూ హక్కు పట్టాలు అందజేస్తం: పొంగులేటి**

ఈ సందర్భంగా మధుయాష్కి మాట్లాడుతూ.. మునుగోడు ఉప ఎన్నికల్లో లబ్ధి కోసమే గత బీఆర్ఎస్ ప్రభుత్వం తప్పుల తడకగా చెత్త జీవో నం 118 ను తీసుకొచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. హుడా లే అవుట్ లలో కష్టపడి కొనుక్కున్న స్థలాల యజమానులను భూఆక్రమణదారులుగా పేర్కొంటూ జీవో 118 విడుదల చేశారని విమర్శించారు. డబల్ టాక్స్ లు విధించి ప్రజలను ఇబ్బందులు పెట్టారన్నారు. ఈ విషయాలన్నీ మంత్రులకు వివరించామని .. సీఎం రేవంత్ రెడ్డి కి కూడా ఎంపీగా ఉన్నప్పటి నుంచి ఈ సమస్య, ఈ జీవో నెంబర్ 118 తో చేసిన మోసం తెలుసన్నారు. అందుకే సమస్య పరిష్కరించేందుకు జీవో 118 తో సంబంధం లేకుండా, నూతన హక్కు పత్రాలను అందజేసి ప్రజలకు శాశ్వతంగా సమస్య పరిష్కరించేందుకు సీఎం రేవంత్ రెడ్డి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి గారు కృషి చేస్తున్నారని.. 44 బాధిత కాలనీల ప్రజలకు న్యాయం జరగనుందని.. వారికి నియోజకవర్గ ప్రజల కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను పేర్కొన్నారు.

రేపు బాధిత కాలనీలతో మంత్రుల సమావేశం

రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కారం విషయంపై శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఎల్బీనగర్ నియోజకవర్గం లో బాధిత కాలనీల ప్రతినిధులతో ప్రత్యేకంగా సభ నిర్వహిస్తున్నట్లు మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , దుద్దిల్ల శ్రీధర్ బాబు హాజరై బాధిత కాలనీల ప్రజలతో మాట్లాడి నూతన హక్కు పత్రాలను పంపిణీ చేస్తారన్నారు.

# ఏళ్ల నిరీక్షణకు తెర.. టీజీఎస్‌ఆర్టీసీలో ఎన్నికల నగారా

**అక్టోబర్ 9న పోలింగ్, 17న ఓట్ల లెక్కింపు**

**విడుదలైన ఆర్టీసీ ఎన్నికల పూర్తి షెడ్యూల్**

**2016లో చివరిసారిగా జరిగిన ఎన్నికలు**

**కార్మికుల వేతనాలపై చర్చించే అధికారం గుర్తింపు సంఘానికే**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) కార్మికులు ఎనిమిదేళ్లుగా ఎదురుచూస్తున్న గుర్తింపు సంఘం ఎన్నికల షెడ్యూల్ ఎట్టకేలకు విడుదలైంది. ఈ ఎన్నికల నిర్వహణ కోసం కార్మిక సంఘాలు దీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో, యాజమాన్యం ఎట్టకేలకు తేదీలను ఖరారు చేసింది. అక్టోబర్ 9న పోలింగ్ నిర్వహించి, అక్టోబర్ 17న ఫలితాలను వెల్లడించనున్నారు. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, సెప్టెంబర్ 21 నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఆర్టీసీలో చివరిసారిగా 2016 జులై 19న గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగాయి. వాస్తవానికి 2018లోనే ఈ ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, అప్పటి ప్రభుత్వం వీటిని జరపలేదు. దీంతో కార్మికుల నిరీక్షణ సుదీర్ఘంగా కొనసాగింది.

ఈ ఎన్నికల్లో విజయం సాధించి గుర్తింపు పొందే సంఘానికే కార్మికుల వేతనాలు, బోనస్‌లు, డీఏ, సర్వీస్ నిబంధనల వంటి కీలక అంశాలపై యాజమాన్యంతో మరియు ప్రభుత్వంతో అధికారికంగా చర్చలు జరిపే హక్కు ఉంటుంది. అందుకే ఈ ఎన్నికలను కార్మిక సంఘాలు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నాయి.

రాష్ట్ర, రీజనల్ స్థాయిలకు వేర్వేరు బ్యాలెట్ పత్రాలతో ఈ ఎన్నికలు నిర్వహిస్తారు. రీజనల్ స్థాయిలో ఆఫీసర్ హోదాలో ఉన్నవారు మినహా, మిగిలిన కార్మికులు, ఉద్యోగులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. తాజా షెడ్యూల్ విడుదలవడంతో ఆర్టీసీలో ఎన్నికల సందడి మొదలైంది.

## ఆశ్రమ పాఠశాలలో గిరిజన సంక్షేమ డీడీ ఆకస్మిక తనిఖీ

ఆసిఫాబాద్, కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మడలం పోచంలోద్ది ఆశ్రమ ఉన్నత పాఠశాలను జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల హాజరు, తరగతి గదుల బోధన, వసతి గృహ నిర్వహణ, భోజనశాల, వంటశాల, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ, వైద్య సదుపాయాలు, భద్రతా చర్యలను క్షుణ్ణంగా పరిశీలించారు.విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి విద్యాభ్యాసం, ఆహార నాణ్యత, వసతి సౌకర్యాలు, ఎదురవుతున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు.పాఠశాలలో ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పోషకాహారం అందేలా అధికారులు, ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు విద్యార్థులకు పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ ఆకస్మిక తనిఖీతో పాఠశాల నిర్వహణపై మరింత బాధ్యతతో పనిచేయాలని సిబ్బందికి జిల్లా గిరిజన సంక్షేమ అధికారి స్పష్టం చేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సిద్ధిపేటలో ఆక్రమించుకున్న భూముల్లో పేదలకు ఇళ్లు నిర్మిస్తాం

**నూనూగు మీసాల కేటీఆర్ కొడుకుకి 40 ఎకరాల భూమి ఎలా వచ్చింది.**
**అసైన్డ్ భూముల పట్టాదారులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బంది పెట్టం**
**కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసర భూములపై సర్వే అనంతరం వాస్తవాలు వెల్లడిస్తాం**
**రంగనాయకసాగర్ భూముల వ్యవహారంపైనా రికార్డుల ఆధారంగా విచారణ**
**తప్పు ఎవరు చేసినా చట్ట ప్రకారం చర్యలు..**
**అధికారుల పొరపాట్లకు కూడా మినహాయింపు లేదు**
**కేటీఆర్ చెప్పినట్లుగా కేసీఆర్‌కు చిన్నప్పుడే 2ఎకరాలలో ఇల్లుంటే ఎందుకు 2004 అఫిడవిట్‌లో చేర్చలేదు.**
**మీడియా చిట్‌చాట్ లో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

హైదరాబాద్: రాష్ట్రంలో భూములపై నెలకొన్న వివాదాలను శాశ్వతంగా పరిష్కరించాలంటే రికార్డులు, భౌతిక పరిస్థితి రెండింటినీ సమన్వయం చేయాల్సి ఉంటుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.. రికార్డులో ఉన్న భూమి ఎంత? డాక్యుమెంట్లలో ఎంత? భౌతికంగా ఎవరి పొజిషన్‌లో ఎంత ఉంది? ప్రభుత్వ భూమి ఎంత? అసైన్డ్ భూమి ఎంత? అన్నది సమగ్ర సర్వే ద్వారా తేలుస్తాం. వాస్తవాలు బయటకు వచ్చిన తర్వాత చట్టం ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శుక్రవారం అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి గారు, నేను మాట్లాడే ప్రతి అంశానికి డాక్యుమెంట్లు, అధికారిక రికార్డులు ఉన్నాయి. సర్వే పూర్తయిన తర్వాత సాంకేతిక ఆధారాలతో వాస్తవాలు బయటకు వస్తాయని తెలిపారు.

భూముల విషయంలో ప్రభుత్వం ఎవరినీ ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెట్టదని, అయితే ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, ప్రైవేట్ పట్టా భూములు, భౌతిక స్వాధీనం, రెవెన్యూ రికార్డులు, ఎన్నికల అఫిడవిట్లలో చూపిన ఆస్తుల మధ్య తేడాలు ఉంటే వాటిని రికార్డుల ఆధారంగా పరిశీలించాల్సిందేనని అన్నారుకేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసర భూములపై సమగ్ర సర్వేకేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసరాల్లో ఉన్న భూముల విషయంలో స్థానికుల నుంచి వచ్చిన సమాచారాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి అసెంబ్లీలో చేసిన ప్రకటన కూడా స్థానికుల నుంచి వచ్చిన సమాచారంపై ఆధారపడి ఉందని మంత్రి పేర్కొన్నారు. ఫామ్‌హౌస్‌కు సంబంధించిన భూముల్లో ప్రభుత్వ భూమి ఉన్నట్లు సర్వేలో తేలితే, చట్టప్రకారం ఆ భూమిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని అర్హులైన పేదలకు, ముఖ్యంగా దళితులకు ఉపయోగించే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. 2004 అఫిడవిట్‌లో భూములు లేవని చెప్పి.. ఇప్పుడు వందల ఎకరాలు ఎలా? అని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబ భూములపై జరుగుతున్న చర్చలో ఎన్నికల అఫిడవిట్లలో నమోదైన వివరాలు కూడా పరిశీలించాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు.

2004 లోక్‌సభ ఎన్నికల అఫిడవిట్‌లో కేసీఆర్ తన పేరున వ్యవసాయ భూమి లేదని పేర్కొన్నారు. అలాంటప్పుడు తర్వాత కాలంలో విస్తారమైన భూములు ఎలా వచ్చాయి? పుట్టుకతోనే వందల ఎకరాల భూస్వాములమని చెబుతున్నప్పుడు, ఆ భూముల వివరాలు సంబంధిత ఎన్నికల అఫిడవిట్లలో ఎందుకు కనిపించలేదు? అని మంత్రి ప్రశ్నించారు. ఈ అంశంపై ప్రస్తుత వాదనలు, అప్పటి అఫిడవిట్ల వివరాల మధ్య ఉన్న తేడాలను రికార్డుల ఆధారంగా పరిశీలించాల్సి ఉందన్నారు.

కేటీఆర్ కొడుకు పేరిట 40 ఎకరాల భూమిపై స్పందిస్తూ నూనూగు మీసాల పిల్లోడు ఏ వ్యాపారం చేశాడని ఇంత భూమి వచ్చిందని మంత్రి ప్రశ్నించారు. హరీశ్‌రావు అఫిడవిట్‌పైనా ప్రశ్నలుహరీశ్‌రావు తన ఎన్నికల అఫిడవిట్‌లో చూపిన భూములు, ప్రస్తుతం ఉన్న భూములు, భౌతిక స్వాధీనం, ట్రస్ట్ పేర్లతో ఉన్న భూములు తదితర అంశాలను కూడా పరిశీలిస్తామని మంత్రి తెలిపారు. అఫిడవిట్‌లో ఎంత చూపించారు? రికార్డుల్లో ఎంత ఉంది? భౌతికంగా ఎంత ఉంది? బినామీ పేర్లలో ఏమైనా ఉందా? అన్నది అధికారిక రికార్డుల ఆధారంగా తేలాలని అన్నారు. అఫిడవిట్‌లో చూపిన విస్తీర్ణం కంటే ఎక్కువ భూమి ఉన్నట్లు తేలితే దాని చట్టబద్ధతను పరిశీలిస్తామని చెప్పారు. ఒక గుంట తేడా ఉన్నా అది ఎవరి పేరున, ఏ హక్కుతో ఉందో రికార్డుల ద్వారా తేలాలని అన్నారు. హరీశ్‌రావు కుటుంబ సభ్యులు మాజీ సైనికుడి నుంచి భూములు కొనుగోలు చేశారన్న వాదనపై కూడా మంత్రి స్పందించారు. భూమి లావాదేవీ జరిగితే దానికి సంబంధించిన రిజిస్ట్రేషన్, పట్టా, ఇతర చట్టబద్ధమైన డాక్యుమెంట్లు ఉండాలి. ఆ డాక్యుమెంట్లు, వాటి వెనుక ఉన్న రికార్డులు ఏమిటో పరిశీలిస్తాం” అని తెలిపారు.

## పల్లె దవాఖానాల్లో సేవలు విస్తృతం చేయాలి

## ఎంఎల్‌హెచ్‌పీలకు డీఎంహెచ్‌ఓ డా. ఆనంద్ ఆదేశం





**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం సెప్టెంబర్ 18:**పల్లె దవాఖానాల ద్వారా ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. కె. ఆనంద్ సూచించారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని పల్లె దవాఖానాల మెడికల్ ఆఫీసర్లు (ఎంఎల్‌హెచ్‌పీలు), రిపోర్టింగ్ సూపర్‌వైజర్లతో అంటాయిపల్లిలోని ఐడీఓసీ కార్యాలయంలో శుక్రవారం కార్యక్రమాల వారీగా సమీక్ష నిర్వహించారు.

పల్లె దవాఖానాలు గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలందించడంలో కీలకమని డా. ఆనంద్ అన్నారు. ఎంఎల్‌హెచ్‌పీలు ఆశాలు, ఏఎన్‌ఎంలతో సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.

గర్భిణులను ప్రారంభ దశలోనే గుర్తించి నమోదు చేయడం, ఏఎన్‌సీ పరీక్షలు నిర్వహించడం, హైరిస్క్ గర్భిణులను గుర్తించి నిరంతరం పర్యవేక్షించడం, టీకాలు, పోషకాహార సప్లిమెంట్లు అందించడం వంటి సేవలను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ప్రసవానంతర సేవలు అందించడంతోపాటు అవసరమైన కేసులను ఉన్నత వైద్య కేంద్రాలకు సకాలంలో రిఫర్ చేయాలన్నారు. నవజాత శిశువులు, పిల్లల్లో జన్యుపరమైన, పోషకాహార లోపాలను ముందుగానే గుర్తించి తగిన వైద్యం అందించాలని సూచించారు.

జ్వరం, విరేచనాలు, నీటి, దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు, టైఫాయిడ్, చర్మ సంబంధిత సమస్యలకు పల్లె దవాఖాన స్థాయిలోనే అవసరమైన చికిత్స అందించాలని చెప్పారు. టీబీ నియంత్రణలో డాట్స్, కుష్ఠు నియంత్రణలో డీపీఎంఆర్ సేవలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ తదితర అసాంక్రమిక వ్యాధులకు నిరంతరం స్క్రీనింగ్ నిర్వహించి, వ్యాధి నిర్ధారణ అయిన వారికి చికిత్స, ఫాలోఅప్ కొనసాగింపును పర్యవేక్షించాలని తెలిపారు.

కిశోర బాలబాలికలకు ఆరోగ్య సలహాలు, పోషకాహార లోపాల గుర్తింపు, చికిత్స, రిఫరల్ సేవలు అందించాలని సూచించారు.

పల్లె దవాఖానాల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలకు చర్యలు తీసుకుంటామని డా. ఆనంద్ తెలిపారు. జేఏఎస్ నిధులు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని, అందుబాటులో ఉన్న నిధులను ప్రజలకు మెరుగైన వైద్య సేవల కోసం సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు.

ప్రతి ఆరోగ్య కార్యక్రమం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో చేరుకోవడంతోపాటు రికార్డులు, ఆన్‌లైన్ డేటాను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని అన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా, ప్రజలకు అందాల్సిన సేవల్లో అలసత్వం ప్రదర్శించినా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఎంఎల్‌హెచ్‌పీ తన పరిధిలోని ప్రజలకు అందించే ఆరోగ్య సేవలకు పూర్తి బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో రెండు డివిజన్ల ఉప జిల్లా వైద్యాధికారులు, జిల్లా ప్రోగ్రాం అధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు, రిపోర్టింగ్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## రెడ్ బుక్ రాజ్యాంగానికి భయపడేది లేదు

**స్థానిక సంస్థల ఎన్నికల గెలుపే రాబోయే**
**సార్వత్రిక ఎన్నికలకు గట్టి పునాది**
**స్థానిక సంస్థ ఎన్నికలకు వైసీపీ శ్రేణులు సిద్ధమవ్వాలి.**
**మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి**

తుగ్గలి: రెడ్ బుక్ రాజ్యాంగానికి భయపడమని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తెలిపారు. తుగ్గలి మండలం జొన్నగిరి గ్రామంలో వైకాపా జిల్లా ఉపాధ్యక్షుడు జిట్టా నగేష్ యాదవ్ అధ్యక్షతన వైకాపా మండల విస్తృత సమావేశంను శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి పత్తికొండ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, కర్నూలు పార్లమెంట్ మాజీ సభ్యురాలు బుట్టా రేణుక,కైరవాడి వైసిపి ఇన్చార్జ్ అరుణమ్మ లు హాజరయ్యారు.

ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ అద్దంకి ఎర్రనాగప్ప, విద్యా కమిటి మాజీ చైర్మన్ గుంతా రఘు, స్థానిక వైకాపా నాయకులు, కార్యకర్తలు వారికి పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం బహిరంగ సభలో శ్రీదేవి మాట్లాడుతూ తుగ్గలి మండలంలొ జరుగుతున్న ఉపాధిహామీ పథకంలో తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు, అధికారులు కలిసి అంతులేని అవినీతికి పాల్పడుతున్నారన్నారు. పోలీసులతొ వైకాపా నాయకులను, కార్యకర్తలను భయపెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నాడు బాబు ష్యూరిటీ – భవిష్యత్తు గ్యారంటీ అన్నారు,కాని నేడు బాబు ష్యూరిటీ – భవిష్యత్ కాదు మోసం గ్యారంటీ అయిందని ఆమె తెలిపింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలు పెంచమన్నారు,ఇప్పుడేమో మూడు నెలలకొకసారి కరెంట్ చార్జీలు పెంచుతున్నారని,నిరుద్యోగులకి నిరుద్యోగ భృతి ఎవరికి ఇస్తున్నారని,మహిళలకు నెలకు 1500 రూపాయలు ఎవరికి ఇస్తున్నారని, యాభై సంవత్సరాలకె ఫించన్లు ఎవరికి ఇస్తున్నారని ఆమె కూటమి ప్రభుత్వానికి ప్రశ్నించింది. కులం చూడకుండా,మతం చూడకుండా,ప్రాంత చూడకుండా,పార్టీలు చూడకుండా అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలు అందించిన మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పాలనకి,కేవలం కూటమి పార్టీల వారికే సంక్షేమ పథకాలు అన్న వెన్నుపోటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనకి నక్కకి నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని ఆమె తెలిపింది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో వైకాపా అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చింది. ఈ కూటమి ప్రభుత్వంలొ అవినీతికి సహకరిస్తున్న అధికారుల,అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్న పోలీసుల పేర్లను డిజిటల్ బుక్ లొ రాసుకుంటున్నానని,2029లో వైకాపా ప్రభుత్వం వచ్చిన తరువాత డిజిటల్ బుక్ లొ రాసుకున్న అధికారులు,పోలీసుల భరతం పడుతానని ఆమె హెచ్చరించింది. ప్రతి గ్రామ పంచాయతీలొ సచివాలయం నిర్మించి, గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం తెచ్చిన ఘనత,రేషన్ ని ఇంటి గుమ్మం ముందుకు తెచ్చిన ఘనత మన జగనన్నకే సాధ్యం అని మాజీ ఎంపీ బుట్టా రేణుక తెలిపింది. నాడు – నేడు పథకం ద్వారా విద్య, వైద్య రంగాలలో విప్లవాత్మక మార్పులు తెచ్చాడని,అభివృద్ధి అంటే అమరావతి,పోలవరం కాదని,గ్రామీణ ప్రాంతాల అభివృద్దే రాష్ట్ర అభివృద్ధి అన్నారామే. స్థానిక సంస్థల ఎన్నికలలో వైకాపా విజయం 2029 ఎన్నికలకు పునాది అని,కావున అందరూ కస్టపడి వైకాపా అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఆమె తెలిపింది. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పులికొండ నాయక్,వైస్ ఎంపీపీ మల్లికార్జున రెడ్డి,వైకాపా మండల అధ్యక్షుడు అట్లా గోపాల్ రెడ్డి,మాజీ జడ్పీటీసీలు జగన్నాథ రెడ్డి, నారాయణ నాయక్,ఉప్పర్లపల్లె మాజీ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి,ఎంపీపీ గౌరవ సలహాదారుడు శభాష్ పురం హనుమంతు, టియండి హుసేన్,నాగభూషణం రెడ్డి,రాతన మోహన్ రెడ్డి,తుగ్గలి మోహన్ రెడ్డి,చంద్రశేఖర్ రెడ్డి,గోవర్ధన్ రెడ్డి,చక్కా శీను,గుంత ఆంజనేయులు,వకీరప్ప,అవినాబాద్ రామాంజనేయులు,చాంద్ బాషా, రాంపురం గంగాధర్,గోవిందరాజులు,రామాంజనేయులు ,కడమకుంట్ల అమర్నాథ్ రెడ్డి,నారాయణ నాయక్,చెన్నంపల్లి రంజాన్ తదితర మండల వైసీపీ నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నిమజ్జన మార్గంలో విద్యుత్ పోల్ అడ్డం

**మరో రెండు, మూడు రోజుల్లో నిమజ్జన ఊరేగింపులు..**
**ప్రమాదం పొంచి ఉందంటున్న స్థానికులు**

కరీంనగర్, సెప్టెంబర్ 18:కరీంనగర్ కొత్తపల్లి (ఊర చెరువు) 17వ వార్డు పరిధిలో వినాయక నిమజ్జన ఏర్పాట్లు జరుగుతున్న వేళ ప్రధాన రహదారికి అడ్డంగా ఉన్న విద్యుత్ పోల్ స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. కొత్తపల్లి చెరువు బ్రిడ్జి సమీపంలో నిమజ్జన ఏర్పాట్లు చేపడుతున్న ప్రాంతానికి వెళ్లే మార్గంలో ఓ/20 ఓఅఐ 715 ఋఖ 79 నంబర్ గల విద్యుత్ పోల్ రహదారికి అడ్డంగా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. మళ్లీ మరియు జిల్లా యంత్రాంగం ప్రతి ఒక్క అధికారి కూడా సందర్శించి చూడడం జరిగింది ఇట్టి చెరువును పరిశీలించిన . అధికారులు పరిశీలించినప్పటికీ ఎవరి దృష్టి కూడా .ఇట్టి పోలు పైన పడకపోవడం ఘమనార్థం. మరో రెండు, మూడు రోజుల్లో వినాయక నిమజ్జన కార్యక్రమాలు జరగనున్న నేపథ్యంలో ఇదే మార్గం ద్వారా భారీ సంఖ్యలో భక్తులు, వాహనాలు, వినాయక విగ్రహాలు తరలివెళ్లే అవకాశం ఉంది. ఈ క్రమంలో రహదారికి అడ్డంగా ఉన్న విద్యుత్ పోల్ వల్ల ఇబ్బందులు తలెత్తడంతో పాటు ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. విద్యుత్ పోల్‌ను తొలగించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని స్థానికులు పేర్కొంటున్నారు. నిమజ్జన ఏర్పాట్లను అధికారులు పరిశీలిస్తున్నప్పటికీ, రహదారికి అడ్డంగా ఉన్న విద్యుత్ పోల్ విషయంలో తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వారు అంటున్నారు. ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకోవాలి. నిమజ్జన ఊరేగింపులు ప్రారంభమయ్యేలోపే విద్యుత్ శాఖ అధికారులు స్పందించి స్థలాన్ని పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. రహదారికి అడ్డుగా ఉన్న విద్యుత్ పోల్‌ను తొలగించడం లేదా సురక్షితంగా పక్కకు మార్చడం ద్వారా నిమజ్జన మార్గాన్ని ప్రమాదరహితంగా సిద్ధం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## రైతులు చెల్లించిన బీమా ఆధారంగా పంటలను నమోదు చేయాలి

పత్తికొండ మండల పరిధిలో హోసూర్ గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి సిద్దయ్య గౌడ్ ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారికి వినతిపత్రం అనావృష్టి, వర్షాభావ పరిస్థితుల కారణంగా తీవ్ర నష్టాల్లో కూరుకుపోయిన తమను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని హోసూరు గ్రామ రైతులు డిమాండ్ చేస్తున్నారు. రైతులు చెల్లించిన పంటల బీమా (ఇన్సూరెన్స్) ప్రీమియం రసీదులను పరిగణనలోకి తీసుకుని, దానికి అనుగుణంగా వ్యవసాయ శాఖ రికార్డుల్లో పంటలను సరిగ్గా నమోదు చేయాలని లేదా గ్రామాన్ని మెజారిటీ కరువు ప్రాంతంగా ప్రకటించాలని స్థానిక వ్యవసాయదారులు కోరుతున్నారు. ప్రధాన సమస్యలు ఒ రైతుల డిమాండ్లుపంట నమోదు ప్రక్రియలో వ్యత్యాసాలు: రైతులు కష్టపడి పంటలు సాగు చేసి, ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించినప్పటికీ... ఈ–పంట లేదా అధికారిక రికార్డుల్లో నమోదులో లోపాలు ఉండటం వల్ల బీమా పరిహారం అందే అవకాశం కోల్పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు: ఈ సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో పంటలు ఎండిపోయి పెట్టుబడులు కూడా దక్కని పరిస్థితి ఏర్పడింది. కరువు గ్రామంగా గుర్తింపు: హోసూరు గ్రామంలో మెజారిటీ విస్తీర్ణంలో పంట నష్టం వాటిల్లినందున, గ్రామాన్ని అధికారికంగా కరువు గ్రామంగా గుర్తించి ప్రత్యేక సహాయక చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ”మేము వేలాది రూపాయలు వెచ్చించి ఇన్సూరెన్స్ చెల్లించాం. అధికారులు వెంటనే క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, బీమా రసీదుల ఆధారంగా పంట నమోదును సరిచేసి, మా గ్రామానికి కరువు సహాయక చర్యలు అందించాలి.

”హోసూరు గ్రామ రైతులు

అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోకపోతే ఆందోళన కార్యక్రమాలను తీవ్రతరం చేస్తామని రైతులు హెచ్చరించారు. రైతు సంఘం నాయకులు రాజశేఖర్ నాయుడు, మధు తదితరులు పాల్గొన్నారు

### బాలింతలు తీసుకోవలసిన ఆహార పదార్థాలు.

### ఆహారంలో వైవిధ్యం తాజా వేడి భోజనం

పతికొండ మండలం చందలి గ్రామంలోని అంగనావాణి . కేంద్రములు– 1, 2 ఆధ్వర్యంలో పోషం మహా కార్యక్రమం నిర్వహిం చడమైనది. ఈ కార్యక్రమం లో భాగంగా గర్జిగీలు, బాలింతలు తీసుకోవలసిన పౌష్టికాహారం మరియు ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పంచారు. అరగనివాణీలో తాడివేడి భజనం ప్రసమాలు కు వచ్చే పిల్లలకు అందిస్తున్నామని చెప్పారు. 3సం.” నిండిన ప్రతి పిల్లలను అంగన్వాడి కి పంపాలని, ఆట పాటలో కఠిన విద్యను అందిసు భోజనం పెడతారని సిడిపిఓ పి. లలిత వివరించారు. జంక్ ఫుడ్క పిల్లలను దూరంగా ఉంచాలనీ, ఆహార పదార్థాలను వండడంలో నూనె వాడకం తగ్గించాలని పేర్కొన్నారు. ఉప్పు, చెక్కెరలక వాడాలన్నారు – ఇండ్లలో కుడా పోషక విలువలతో కూడ తక్కవగా కూడిన ఆహారాన్ని ఎల్లలకు అందించాలని తల్లులత ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీ కద నిర్వహించారు ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్,చంద్రమ్మ, అంగన్వాడీ టీచర్స్,ఆశీర్వాదమ్మ, ఎం సరస్వతి పాల్గొన్నారు

# వైసీపీ కేడర్ లో అయోమయం

## పోటీకి ద్వితీయ శ్రేణి నేతల అనాసక్తి

విజయవాడ, సెప్టెంబర్ 18, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో తీవ్ర అభద్రతాభావం, కంగారు స్పష్టంగా కనిపిస్తున్నాయి. తాడేపల్లి క్యాంప్ ఆఫీస్ నుండి స్థానిక నాయకులు, ఇన్‌ఛార్జ్‌లపై వస్తున్న ఆదేశాలు, హెచ్చరికలు ప్రస్తుతం క్షేత్రస్థాయిలో తీవ్ర గందరగోళానికి దారితీస్తున్నాయి. ఎన్నికల్లో పోటీ చేయాల్సిందే, వెనకడుగు వేస్తే పార్టీ శత్రువులుగానే భావిస్తాం అంటూ అధిష్ఠానం స్పష్టమైన హెచ్చరికలు జారీ చేయడం వెనుక వైఎస్ఆర్‌సీపీ ఎదుర్కొంటున్న కఠినమైన రాజకీయ పరిస్థితికి సాక్ష్యంగా కనిపిస్తోంది. సమస్య హైకమాండ్ ఆదేశాల్లో కాదు.. క్షేత్రస్థాయిలో అభ్యర్థులు సిద్ధంగా లేకపోవడంలోనే ఉందనేది స్పష్టమవుతోంది. గ్రామాలు, మండలాల్లో పోటీ చేయగల ఆర్థిక, అంగ బలం ఉన్న ద్వితీయ శ్రేణి నాయకులు ఎవరూ కూడా ప్రస్తుతం బరిలోకి దిగేందుకు మొగ్గు చూపడం లేదు. 2024 సాధారణ ఎన్నికల ఓటమి తర్వాత వైఎస్ఆర్‌సీపీ గ్రాఫ్ గణనీయంగా పడిపోవడం, నియోజకవర్గ స్థాయి అగ్రనేతలు సైతం సైలెంట్ అయిపోవడం , కూటమి వైపు చూడటంతో దిగువ స్థాయి నాయకత్వం తీవ్ర దిక్కుతోచని స్థితిలో పడింది. పోటీకి కావాల్సిన భారీ వ్యయాన్ని భరించి, రాజకీయంగా రిస్క్ తీసుకోవడానికి చాలామంది స్థానిక నేతలు వెనకాడుతున్నారు.పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే.. నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, పాత ఎమ్మెల్యేలకు కూడా గ్రామాలు, వార్డుల వారీగా అభ్యర్థులను వెతికి పట్టుకోవడం గగనతలమవుతోంది. బలమైన ఆర్థిక స్థోమత ఉన్న నేతలు ఇప్పటికే టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి పార్టీల కండువాలు కప్పుకోవడానికి ప్రాధాన్యత ఇస్తుండగా, మిగిలిన మధ్యస్థ నాయకులు పోటీకి దూరంగా ఉంటూ తటస్థంగా ఉండిపోవాలని భావిస్తున్నారు. పోటీ నుంచి తప్పుకుంటే భవిష్యత్తులో పార్టీలో స్థానం ఉండదు, మిమ్మల్ని శత్రువులుగా చూస్తాం అనే రీతిలో బెదిరింపుల రూపంలో ఒత్తిడి తెస్తుండటంతో వైఎస్ఆర్‌సీపీ క్యాడర్ నలిగిపోతోంది.ఈ భయానికి, ఆందోళనకు 2019-2024 మధ్య వైఎస్ఆర్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన స్థానిక ఎన్నికల తీరే ప్రధాన కారణమని స్థానిక నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పట్లో ఏకగ్రీవాల పేరిట, అధికార బలాన్ని ప్రయోగించి ప్రత్యర్థులను పోటీ చేయకుండా నిరోధించారనే విమర్శలు బలంగా ఉన్నాయి. ఇప్పుడు ప్రభుత్వం మారడం, కూటమి అధికారంలోకి రావడంతో తాము పోటీకి దిగితే పాత బకాయిలు, రాజకీయ కక్షసాధింపులు, కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందనే భయంతో ద్వితీయ శ్రేణి నేతలు వెనకడుగు వేస్తున్నారు. మరొక ప్రధానమైన అంశం.. నామినేషన్ల ఖర్చులు, ఎన్నికల నిర్వహణ వ్యయాన్ని పార్టీ పరంగా భరిస్తారా లేదా అనే దానిపై అధిష్ఠానం స్పష్టత ఇవ్వకపోవడం. కేవలం టికెట్ ఇస్తాం, పోటీ చేయండి అని ఒత్తిడి చేయడం తప్ప, ఓడిపోతే రక్షణగా ఉండే రాజకీయ అభయం గానీ, ఆర్థిక చేయూత గానీ దక్కదనే నమ్మకలేమి క్షేత్రస్థాయిలో బలంగా పాతుకుపోయింది. దీంతో ప్రతిష్ఠాత్మక స్థానిక ఎన్నికల్లో ఖాళీగా మిగిలిపోతే పార్టీ ఉనికికే ప్రమాదమని భావించిన అధిష్ఠానం, ఒత్తిడి తంత్రాలను ప్రయోగిస్తోందిఅధికారంలో ఉన్నప్పుడు చూపిన దూకుడు, ఓడిపోయాక క్యాడర్‌కు అందించాల్సిన భరోసాగా మారలేకపోవడమే వైఎస్ఆర్‌సీపీ ప్రస్తుత పరిస్థితికి ప్రధాన కారణం. హెచ్చరికలు, ఒత్తిళ్లతో నామినేషన్లు వేయించగలరేమో గానీ, గ్రామాల్లో కార్యకర్తల్లో కసిని, ఆత్మవిశ్వాసాన్ని నింపలేరనేది స్పష్టమవుతోంది. ఈ ఫోర్స్ పోటీ వ్యూహం స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీకి ఎంతవరకు మేలు చేస్తుందో లేక క్యాడర్‌ను పార్టీకి మరింత దూరం చేస్తుందో వేచి చూడాలి.

# కీలక నేతలు గుడ్ బై...

విశాఖపట్టణం, సెప్టెంబర్ 18, ఉత్తరాంధ్ర జిల్లాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కీలక నేతలంతా వరుసగా గుడ్‌బై చెబుతుండటం, మౌనం వహించడంతో అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రంగంలోకి దిగారు. బెంగళూరు నుంచి తాడేపల్లికి తిరిగొచ్చిన జగన్ సీనియర్ నాయకులు బొత్స సత్యనారాయణ, తమ్మినేని సీతారాంలను ప్రత్యేకంగా పిలిపించి మాట్లాడారు. పార్టీ వీడుతున్న వారి సంఖ్య పెరుగుతుండటంతో శ్రేణులకు ధైర్యం చెప్పేందుకు ఈ అత్యవసర భేటీలను నిర్వహించినట్లు తెలుస్తోంది.ఈ భేటీలో ప్రధానంగా మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం కుమారుడు ..పార్టీకి ఒక్క సీటు కూడా రాదని చేసిన ప్రకటనపై చర్చ జరిగింది. సాధారణంగా పార్టీ గీత దాటి మాట్లాడే నేతలను దూరంగా పెట్టే జగన్, ఈసారి మాత్రం విభిన్నమైన వ్యూహాన్ని అమలు చేశారు. వ్యాఖ్యలు ఎలా ఉన్నా, ప్రస్తుతం పార్టీ సీనియర్లను కాపాడుకోవడమే ప్రాధాన్యంగా భావించిన జగన్..పార్టీలో అంతర్గత పోరును పరిష్కరిస్తానని చెప్పకుండా.. ఎవరైనా ఏమనుకున్నా సరే, రాబోయే ఎన్నికల్లో శ్రీకాకుళం లోక్‌సభ ఎంపీ అభ్యర్థిగా నీకే హామీ ఇస్తున్నా అని తమ్మినేనితో నేరుగా చెప్పినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.మరోవైపు మాజీ మంత్రి బొత్స సత్యనారాయణతోనూ జగన్ విడిగా భేటీ అయ్యారు. విజయనగరం జిల్లా రాజకీయాల్లో బొత్స తీరుపై రకరకాల చర్చలు జరుగుతున్న సమయంలో ఎన్నికల దిశగా పూర్తి స్పష్టత ఇచ్చారు. రాబోయే అసెంబ్లీ పోరులో ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న చీపురుపల్లి నియోజకవర్గం నుంచే మళ్లీ పోటీకి సిద్ధమవ్వాలని అధినేత తేల్చిచెప్పినట్లు సమాచారం. నియోజకవర్గంలో పట్టు కోల్పోకుండా క్యాడర్‌ను సమాయత్తం చేసుకోవాలని సూచించారు.అయితే, అధినేత ఆఫర్ చేసిన టికెట్ల హామీలపై ఈ ఇద్దరు సీనియర్ నేతల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన కనిపించలేదు. ప్రస్తుతం రీజియన్‌లో ఒకట్రెండు సీట్లు కూడా గెలిచే వాతావరణం కనిపించనప్పుడు, ఇప్పటి నుంచే ఈ సీట్ల ఖరారు వల్ల ప్రయోజనం ఏంటనే నిరాశ వారిలో కనిపిస్తోందని భావిస్తున్నారు. అందుకే ఈ సమావేశం ముగిసిన తర్వాత కూడా బొత్స గానీ, తమ్మినేని గానీ మీడియాతో ఏమీ మాట్లాడలేదు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ప్రస్తుతం విచిత్రమైన రాజకీయ వాతావరణం నెలకొంది. అధికారంలో ఉన్నప్పుడు వ్యవస్థలను నడిపించిన తీరు, నేడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అనుసరిస్తున్న వ్యూహాలు పార్టీని మరింత నిరాశలోకి నెడుతున్నాయి. శ్రీకాకుళం జిల్లాలో బలమైన నేత, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం కుటుంబంపై చాపరం భూకబ్జా కేసు నమోదు అయింది. . హైకోర్టు వారికి తాత్కాలిక ఊరట నిచ్చింది. అయితే, కూటమి ప్రభుత్వ హయాంలో పోలీసులు కేసులు నమోదు చేసినప్పటికీ అరెస్టు కాకపోవడమే నేరమైనట్లు వైసీపీ అధిష్ఠానం భావించడం విడ్డూరంగా మారింది. అరెస్టు కాకుండా తప్పించుకున్నారంటే వారు కూటమి ప్రభుత్వంతో లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకున్నట్లేనని, కోవర్టులుగా మారిపోయారనే ముద్ర వేస్తున్నారు.ఈ అనుమానాల రాజకీయం కేవలం తమ్మినేని కుటుంబానికే పరిమితం కాలేదు. గతంలో వైఎస్సార్‌సీపీకి మూలస్తంభంగా ఉండి, ఇటీవలే రాజీనామా చేసి బయటకు వచ్చిన మాజీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి కూడా సరిగ్గా ఇదే తరహా తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తారు. కూటమి ప్రభుత్వం వచ్చాక దాదాపు అందరు కీలక నేతలపై ఏదో ఒక కేసు నమోదు కావడం లేదా అరెస్టులు జరగడం జరుగుతుంటే.. పార్టీ రాష్ట్ర కో-ఆర్డినేటర్‌గా ఉన్న సజ్జల రామకృష్ణారెడ్డిపై మాత్రం ఎలాంటి కేసులు, అరెస్టులు ఎందుకు నమోదు కావడం లేదని విజయసాయిరెడ్డి నిలదీశారు. అధికారంలో ఉన్నప్పుడు చట్టానికి అతీతంగా వ్యవహరించారని ఆరోపణలు ఎదుర్కొన్న సజ్జల, ఇప్పుడు కూడా ఎలాంటి చిక్కులు లేకుండా బయటపడటం కోవర్టు రాజకీయమే కాదా అన్న ప్రశ్నను ఆయన అధిష్ఠానం ముందే ఉంచారు.వైసీపీ అధిష్ఠానానికి మొదటి నుంచీ ఒక అలవాటు ఉందనే విమర్శలు బలంగా ఉన్నాయి. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ప్రాణపణంగా నిలిచే సీనియర్ నేతలను సైతం.. చిన్నపాటి అనుమానం రాగానే వెన్నుపోటుదారులు గా ముద్రవేసి పక్కన పెట్టేస్తారు. గతంలో బాలినేని శ్రీనివాసరెడ్డి, సామినేని ఉదయభాను వంటి పలువురు సీనియర్లు పార్టీకి దూరం కావడం వెనుక ఈ అధిష్ఠానం అనుమానాస్పద వైఖరి ప్రధాన పాత్ర పోషించింది. ఇప్పుడు శ్రీకాకుళంలో తమ్మినేని వర్గాన్ని కూడా పార్టీ సమావేశాలకు పిలవకుండా, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పదవి నుంచి తప్పించి రాజకీయంగా ఏకాకిని చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ ధోరణి వల్ల సీనియర్లు తమ ఆత్మాభిమానం కోసం ప్రత్యామ్నాయ దారులు చూసుకోవడం అనివార్యమవుతోంది.ప్రస్తుతం అధికారంలో ఉన్న టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి సైతం వైసీపీలో ఉన్న ఈ బలహీనతను పక్కాగా వాడుకుంటోందనే విశ్లేషణలు వస్తున్నాయి. సీనియర్ నాయకులపై కేసులు నమోదు చేయడం , కొంతమంది విషయంలో చట్టపరమైన ప్రక్రియను సాగదీయడం ద్వారా వైసీపీ అధిష్ఠానంలో గందరగోళాన్ని సృష్టించడంలో కూటమి వ్యూహాత్మకంగా సఫలమవుతోంది. చట్టం తన పని తాను చేసుకుపోతున్నప్పటికీ, ఫలానా నేతను అరెస్టు చేయలేదంటే ఆయన తమతో కుమ్మక్కయ్యాడు అనే సందేశం వైసీపీ క్యాంపులోకి వెళ్లేలా మైండ్ గేమ్ ఆడటంలో అధికార పక్షం పైచేయి సాధిస్తోంది. ఆ ఉచ్చులో పడిన వైసీపీ నేతలు సొంత పార్టీ క్యాడర్‌లోనే అనుమానాల దావానాలాన్ని రగిల్చి నేతలను రోడ్డున పడేస్తున్నారు. అనుమానపు పక్షి కరిచిన చందంగా తయారైన వైసీపీ పరిస్థితి వల్ల దశాబ్దాలుగా పార్టీకి అండగా నిలిచిన క్షేత్రస్థాయి నాయకత్వం పూర్తిగా దెబ్బతింటోంది. ప్రతి చిన్న అంశాన్ని కోవర్టు కోణంలోనే చూస్తే, రాబోయే రోజుల్లో వైఎస్సార్‌సీపీలో మిగిలేది కొద్దిమంది చుట్టూ ఉన్న కోటరీ మాత్రమే తప్ప, ప్రజాక్షేత్రంలో నిలబడే నాయకులు ఉండరనేది పచ్చి నిజం

# తల్లి-చెల్లితో సెటిల్మెంట్ దిశగా పావులు

కడప, సెప్టెంబర్ 18,కుటుంబం విషయంలో జగన్ తప్పుల్ని దిద్దుకునే ప్రయత్నం చేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. వైఎస్సార్ కుటుంబ అంతర్గత కలహాలు ఇప్పటికే రాజకీయంగా, సామాజికంగా ఊహించని నష్టాన్ని మిగిల్చాయి. ఎన్నికల వేళ చెల్లి షర్మిల, తల్లి విజయమ్మ రోడ్డెక్కి బహిరంగ లేఖలు రాయడం, పంపకాలపై కోర్టు మెట్లెక్కడం వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాజకీయ విశ్వసనీయతను దారుణంగా దెబ్బతీశాయి. ఇంట్లోనే న్యాయం చేయలేని నాయకుడు రాష్ట్రానికి ఏం చేస్తాడన్న విపక్షాల ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళ్లిందన్నది కాదనలేని సత్యం. ఈ క్రమంలో ఈ నష్టాన్ని ఇలాగే కొనసాగనిస్తే భవిష్యత్తు మరింత అగమ్యగోచరంగా మారుతుందని గ్రహించిన జగన్.. కుటుంబంతో వివాదాలకు తెరదించి, తల్లి-చెల్లితో సెటిల్మెంట్ దిశగా పావులు కదుపుతున్నారనే ప్రచారం జరుగుతోంది.ఈ పరిణామాల వెనుక ఉన్న ముఖ్య కారణం.. చుట్టూ ఉన్న సొంత కోటరీ పై జగన్‌కు నమ్మకం సన్నగిల్లడమేనని తెలుస్తోంది. వైఎస్ వివేకా హత్య కేసు నుంచి మొదలుకొని, షర్మిలకు వాటాల నిరాకరణ, ఎన్‌సీఎల్‌టీ వరకు వివాదాన్ని తీసుకెళ్లడంలో జగన్ పక్కనున్న కొందరు కీలక నేతలు, సలహాదారులే తప్పుడు మార్గదర్శనం చేశారన్న భావన ఇప్పుడు ఆయనలో బలపడినట్లు చెబుతున్నారు. కుటుంబంలో సయోధ్య కుదిర్చే బదులు చిచ్చు రాజేసి, తమ సొంత ప్రయోజనాలను కాపాడుకున్నారని ఆయన గుర్తించినట్లు ప్రచారం జరుగుతోంది. తల్లి, చెల్లిని దూరం చేసుకుని పార్టీ పరంగానే కాకుండా నైతికంగా తీవ్ర ఏకాకిగా మారిన పరిస్థితుల్లో.. తన కోటరీ మాటలను పక్కనపెట్టి నేరుగా రాజీకి సిద్ధపడటమే మేలనే ఆలోచనకు జగన్ వచ్చినట్లు భావిస్తున్నారు.జగన్ ఆలోచనా విధానంలో వస్తున్న ఈ మార్పుకు జాతీయ రాజకీయ సమీకరణాలు కూడా ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. కేంద్రంలో బీజేపీతో ఉన్న సమీకరణాలు, రాష్ట్రంలో కూటమి పటిష్టత దృష్ట్యా.. రాబోయే సార్వత్రిక ఎన్నికల నాటికి జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పుంజుకుంటుందనే గట్టి నమ్మకం వైఎస్సార్సీపీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

బీజేపీ అండ లేకపోతే కేంద్ర దర్యాప్తు సంస్థల నుంచి రక్షణ కష్టమని ఇన్నాళ్లూ భావించినప్పటికీ.. రేపటి రోజున కేంద్రంలో కాంగ్రెస్ కీలకంగా మారితే తన రాజకీయ భవిష్యత్తు కోసం ఆ పార్టీతో సఖ్యత తప్పనిసరి అని జగన్ అంచనా వేస్తున్నట్లు వినికిడి. అయితే, కాంగ్రెస్‌తో తెరవెనుక చర్చలు జరగాలన్నా, పార్టీ పెద్దల మద్దతు లభించాలన్నా.. ముందుగా రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్‌గా ఉన్న చెల్లెలు వైఎస్ షర్మిలతో ఉన్న వైరాన్ని పూర్తిగా పరిష్కరించుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే కొత్తగా వచ్చిన కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ ఇరువర్గాల మధ్య రాయబారానికి చొరవ చూపుతున్నారన్న గుసగుసలు బలపడుతున్నాయి.ఒకవేళ ఈ సెటిల్మెంట్ నిజంగానే పట్టాలెక్కితే.. గతంలో కుదిరిన ఎంవోయూ ప్రకారం సరస్వతి పవర్, భారతి సిమెంట్స్, సాక్షి , బెంగుళూరు ఎలహంక ప్యాలెస్ వంటి ఆస్తుల వాటాలను షర్మిల, విజయమ్మ పేర్లపైకి బదలాయించేందుకు జగన్ సిద్ధపడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. రాజకీయాల్లో అక్రమ సంపాదనగా ప్రత్యర్థులు ముద్రవేసిన ఆస్తుల్లో సైతం తన హక్కు కోసం పోరాడుతున్న షర్మిలకు ఆమె వాటా దక్కితే వివాదం సమసిపోవచ్చు. అయితే, జగన్ ఉచితంగా ఈ పంపకాలకు ఒప్పుకుంటారా అంటే కాదనే చెప్పాలి. ఆస్తుల సర్దుబాటుతో పాటుగా.. భవిష్యత్తులో జగన్‌ను రాజకీయంగా టార్గెట్ చేయకుండా ఉండాలని, రాజకీయంగా సహకరించాలని షరతు పెట్టే అవకాశం ఉంది. అయితే, గత ఐదేళ్లలో వ్యక్తిగతంగా, రాజకీయంగా తీవ్ర అవమానాలను ఎదుర్కొన్న షర్మిల.. కేవలం ఆస్తుల సర్దుబాటుతో జగన్ పెట్టే రాజకీయ షరతులకు ఏమేరకు తలొగ్గుతారు, కాంగ్రెస్ అధిష్ఠానం జగన్‌ను ఎంతవరకు విశ్వసిస్తుందనేది మాత్రం ఎవరూ చెప్పలేరు.

# 25 నుంచి కొత్త జిల్లా జెడ్పీ కార్యక్రమాలు

నెల్లూరు సెప్టెంబర్ 18, ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ పరిపాలన వికేంద్రీకరణ దిశగా కూటమి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన 15 జిల్లాల్లో ఈ నెల 25వ తేదీ నుంచి జిల్లా పరిషత్ (జడ్పీ) కార్యాలయాల తాత్కాలిక భవనాల్లో కార్యకలాపాలు అధికారికంగా ప్రారంభం కానున్నాయి. ప్రస్తుత జడ్పీ పాలకవర్గాల ఐదేళ్ల పదవీకాలం ఈ నెల 24వ తేదీతో ముగియనుండడంతో, మరుసటి రోజే కొత్త జిల్లాల పరిధిలో నూతన జడ్పీ వ్యవస్థలను అందుబాటులోకి తెచ్చేందుకు పంచాయతీరాజ్ శాఖ వేగంగా ఏర్పాట్లు చేస్తోంది.కొత్త జిల్లాల జడ్పీల నిర్వహణ కోసం ప్రభుత్వం ఇటీవలనే పరిపాలనాపరమైన ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తగా 15 జడ్పీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (అఇూ), అలాగే మరో 15 డిప్యూటీ సీఈవో పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ ఖాళీలను భర్తీ చేసేందుకు అర్హులైన పంచాయతీరాజ్ శాఖ అధికారులకు త్వరలోనే పదోన్నతులు కల్పించనున్నారు. జడ్పీల విభజన ప్రక్రియ సజావుగా సాగేలా చూడడానికి వీలుగా పాత ఉమ్మడి జిల్లాల కార్యాలయాల నుంచి సిబ్బందిని హేతుబద్ధీకరించి కొత్త జిల్లాలకు కేటాయిస్తున్నారు.ప్రస్తుతానికి శాశ్వత భవనాల నిర్మాణం పూర్తయ్యే వరకు, అన్ని జిల్లాల్లోనూ అనువైన ప్రభుత్వ లేదా ప్రైవేట్ తాత్కాలిక భవనాల్లోనే ఈ కార్యాలయాలను ప్రారంభించనున్నారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాలకు సంబంధించిన నిధుల మంజూరు, ఉపాధి హామీ పనుల పర్యవేక్షణ, స్థానిక సంస్థల అభివృద్ధి పనుల ప్రక్రియ కొత్త జిల్లాల పరిధిలోనే చాలా వేగంగా జరగడానికి వీలవుతుంది. ఈ నూతన జడ్పీల ఏర్పాటుతో జిల్లాల వారీగా స్థానిక పాలనకు పూర్తి స్థాయి అధికారాలు బదిలీ కానున్నాయి.

# సమన్వయం సాధించేది ఎలా

శ్రీకాకుళం సెప్టెంబర్ 18, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం ప్రతిపక్ష పాత్రలో కొనసాగుతోంది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి) నేతృత్వంలో పార్టీ కార్యకలాపాలు సాగుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, అంతర్గత విభేదాలు, నాయకుల మధ్య సమన్వయం వంటి అంశాలు రాజకీయ చర్చకు కారణమవుతున్నాయి. ఇటీవల పార్టీ అంతర్గత వ్యవహారాలపై పలువురు నేతలు చేస్తున్న వ్యాఖ్యలు కూడా ఈ చర్చకు మరింత ప్రాధాన్యం తీసుకొచ్చాయి.వైసీపీలో జగన్ తర్వాత పార్టీ వ్యవహారాలను నిర్వహించే విధానం గురించి చాలాకాలంగా రాజకీయ వర్గాల్లో భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం సజ్జల రామకృష్ణారెడ్డి రాష్ట్ర సమన్వయకర్తగా పార్టీ కార్యక్రమాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. 2026లో ఆయన ప్రాంతీయ సమన్వయకర్తలు, జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జులతో సమావేశాలు నిర్వహిస్తూ పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నట్లు వైసీపీ అధికారిక ప్రకటనలు కూడా వెల్లడిస్తున్నాయి.అయితే పార్టీకి సంబంధించిన నిర్ణయాలు క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తలకు ఎంత వేగంగా చేరుతున్నాయి? వారి అభిప్రాయాలు అధిష్ఠానానికి ఎంతవరకు చేరుతున్నాయి? అనే ప్రశ్నలు మాత్రం కొనసాగుతున్నాయి. ఒక రాజకీయ పార్టీ బలంగా ఉండాలంటే అధ్యక్షుడికి క్షేత్రస్థాయి పరిస్థితులపై ప్రత్యక్ష సమాచారం అందడం, నాయకులతో నిరంతర సంప్రదింపులు ఉండటం కీలకంగా మారుతుంది. ముఖ్యంగా ఎన్నికల పరాజయం తర్వాత పార్టీ నిర్మాణాన్ని పునర్వ్యవస్థీకరించుకోవాల్సిన పరిస్థితిలో ఈ అంశాలకు మరింత ప్రాధాన్యం ఉంటుంది.ఇక జిల్లాల స్థాయిలో కనిపిస్తున్న విభేదాలు వైసీపీకి మరో సవాలుగా మారుతున్నాయి. శ్రీకాకుళం జిల్లాలో మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం కుమారుడు చిరంజీవి నాగ్ తాజాగా సొంత పార్టీ నేతలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జిల్లా పార్టీ వ్యవహారాలపై తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ, తమ్మినేని సీతారాంపై వచ్చిన విమర్శలను జిల్లా నాయకత్వం ఖండించకపోవడాన్ని ఆయన ప్రశ్నించారు. ఇదే సమయంలో శ్రీకాకుళం వైసీపీలో అంతర్గత విభేదాలపై చిరంజీవి నాగ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి. పార్టీకి సంబంధించిన సమస్యలను అధిష్ఠానం నేరుగా పరిశీలించి పరిష్కరించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

ఇలాంటి పరిస్థితుల్లో జగన్‌కు పార్టీపై మరింత ప్రత్యక్ష పర్యవేక్షణ, నాయకులతో విస్తృతంగా సంప్రదింపులు, జిల్లాల వారీగా సమస్యలపై సమీక్షలు అవసరమనే చర్చ జరుగుతోంది. ప్రత్యర్థి పార్టీల వ్యూహాలకు స్పందించడంతో పాటు సొంత పార్టీలోని అసంతృప్తిని ముందుగానే గుర్తించడం కూడా రాజకీయంగా కీలకమే. అయితే వైసీపీ మాత్రం ప్రస్తుతం కేడర్‌ను బలోపేతం చేయడం, ప్రజా సమస్యలను ప్రస్తావించడం, సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేయడంపై దృష్టి పెడుతున్నట్లు అధికారికంగా చెబుతోంది.జగన్ ముందున్న ప్రధాన అంశం పార్టీని మరింత సమర్థవంతమైన సంస్థగా తీర్చిదిద్దడం. నాయకులు, కార్యకర్తలు, నియోజకవర్గ స్థాయి శ్రేణుల నుంచి వచ్చే అభిప్రాయాలను సమగ్రంగా స్వీకరించి, అవసరమైన చోట మార్పులు చేస్తే పార్టీ భవిష్యత్ రాజకీయ కార్యాచరణకు స్పష్టమైన దిశ ఏర్పడే అవకాశం ఉంటుంది.

# రేణిగుంటలో విషాదం

## విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్య.

రేణిగుంట హాస్టల్లో ఉండలేక ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. సాక్షి కార్యాలయం సమీపంలోని నారాయణ జూనియర్ కళాశాలలో ఘటన జరిగింది. పదహారేళ్ల బాలుడు ఫ్యాన్కు ఉరివేసుకుని ప్రాణాలు విడిచాడు. మృతుడు పిచ్చాటూరు గ్రామానికి చెందిన కె. పవన్ కళ్యాణ్ (16)గా గుర్తించారు,. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ చదువుతున్నాడు. విద్యార్థి మృతిని గమనించిన కళాశాల యాజమాన్యం వెంటనే అమర హాస్పిటల్కు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించారు. రేణిగుంట పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

# మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో పురిటి బిడ్డ మృతి



మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం వేకువ జామున పురిటి బిడ్డ మృతి చెందాడు. బాధితుల కథనం ప్రకారం.. పుంగనూరు పట్టణానికి చెందిన సాదిక్ భాషా భార్య సుమియా సుల్తానా 2 రోజుల క్రితం పురిటి నొప్పులతో ఆసుపత్రిలో చేరింది. డెలివరీ ఆలస్యం కావడంతో స్థానిక సిబ్బంది సలహాతో జిల్లా ఆస్పత్రిలో నీటి కొరత కారణంగా స్నానం చేసుకోని గురువారం బసినికొండలోని బంధువుల ఇంటికివెళ్లి, స్నానం చేసి అదేరోజే రాత్రి 10.30 గంటలకు తిరిగి ఆసుపత్రిలో జాయిన్ అయ్యింది. వైద్యులు పరీక్షించి సాధారణ ప్రసవ సమయంలో తల ముందు రాకుండా పేగు ముందుగా వచ్చి బేబీ మృతి చెందిందన్నారు. మరిన్ని వివరాలను అస్పత్రి అధికారులు వెల్లడించాల్సి ఉంది..

# 24నే నిమజ్జనం

హైదరాబాద్, సెప్టెంబర్ 18, గణేశోత్సవం ప్రారంభం కాగానే వినాయక నిమజ్జనం ఎప్పుడు చేస్తారు అనేది సర్వసాధారణంగా అడిగే ప్రశ్నలలో ఒకటి. కొందరు గణపతిని ఒకటిన్నర రోజులోపే నిమజ్జనం చేస్తే, మరికొందరు మూడవ, ఐదవ లేదా ఏడవ రోజు చేస్తారు. అయితే నవరాత్రులు పూజలందిస్తే తుదివీడ్కోలు అనంత చతుర్దశి రోజున జరుగుతుంది. 2026లో అనంత చతుర్దశి తేదీ సెప్టెంబర్ 24 , 25 తేదీ ఎప్పుడొచ్చింది? ఎందుకంటే సెప్టెంబర్ 24న చతుర్దశి ఆలస్యంగా ప్రారంభమవుతుంది. క్యాలెండర్ ప్రకారం, గణేష్ నిమజ్జనానికి ప్రధాన తేదీ 2026 సెప్టెంబర్ 25 శుక్రవారంతెలుగు పంచాంగం ప్రకారం భాద్రపద మాసం శుక్ల పక్ష చతుర్దశి సెప్టెంబర్ 24వ తేదీ రాత్రి 09:53 గంటలకు ప్రారంభమై, సెప్టెంబర్ 25వ తేదీ రాత్రి సుమారు 10:10 గంటలకు ముగుస్తుంది. సెప్టెంబర్ 24వ తేదీ సూర్యోదయం సమయానికి త్రయోదశి ఉంటుంది. .సెప్టెంబర్ 25వ తేదీన చతుర్దశి తిథి సూర్యోదయం, సూర్యాస్తమయానికి ఉంటుంది. అందుకే ఉదయించే తేదీని బట్టి అనంత చతుర్దశి వ్రతం, విష్ణు పూజ , పదవ రోజున చేసే గణేష్ నిమజ్జనం చేస్తారు. ఈ ఏడాది సెప్టెంబర్ 25 తేదీన గణేష్ నిమజ్జనం. వివిధ నగరాల్లో సూర్యోదయం మరియు స్థానిక క్యాలెండర్ల కారణంగా, తేదీ ముగిసే సమయం ఒకటి లేదా రెండు నిమిషాలు మారవచ్చు. అయినప్పటికీ, పండుగ తేదీ మాత్రం సెప్టెంబర్ 25న మారదు.

గణేష్ నిమజ్జనానికి 2026కి శుభ సమయం ఉదయం శుభ సమయం: ఉదయం 6:11 నుంచి 10:42 వరకు.

మధ్యాహ్నానికి శుభ సమయం: 12:13 జూఎ నుంచి 1:43 జూఎ వరకు.

సాయంకాల ముహూర్తం: సాయంత్రం 4:44 నుంచి 6:14 వరకు.

రాత్రి సమయం: రాత్రి 9:14 నుంచి 10:43 వరకు.

వీటిలో కుటుంబాలకు అత్యంత అనుకూలమైన సమయం ఉదయం 6:11 నుంచి 10:42 వరకు. బహిరంగ పండాల్‌ల వద్ద నిమజ్జన ఊరేగింపు సుదీర్ఘంగా ఉండటం వల్ల, సాయంత్రం లేదా రాత్రి సమయాన్ని కూడా ఎంచుకుంటారు. ముంబై, పూణే, నాగ్‌పూర్ లేదా ఇతర నగరాల్లోని చౌఘడియా సమయాలు కొన్ని నిమిషాల తేడాతో మారవచ్చు. అందువల్ల, స్థానిక పరిపాలన యంత్రాంగం నిర్దేశించిన సూర్యోదయం , నిమజ్జన సమయాలను పరిగణనలోకి తీసుకోవడం ముఖ్యం.నిమజ్జనానికి ముందు సాధారణ గణేశ పూజ చేయండి. బప్పాకు దూర్వా , ఎర్రని పువ్వులు, మోదకాలు లేదా ఇంట్లో తయారుచేసిన ప్రసాదాన్ని సమర్పించండి. అనంతరం, కుటుంబ సభ్యులందరూ కలిసి హారతి ఇవ్వండి. పూజ సమయంలో చేసిన ఏవైనా తప్పులకు క్షమాపణ కోరి, వచ్చే ఏడాది ఆయన తిరిగి రావాలని ప్రార్థించండి. చాలా కుటుంబాలలో విగ్రహాన్ని కదిలించే ముందు కొద్దిగా ముందుకు జరిపే సంప్రదాయం కూడా ఉంది. ఇది ప్రతిష్ఠాపన పూర్తయిందని .. బయలుదేరడానికి సమయం ఆసన్నమైందని సూచించే సంకేతంగా పరిగణిస్తారు. దీని తర్వాత చేతిలో అక్షతలు, పువ్వులు పట్టుకుని నిమజ్జనం కోసం సంకల్పం చేస్తారు.ఇంట్లో ప్రతిష్ఠించిన చిన్న మట్టి విగ్రహాలను ఒక బకెట్‌లో లేదా పెద్ద పాత్రలో నిమజ్జనం చేయవచ్చు. విగ్రహం పూర్తిగా కరిగిపోయిన తర్వాత, ఆ నీటిని ఒక మొక్కలో లేదా శుభ్రమైన మట్టిలో పోయడం పర్యావరణానికి మంచిది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన లేదా రసాయన రంగులతో చిత్రించిన విగ్రహాలను నదులు, చెరువులు లేదా సముద్రంలో నిమజ్జనం చేయకూడదు.గణేష్ చతుర్థి నాడు ప్రారంభమయ్యే ఈ వేడుక అనంత చతుర్దశి నాడు ముగుస్తుంది. ఈ రోజున, అనంత స్వరూపుడైన విష్ణుమూర్తిని పూజించడం 14 ముడుకుల అనంత సూత్రాన్ని ధరించడం సాంప్రదాయం. ఒకవైపు బప్పాకు వీడ్కోలు పలుకుతూ, మరోవైపు కుటుంబ రక్షణ, సంతోషం , శ్రేయస్సు కోసం విష్ణుమూర్తిని ప్రార్థిస్తారు. అందువల్ల 2026 సంవత్సర క్యాలెండర్‌లో గణేష్ విసర్జన ప్రధాన తేదీ అయిన సెప్టెంబర్ 25ని గమనించండి. సెప్టెంబర్ 24 రాత్రి చతుర్దశి వచ్చినప్పటికీ, పూజ , నిమజ్జనం మరుసటి రోజు, ఉదయించే శుక్లం నాడు జరుగుతాయి.

# ఎరక్కపోయి... ఇరుక్కుపోయిన గులాబీ

హైదరాబాద్, సెప్టెంబర్ 18, రాజకీయాల్లో ప్రత్యర్థిని ఇరుకున పెట్టేందుకు వేసే ప్రతి వ్యూహం ఆచితూచి ఉండాలి. ఏమాత్రం గురి తప్పినా లేదా మన రికార్డుల్లోనే లోపాలున్నా.. అది కాస్తా రివర్స్ అయి స్వయంకృతాపరాధంగా మారుతుంది. ప్రస్తుతం తెలంగాణలో భారత్ రాష్ట్ర సమితి పరిస్థితి అచ్చం చెట్టు కొట్టి నెత్తిన వేసుకున్నట్లే తయారైంది. రిజిస్ట్రేషన్ల శాఖలో నిషేధిత జాబితా అంశాన్ని పట్టుకుని, రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజల ఆస్తులు ప్రమాదంలో పడ్డాయంటూ ప్రజల్లో భయాందోళనలు సృష్టించాలని బీఆర్ఎస్ అగ్రనాయకత్వం భావించింది. దాదాపు కోటి ఎకరాలకు పైగా భూములు 22ఏ జాబితాలోకి వెళ్లాయని తీవ్రస్థాయి ప్రచారం చేసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆత్మరక్షణలోకి నెట్టాలని చూసింది.ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని వేసిన ఎత్తుగడ చివరకు తమ మెడకే చుట్టుకున్నట్లయింది గులాబీ పార్టీ పరిస్థితి. సాంకేతిక కారణాలతో రిజిస్ట్రేషన్ల శాఖలో సెక్షన్ 22ఏ కింద నమోదైన కొన్ని భూముల సమస్యను పట్టుకుని, కాంగ్రెస్ ప్రభుత్వంపై పెద్ద ఎత్తున ప్రజావ్యతిరేకతను మూటగట్టాలని బీఆర్ఎస్ తీవ్ర ప్రయత్నం చేసింది. ప్రభుత్వం ప్రజల ఆస్తులను లాక్కుంటోందంటూ క్షేత్రస్థాయిలో భయాందోళనలు సృష్టించేందుకు పార్టీ శ్రేణులు వ్యూహాత్మకంగా ముందుకొచ్చాయి. అయితే, ప్రభుత్వం ఎదురుదాడి చేయకుండా అత్యంత వేగంగా స్పందించడంతో బీఆర్ఎస్ వేసిన తొలి అడుగులోనే పట్టు తప్పింది.సాంకేతిక లోపం వల్ల కొద్దిమంది రైతులు, భూయజమానులకు మాత్రమే ఈ ఇబ్బంది ఎదురైందని గుర్తించిన రేవంత్ రెడ్డి సర్కార్, ఏమాత్రం మొండిపట్టుకు పోకుండా బహిరంగంగా వివరణ ఇచ్చింది. సంబంధిత శాఖ మంత్రి ప్రజలకు అసౌకర్యం కలిగినందుకు చింతిస్తూ, రికార్డులను వెంటనే సరిచేయాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. రోజుల వ్యవధిలోనే సమస్య పరిష్కారం కావడంతో రైతులు, సామాన్యుల్లో ఆందోళన సద్దుమణిగింది. దీంతో ప్రభుత్వాన్ని కార్నర్ చేయాలన్న ప్రధాన ప్రతిపక్షం వ్యూహం ప్రజల్లో పెద్దగా పనిచేయకుండా పోయింది.సమస్య పరిష్కారమైనా బీఆర్ఎస్ నాయకులు అదే అంశాన్ని పదేపదే ప్రస్తావిస్తూ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకోవడంతో, కాంగ్రెస్ నాయకత్వం రక్షణాత్మక ధోరణి వీడి తీవ్ర ఎదురుదాడికి దిగింది. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అమల్లోకి తెచ్చిన ధరణి పోర్టల్ వెనుక జరిగిన అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలు, కొందరు పెద్దలకు అనుకూలంగా జరిగిన మార్పుల చిట్టాను ప్రభుత్వం బయటపెట్టడం ప్రారంభించింది. ధరణి రూపకల్పన, నిర్వహణలో ఉన్న లొసుగులను రేవంత్ రెడ్డి వరుస ఆధారాలతో ప్రజల ముందుంచడంతో రాజకీయ విమర్శల దిశ ఒక్కసారిగా మారిపోయింది.ఈ పరిణామాల క్రమంలోనే కేసీఆర్ కుటుంబానికి చెందిన వ్యవసాయ క్షేత్రాలు, స్థిరాస్తుల విస్తరణ, వాటి రికార్డుల నమోదుపై ప్రభుత్వం తీవ్రస్థాయి ఆరోపణలు గుప్పించింది. అధికారంలో ఉన్న సమయంలో ఆస్తుల సమీకరణ ఎలా జరిగింది, ధరణి నిబంధనలు వీరికి ఎలా అనుకూలంగా మారాయనే అంశాలపై లెక్కలు బయటకు తీయడంతో వ్యవహారం వ్యక్తిగత ఆస్తుల వివాదంగా మారింది. దీంతో ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో సామాన్యుల 22ఏ భూముల కంటే కేసీఆర్ కుటుంబ భూములు, ఫామ్‌హౌస్‌లు, వాటి చట్టబద్ధతపైనే విస్తృత చర్చ మొదలైంది. ప్రజా సమస్యలపై పోరాడి మైలేజ్ పొందాలనుకున్న బీఆర్ఎస్, అంతిమంగా తమ సొంత రికార్డులపైనే ప్రశ్నలు లేవనెత్తే పరిస్థితి తెచ్చుకుంది. కాంగ్రెస్ సర్కార్‌ను ఇరుకున పెడతామనుకున్న ప్రయత్నం కాస్తా, గత పదేళ్ల నిర్ణయాలు మరియు అధినేత ఆస్తులపై ప్రజాక్షేత్రంలో విచారణ తరహా చర్చకు దారితీసింది. రాజకీయంగా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచబోయి, తామే చెట్టు కొట్టి మీద వేసుకున్న చందంగా బీఆర్ఎస్ ఆత్మరక్షణలో పడిపోయింది.

# సూటిగా సుత్తి లేకుండా కేసీఆర్ టార్గెట్

హైదరాబాద్, సెప్టెంబర్ 18, తెలంగాణ శాసనసభ వేదికగా నిషేధిత భూముల జాబితా, ధరణి పోర్టల్ నిర్వహణపై జరిగిన చర్చ రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ప్రాధాన్యత సంతరించుకుంది. గత కొన్నివారాలుగా 22ఎ జాబితాలో ప్రైవేట్ భూములు చిక్కుకున్నాయంటూ ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు చేసిన ఆరోపణలకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అసెంబ్లీలో అధికారిక రికార్డులతో సుదీర్ఘమైన వివరణ ఇచ్చారు. ఈ క్రమంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబానికి చెందిన భూకమతాలు, ఎర్రవల్లి ఫామ్‌హౌస్ పరిసరాల్లోని సర్వే నంబర్ల వివరాలను బహిర్గతం చేయడం ద్వారా ప్రతిపక్షం లేవనెత్తిన విమర్శనాత్మక అస్త్రాన్ని ప్రభుత్వం వ్యూహాత్మకంగా తిప్పికొట్టే ప్రయత్నం చేసింది.

సీఎం రేవంత్ రెడ్డి సభలో సమర్పించిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండల పరిధిలో కేసీఆర్ కుటుంబ సభ్యులు , బంధువుల పేరిట అధికారికంగా సుమారు 440 ఎకరాల భూకమతాలు రికార్డుల్లో ఉన్నట్లు తెలిపారు. కేసీఆర్ పేరిట 67 ఎకరాలు, కేటీఆర్ దంపతులు , వారి కుమారుడి పేరిట 123 ఎకరాలు, హరీశ్ రావు కుటుంబం పేరిట 29.5 ఎకరాలు, మరియు మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ రావు కుటుంబం పేరిట 79 ఎకరాల భూములు ఉన్నట్లు వెల్లడించారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్ కాంపౌండ్ పరిధిలో , దాని చుట్టుపక్కల విస్తరించి ఉన్న ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూముల కేటాయింపులపై 30 రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని సిద్దిపేట కలెక్టర్, రెవెన్యూ అధికారులను ఆదేశిస్తూ, నివేదిక ఆధారంగా ఆక్రమిత ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని అర్హులైన దళితులకు పంపిణీ చేస్తామని సీఎం ప్రకటించారు.ఈ దాడి వెనుక కాంగ్రెస్ ప్రభుత్వం పక్కా రాజకీయ, చట్టపరమైన ప్రణాళికతో ముందడుగు వేసినట్లు కనిపిస్తోంది. ధరణి పోర్టల్ అమలులోకి వచ్చాక భూ క్రమబద్ధీకరణ విధానాలు, రికార్డుల సవరణల పేరిట గత ప్రభుత్వ పెద్దలు లబ్ధి పొందారనే ఆరోపణలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం కాంగ్రెస్ ముఖ్య ఉద్దేశం. అదే సమయంలో, రాష్ట్రంలో 1 కోటి ఎకరాలు 22ఎ నిషేధిత జాబితాలో ఉందన్న ప్రతిపక్షాల వ్యాఖ్యలను సీఎం ఖండించారు. అడవులు, అసైన్డ్ భూములు, ప్రభుత్వ స్థలాలు, చెరువులు కలిపి మొత్తం 1.01 కోట్ల ఎకరాలు శాశ్వత నిషేధిత కేటగిరీలో ఉంటాయని, పౌరుల మధ్య వివాదంలో ఉన్న ప్రైవేట్ భూమి కేవలం 3.05 లక్షల ఎకరాలు మాత్రమేనని సీఎం స్పష్టత ఇచ్చారు.ఈ విమర్శలపై బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా స్పందిస్తున్నాయి. కేసీఆర్ కుటుంబం వద్ద ఉన్న భూములన్నీ దశాబ్దాల క్రితం చట్టబద్ధంగా కొనుగోలు చేసినవేనని, వ్యవసాయ అవసరాల కోసమే వాటిని ఉపయోగిస్తున్నామని ఆ పార్టీ నేతలు స్పష్టం చేస్తున్నారు. తమపై వస్తున్న ఆరోపణలు కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం తమ పరిపాలనా లోపాలను, 22ఎ డిజిటలైజేషన్ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి చేస్తున్న డైవర్షన్ పాలిటిక్స్ అని బీఆర్ఎస్ ప్రతిదాడికి దిగింది. నిబంధనలకు విరుద్ధంగా భూసే కరణ జరిగిందని నిరూపిస్తే ఎలాంటి చర్యల కైనా సిద్ధమేనని ప్రతిపక్ష నేతలు సవాల్ విసురుతున్నారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్ భూముల తనిఖీకి విచారణ బృందాన్ని ప్రకటిం చడం, సేకరించిన ప్రభుత్వ భూము లను దళిత రైతులకు కేటాయిస్తామని ప్రకటించడం కాంగ్రెస్ పార్టీకి సామాజికంగా కలిసివచ్చే అంశం.

అసైన్డ్ భూముల రక్షణ మరియు దళిత హక్కుల అంశాన్ని ఎత్తుకోవడం ద్వారా బీఆర్ఎస్‌కు డిఫెన్సివ్ వాతావరణాన్ని సృష్టించవచ్చని అధికార పక్షం ఆశిస్తోంది. అంతిమంగా చూస్తే, 22ఎ వివాదం కాస్తా తెలంగాణలో వ్యక్తిగత ఆస్తులు – భూముల విచారణ రణరంగానికి దారితీసింది.

30 రోజుల్లో సిద్దిపేట రెవెన్యూ అధికారులు ఇచ్చే విచారణ నివేదిక రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో ఎలాంటి మలుపులు తిప్పుతుందో, మరియు ఈ విచారణ ఎంతవరకు చట్టబద్ధంగా ముందుకు సాగుతుందో వేచి చూడాల్సి ఉంది.

# హుస్సేన్ సాగర్ లో నిమజ్జన వివాదం మళ్లీ తీవ్రరూపం

హైదరాబాద్, సెప్టెంబర్ 18,హైదరాబాద్‌లో వినాయక చవితి వేడుకలు ముగింపు దశకు చేరుకుంటున్న తరుణంలో ప్రతి ఏటా తలెత్తే హుస్సేన్‌సాగర్ నిమజ్జనం వివాదం మళ్లీ తీవ్రరూపం దాల్చింది. ట్యాంక్ బండ్ పైభాగాన ఎలాంటి నిమజ్జనాలు నిర్వహించకూడదని జీహెచ్ఎంసీ , హైదరాబాద్ పోలీసులు స్పష్టమైన ఫ్లెక్సీ బోర్డులు ఏర్పాటు చేయగా.. శతాబ్దాలుగా వస్తున్న సంప్రదాయ స్థలమైన ట్యాంక్ బండ్‌పైనే నిమజ్జనాలు జరిపి తీరతామని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి తెగేసి చెప్పింది. అధికారుల హెచ్చరికలు ఒకవైపు, ఉత్సవ సమితి హెచ్చరికలు మరోవైపు ఉండటంతో, అసలు కోర్టు తీర్పులేమిటి, హుస్సేన్‌సాగర్‌లో ఏ తరహా విగ్రహాలను నిమజ్జనం చేయడానికి అనుమతి ఉందనే అంశంపై సగటు భక్తుల్లో తీవ్ర అయోమయం నెలకొంది.హుస్సేన్‌సాగర్‌లో విగ్రహాల నిమజ్జనంపై ప్రధానంగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు , మట్టి విగ్రహాల మధ్య వ్యత్యాసాన్ని చట్టం స్పష్టంగా నిర్వచించింది. 2021లో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు ప్రకారం, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా హుస్సేన్‌సాగర్‌తో పాటు ఎలాంటి సహజ జలాశయాలలోనూ పిఓపి విగ్రహాలను నిమజ్జనం చేయకూడదు. పిఓపి విగ్రహాల కోసం నగరవ్యాప్తంగా ప్రత్యేకంగా నిర్మించిన బేబీ పాండ్స్ లో మాత్రమే నిమజ్జనం జరపాలని ఆదేశించింది. అయితే, పర్యావరణ అనుకూలమైన మట్టి విగ్రహాలకు మాత్రం హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనానికి అనుమతి ఉంది.ఈ క్రమంలోనే ట్యాంక్ బండ్ ప్రధాన వివాద స్పదంగా మారింది. ట్రాఫిక్ సమస్యలు, భద్రత , సరస్సు పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని అప్పర్ ట్యాంక్ బండ్ నుంచి నేరుగా విగ్రహాలను నీటిలో వేయడాన్ని హైకోర్టు నిషేధించింది. అందుకోసమే అధికారులు ట్యాంక్ బండ్ వెంట 10 అడుగుల ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేసి, ఫ్లెక్సీ బోర్డులు తగిలించారు. దీనికి ప్రత్యామ్నాయంగా పిఓపి రహిత, మట్టి విగ్రహాల నిమజ్జనం కోసం హుస్సేన్‌సాగర్ తీరంలోని ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా, నెక్లెస్ రోడ్ పరిసరాల్లో ప్రత్యేక క్రేన్లను అందుబాటులో ఉంచారు.అయితే, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి మాత్రం అధికారుల నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ట్యాంక్ బండ్ అనేది సాంప్రదాయక నిమజ్జన కేంద్రమని, అక్కడ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తోంది. అధికారులు తొలగించకపోతే తామే స్వయంగా ఆ బోర్డులను తీసివేసి, యథావిధిగా ట్యాంక్ బండ్‌పై నుంచే నిమజ్జనం జరిపి తీరతామని హెచ్చరించింది. పిఓపి , మట్టి విగ్రహాలనే భేదం లేకుండా ఉత్సవ మూర్తులన్నింటినీ హుస్సేన్‌సాగర్‌లోనే నిమజ్జనం చేయాలనేది ఉత్సవ సమితి ప్రధాన డిమాండ్. వాస్తవానికి గడచిన కొన్నేళ్లుగా ఇది ఒక పరిపాటిగా మారిపోయింది. ప్రతి ఏటా నిమజ్జనానికి కొద్దిరోజుల ముందు పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు ట్యాంక్ బండ్‌పై నిమజ్జనం లేదంటూ బోర్డులు పెట్టడం, ఆ తర్వాత నిమజ్జనం రోజున విపరీతమైన భక్తుల రద్దీ, ట్రాఫిక్ ఒత్తిడి మరియు ఉత్సవ సమితుల పట్టుదల కారణంగా క్రేన్లను ఏర్పాటు చేసి అనుమతించడం జరుగుతోంది. గత ఏడాది కూడా ట్యాంక్ బండ్‌పై 12 క్రేన్లు, ఎన్టీఆర్ మార్గ్‌లో 12 క్రేన్లు, పీపుల్స్ ప్లాజా వద్ద 8 క్రేన్లను ఏర్పాటు చేసి నిమజ్జనాలు నిర్వహించారు.ఈ ఏడాది కూడా ప్రభుత్వం , పోలీసులు చట్టపరమైన నిబంధనలను అమలు చేయడంలోనూ, పర్యావరణాన్ని కాపాడటంలోనూ, భక్తుల భావోద్వేగాలను బ్యాలెన్స్ చేయడంలోనూ కత్తిమీద సాము చేస్తున్నారు. ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజాల నుంచి మాత్రమే మట్టి విగ్రహాల నిమజ్జనాన్ని క్రమబద్ధీకరించడం, పిఓపి విగ్రహాలను బేబీ పాండ్స్ వైపు మళ్లించడం అధికారుల లక్ష్యం కాగా.. ఉత్సవ సమితి హెచ్చరికల మధ్య తుది నిమజ్జనం రోజున ట్యాంక్ బండ్ వద్ద ఎలాంటి పరిస్థితులు నెలకొంటాయో వేచి చూడాలి.

# 70 రూపాయిలకు చేరిన ఉల్లి

హైదరాబాద్, సెప్టెంబర్ 18, రెండు నెలల క్రితం వంద రూపాయలకు ఐదు కిలోల చొప్పున ఉల్లిపాయలను విక్రయించారు. ట్రాలీ ఆటోల మీద వీధి వీధి తిరిగి మరీ సరసమైన ధరలకే ప్రయివేట్ వ్యక్తులు ఉల్లిపాయలను విక్రయించారు. కానీ ఇప్పుడు పరిస్థితి తారుమారైంది. అవే ట్రాలీ ఆటోల మీద కిలో రూ.70 చొప్పున విక్రయిస్తున్నారు. పరిస్థితి చూస్తుంటే ఉల్లి ధర త్వరలోనే సెంచరీకి చేరువయ్యేలా ఉంది. ఉల్లి ధరల ఇంతలా పెరగడానికి కారణమేంటి? వంటల్లో ఉల్లికి ప్రత్యామ్నాయమేంటో చూద్దాం.వంటింట్లో అత్యవసరమైన ఉల్లిపాయ ధరలు గత కొంత కాలంగా భారీగా పెరుగుతున్నాయి. రిటైల్ మార్కెట్లో ఉల్లిపాయల ధర కిలో రూ.70కి చేరుకుంది. పంట దిగుబడి తగ్గడం, మార్కెట్లో సరఫరా తగ్గడంతో ఉల్లి ధరలు వేగంగా పెరుగుతున్నాయి. జులై వరకు హైదరాబాద్‌లో రూ.100కు 4 లేదా 5 కిలోల ఉల్లిపాయలను రోడ్ల పక్కన ట్రాలీ ఆటోల్లో ఉంచి విక్రయించేవారు. కానీ ఇప్పుడు అదే చోట, అదే ట్రాలీ వాహనాల్లో కనిష్టంగా రూ.200కు 3 కిలోల చొప్పున విక్రయిస్తున్నారు. ఈ చొప్పున చూస్తే ఉల్లి ధరలు ఒక్రటెండు నెలల్లోనే ఎంతా పెరిగాయో అర్థం చేసుకోవచ్చు.ఏపీ ప్రభుత్వం ఉల్లి ధరల భారం సామాన్యుడిపై పడకుండా చూడటం కోసం రైతు బజార్లలో రూ.35 కిలో చొప్పున విక్రయించే ప్రయత్నాలు చేస్తోంది. కేంద్రం ధరల స్థిరీకరణ నిధి ద్వారా 1 లక్షా 21 వేల టన్నుల బఫర్ స్టాక్‌ను మార్కెట్లోకి రిలీజ్ చేస్తోంది. అయితే ఇవి అందరికీ చేరడం లేదు. మరోవైపు వ్యాపారులు కృతిమ కొరతను సృష్టించి పరిస్థితిని సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఉల్లి ధరల సెగ తగులుతోంది.హైదరాబాద్‌లోని మలక్‌పేట మార్కెట్లో క్వింటాల్ ఉల్లి రూ.5500 వరకు పలుకుతోందని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌కు మహారాష్ట్ర నుంచి మాత్రమే ఉల్లి సరఫరా అవుతోంది. రోజుకు 5-6 వేల క్వింటాళ్ల వరకు విక్రయిస్తున్నామని వ్యాపారులు చెబుతున్నారు. సాధారణ రోజుల్లో మలక్‌పేట మార్కెట్‌కు గరిష్టంగా 8 వేల క్వింటాళ్ల వరకు ఉల్లిపాయలు వస్తుంటాయి.

# ఎర్రవల్లి ఫామ్ హౌస్ సర్వే షురూ


హైదరాబాద్, సెప్టెంబర్ 18, మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్ భూముల వ్యవహారం మరోసారి తెలంగాణ రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. సిద్ధిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లి, వెంకటాపూర్ పరిధిలోని భూములకు సంబంధించిన రికార్డులను రెవెన్యూ అధికారులు పరిశీలిస్తున్నారు. భూముల సర్వే నంబర్లు, పాత రికార్డులు, ప్రభుత్వ భూములు, పట్టా భూముల వివరాలను సేకరిస్తూ రిపోర్టును తయారు చేసే పనిలో అధికారులు పడ్డారు. కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్ భూములపై వాస్తవాలను తేల్చేందుకు విచారణ చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. బుధవారం రోజున అసెంబ్లీలో అధికారులను ఆదేశించిన నేపథ్యంలో ఈ ప్రక్రియ మొదలైంది. విచారణను 30 రోజుల్లో పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఇందులో భాగంగా మర్కుక్ తహసీల్దార్ కార్యాలయంలో పాత ఫైళ్లు, రెవెన్యూ రికార్డులను అధికారులు పరిశీలిస్తున్నారు. ఎర్రవల్లి, వెంకటాపూర్, పరిసర గ్రామాలకు సంబంధించిన సర్వే నంబర్లను పరిశీలించి.. ఆయా భూముల స్వరూపం, యాజమాన్య వివరాలు, గత రికార్డులను సేకరిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ భూములు, పట్టా భూములకు సంబంధించిన వివరాలను వేర్వేరుగా పరిశీలిస్తున్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. ముఖ్యంగా ఫామ్‌హౌస్ పరిధి, దాని చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ లేదా అసైన్డ్ భూములకు సంబంధించిన రికార్డులపై అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు సంబంధించి 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందంటూ సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చేసిన ఆరోపణలు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ నేపథ్యంలోనే మొత్తం ఫామ్‌హౌస్ విస్తీర్ణం ఎంత.. అందులో పట్టా భూమి ఎంత.. ప్రభుత్వ, అసైన్డ్ భూమి ఏ మేరకు ఉంది అనే అంశాలను అధికారులు నిర్ధారించాలని ఆయన ఆదేశించారు. ఫామ్‌హౌస్ మొత్తం విస్తీర్ణంపై కూడా స్పష్టత తీసుకురావాలని సూచించారు. అయితే.. ఈ ఆరోపణలు ప్రస్తుతం అధికారుల విచారణలో ఉన్న అంశాలే కాగా.. 388 ఎకరాల భూమి ఫామ్‌హౌస్‌లో భాగమైందా.. భూముల రికార్డుల్లో ఏవైనా అక్రమాలు లేదా నిబంధనల ఉల్లంఘనలు ఉన్నాయా.. అనే విషయాలు విచారణ పూర్తయిన తర్వాతే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. భూముల ప్రస్తుత పరిస్థితితో పాటు గతంలో వాటి పరిస్థితి ఎలా ఉండేదనే విషయాన్ని తెలుసుకునేందుకు రెవెన్యూ అధికారులు టెక్నాలజీని కూడా వినియోగిస్తున్నట్లు సమాచారం. గూగుల్ ఎర్త్ వంటి శాటిలైట్ మ్యాప్‌లలోని పాత చిత్రాలను పరిశీలించి.. గతంలో భూముల వినియోగం ఎలా ఉండేది, ప్రస్తుతం ఏమైనా మార్పులు చోటుచేసుకున్నాయా అనే అంశాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. పాత రెవెన్యూ రికార్డులు, సర్వే నంబర్లు, భూముల ప్రస్తుత స్థితి, శాటిలైట్ చిత్రాలను సమన్వయం చేసి అధికారులు వాస్తవ పరిస్థితిని అంచనా వేయనున్నట్లు సమాచారం. విచారణలో భాగంగా కేసీఆర్‌కు నోటీసులు జారీ చేసే అవకాశం ఉందని పలు నివేదికలు పేర్కొంటున్నాయి. అయితే నోటీసులు జారీ చేసినట్లు అధికారికంగా నిర్ధారిత సమాచారం వెలువడే వరకు దీనిని ఖరారు చేయడం సరికాదు. అధికారులు రికార్డుల పరిశీలన అనంతరం తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. మరోవైపు, భూములపై ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలను బీఆర్ఎస్ నేతలు రాజకీయ ఆరోపణలుగా కొట్టిపారేస్తున్నారు.

భూముల వివరాలను అధికారిక రికార్డులు, ఎన్నికల అఫిడవిట్ల ఆధారంగా పరిశీలించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ఇరు కుటుంబాల ఆస్తులపై న్యాయమూర్తి ఆధ్వర్యంలో విచారణ జరపాలని సవాల్ చేశారు. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం రెవెన్యూ అధికారులు సేకరిస్తున్న రికార్డులపై ఆసక్తి నెలకొంది. ఫామ్‌హౌస్ పరిధిలోని భూముల్లో ఏవి పట్టా భూములు, ఏవి ప్రభుత్వ భూములు, ఏమైనా అసైన్డ్ భూములు ఉన్నాయా.. రికార్డుల్లో పేర్కొన్న విస్తీర్ణానికి, క్షేత్రస్థాయిలో ఉన్న భూమికి మధ్య ఏమైనా తేడా ఉందా వంటి అంశాలపై అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. విచారణ పూర్తయిన తర్వాత అధికారులు సమర్పించే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. దీంతో ఎర్రవల్లి ఫామ్‌హౌస్ భూముల వ్యవహారం రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయాల్లో మరింత చర్చకు దారితీసే అవకాశం కనిపిస్తోంది.

# ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు..

## ముగ్గురు విద్యుత్ శాఖ సిబ్బంది మృతి..

## ఇద్దరికి తీవ్ర గాయాలు



శంకరపట్నం : కరీంనగర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గురువారం రాత్రి శంకరపట్నం మండలం తాడికల్ గ్రామ శివారులో జాతీయ రహదారిపై రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని కారు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కారు నిజామాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా విద్యుత్ శాఖకు చెందిన ఐదుగురు సిబ్బంది కారులో వరంగల్ వైపు బయలుదేరారు. తాడికల్ గ్రామ శివారుకు చేరుకోగానే రహదారి పక్కన ఆగి ఉన్న లారీని కారు వేగంగా వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. ప్రమాద తీవ్రతకు ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులను నిజామాబాద్ విద్యుత్ శాఖలో పనిచేస్తున్న శేఖర్, విశ్వేశ్వరరావు, పర్షిగా పోలీసులు గుర్తించారు. తీవ్రంగా గాయపడిన ప్రవీణ్, మురళిని కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. సమాచారం అందుకున్న హుజూరాబాద్ ఏసీపీ మాధవి, సీఐ శ్రీనివాస్, ఎస్సై శేఖర్‌రెడ్డి ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించడంతో పాటు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# టిప్పర్ లారీ ఢీకొని స్కూటీపై వెళ్తున్న వ్యక్తి మృతి



పల్నాడు పిడుగురాళ్ల పట్టణంలోని గవర్నమెంట్ జూనియర్ కాలేజీ ఎదుట శుక్రవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. స్కూటీపై వెళ్తున్న వ్యక్తిని టిప్పర్ లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన వ్యక్తి అక్కడికక్కడే మృతి....మృతుడు పెదనెమలిపురి గ్రామానికి చెందిన రామకృష్ణగా గుర్తించినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంతో ఘటనాస్థలంలో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సమాచారం అందుకున్న పట్టణ ఎస్ఐ శివ నాగరాజు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు... మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు...ప్రమాదంపై పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికానున్నాయి.

## రేణిగుంట రైల్వే స్టేషన్లో కలకలం

రేణిగుంట రైల్వే స్టేషన్లో ఓ వ్యక్తి హైటెన్షన్ విద్యుత్ వైర్ను ముట్టుకునేందుకు ప్రయత్నించడంతో కలకలం రేగింది. అప్రమత్తమైన రైల్వే అధికారులు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో పలు రైళ్ల రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. సదరు వ్యక్తి మద్యం మత్తులో ఉన్నాడా, మతిస్థిమితం సరిగా లేక ఇలా ప్రవర్తించాడా అన్నది తెలియాల్సి ఉంది.

# వినాయక నిమజ్జనంలో యువకుడు గల్లంతు..!



అన్నమయ్య ములకలచెరువు మండలంలోని చౌడ సముద్రం గ్రామంలో గురువారం విషాద సంఘటన చోటుచేసుకుంది. చౌడసముద్రంలో ఏర్పాటు చేసిన గణపయ్యను సమీపంలోని ఏటిగడ్డ తండా వద్ద ఉన్న పెద్దేరు ప్రాజెక్టుకు నిమర్జనానికి తరలి వెళ్లారు. ఈ క్రమంలో చౌడసముద్రం గ్రామానికి చెందిన భావజాన్(24) విగ్రహంతో పాటు నీటిలో మునిగిగల్లంతయ్యాడు. నిన్న వెతికిన ఆచూకీ కనబడలేదు. శుక్రవారం ఉదయం మళ్లీ గాలింపు చర్యలు చేపట్టారు

## ఏపీ వ్యాప్తంగా డ్రగ్ కంట్రోల్ అధికారుల తనిఖీలు

అమరావతి డ్రగ్ కంట్రోల్ అధికారులు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగగా తనిఖీలు చేసారు. 100 మందుల దుకాణాల్లో తనిఖీలు.. అందులో 55 దుకాణాల్లో నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తిం,చారు,. భారీగా ట్రామాడోల్ ఇంజక్షన్లు స్వాధీనం చేసుకున్నారు. , ఐదుగురు అరెస్ట్ అయ్యారు. జంగారెడ్డిగూడెం మండలం వేగవరంలో పెద్దమొత్తంలో ట్రామాడోల్ వినియోగిస్తున్నట్లు గుర్తించారు.. ఈ ఏడాది శ్రీలక్ష్మీ శ్రీనివాస మెడికల్ ఏజెన్సీ 20 వేల ట్రామాడోల్ ఇంజెక్షన్లు కొనుగోలు చేసినట్లు గుర్తించారు. గుట్టుచప్పుడు కాకుండా దాచిపెట్టిన 7,550 ట్రామాడెక్స్ ఇంజక్షన్లు స్వాధీనం చేసుకునరారు. ట్రామాడెక్స్ ఇంక్షన్లను జంగారెడ్డిగూడెం, మేద్యానపు వరిగూడెం, వేగవరం, కుక్కునూరు తదితర ప్రాంతాల్లోని దుకాణాలు, వ్యక్తులకు సరఫరా చేసినట్లు గుర్తించారు. నకిలీ బిల్లులతో 5,200 ట్రామెక్ ఇంజక్షను డి.రూపా పెడ్డింటి మెడికల్ ఏజన్సీ కొనుగోలు చేసింది. 3,930 ఇంజెక్షన్లను తెలంగాణలోని ఓ మందుల దుకాణానికి విక్రయించినట్లు బిల్లులు డి.రూపా పెడ్డింటి మెడికల్ ఏజన్సీ చూపించింది. ఆ లావాదేవీలన్నీ నకిలీవని తెలంగాణ అధికారులు నిర్ధారించారు. శ్రీ లక్ష్మీ శ్రీనివాస మెడికల్ ఏజెన్సీ, డి.రూప పెడ్డింటి మెడికల్ ఏజెన్సీల లైసెన్సులు రద్దుకు చర్యలు ప్రారంభించారు.

## ఏసీబీకి చిక్కిన కీసర సీఐ, ఎస్ఐ.. స్థానికుల సంబరాలు



మేడ్చల్ మల్కాజిగిరి కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో ఏసీబీ ట్రాప్ తో సీఐ ఆంజనేయులు, ఎస్ఐ జ్ఞానేందర్ రెడ్డి పట్టుబడటం హాట్ టాపిక్గా మారింది. లంచం తీసుకున్న కేసులో సీఐ, ఎస్ఐలను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. అయితే సీఐ, ఎస్ఐ పట్టుబడటంతో స్థానికుల సంబరాలు చేసుకున్నారు. కీసర, బోగారం గ్రామాల వారు పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని బాణాసంచా కాల్చి హర్షం వ్యక్తం చేశారు. పలు కేసుల్లో లంచం ఇవ్వాలంటూ వేధించారని స్థానికులు ఆరోపించారు.

## నరసరావుపేటలో మసాజ్ సెంటర్పై పోలీసుల ఆకస్మిక దాడి

## నలుగురు అరెస్టు

నరసరావుపేటలో మసాజ్ సెంటర్పై పోలీసులు ఆకస్మిక దాడి చేసారు. ఓ వ్యక్తి, ముగ్గురు మహిళల ను అదుపులోకి తీసుకున్నారు. మసాజ్ సెంటర్లో జరుగుతున్న కార్యకలాపాల వెనుక సూత్ర దారులు ఎవరు..? పలువురు వ్యక్తులు అండదండలతో పోలీసులకు సైతం మామూళ్లు అందిస్తున్న ప్రధాన సూత్రధారి అని ఆరోపణలు వచ్చాయి. మసాజ్ సెంటర్ల నిర్వహణ పై పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నారు. ఘటన పై నరసరావుపేటలో హాట్ టాపిక్ నడుస్తోంది.

# గణాధుడి లడ్డును కైవసం చేసుకున్న భక్తాగ్రేసరుడు నరేంద్ర ముదిరాజ్...

## గాజులమండ్యం వినాయక చవితి వేడుకల ప్రత్యేక కథనం.

.రేణిగుంట: భారతీయ సంస్కృతిలో వినాయక చవితి ఉత్సవాలకు ఉన్న విశిష్టత అంతా ఇంతా కాదు. విఘ్నేశ్వరుని పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక శోభతో ప్రతి వీధి కళకళలాడుతుంది. ఇక గణనాథుని నిమజ్జనానికి ముందు జరిగే లడ్డు వేలంపాట ఈ పండుగలో అత్యంత ఆసక్తికరమైన, భక్తిభరితమైన ఘట్టం. ఈ లడ్డును దక్కించుకోవడం కేవలం ఒక ఆచారమే కాదు, మహాభాగ్యంగా, ఆయురారోగ్య ఐశ్వర్యాలను ప్రసాదించే దైవిక వరంగా భక్తులు భావిస్తారు. తిరుపతి ప్రాంతంలోని ప్రముఖ పారిశ్రామిక, చారిత్రక ప్రాంతమైన రేణిగుంట మండలం, గాజుల మండ్యం గ్రామంలో ఈ ఏడాది జరిగిన వినాయక చవితి మహోత్సవాలు అత్యంత వైభవంగా సాగాయి. ఈ వేడుకల్లో భాగంగా మూడవ రోజు బుధవారం నిర్వహించిన గణాధుడి లడ్డు వేలంపాటలో స్థానిక ప్రముఖులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ ఉత్సవాల్లో నరేంద్ర ముదిరాజ్ అత్యధికంగా 66 వేల రూపాయల భారీ మొత్తానికి గణనాథుడి లడ్డును కైవసం చేసుకుని భక్తిభావానికి నిలువెత్తు రూపంగా నిలిచారు.

గాజుల మండ్యం లో వైభవంగా వినాయక చవితి మహోత్సవాలు..?

రేణిగుంట మండలానికి తలమానికంగా ఉన్న గాజుల మండ్యం గ్రామంలో ఏటా వినాయక చవితి వేడుకలు అత్యంత ఘనంగా జరుగుతాయి. గ్రామ యువకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు కలిసి ఈ వేడుకలను కనులపండువగా నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా ఊరంతా పండగ వాతావరణం సంతరించుకుంది. ప్రతి రోజు రకరకాల పూజా కార్యక్రమాలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని పంచుతున్నారు. ?ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు బుధవారం నిర్వహించిన కార్యక్రమాలలో ప్రధాన ఆకర్షణ గణనాథుని లడ్డు వేలంపాట. ఈ వేలంపాట కోసం గ్రామస్థులు, చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు ఉత్సాహంగా తరలివచ్చారు. దేవుని ప్రసాదమైన లడ్డును సొంతం చేసుకోవడానికి భక్తుల మధ్య పోటీ నెలకొంది. చివరికి అందరి అంచనాలను తలకిందులు చేస్తూ భక్తి పారవశ్యంతో నరేంద్ర ముదిరాజ్ అత్యధికంగా వేల రూపాయల రికార్డు ధరకు లడ్డును దక్కించుకున్నారు.



ఉత్సవాల ముగింపు...

గాజుల మండ్యం గ్రామంలో జరిగిన వినాయక చవితి వేడుకలు కేవలం పూజా కార్యక్రమాలు తోనే కాకుండా ప్రజల మధ్య ఐక్యతను భక్తి భావాన్ని పెంపొందించడంలో విజయవంతమయ్యాయి. నరేంద్ర ముదిరాజ్ లాంటి భక్తా గ్రేసరుల భాగస్వామ్యం ఉత్సవాల వైభవాలు మరింత ఇనుమడింపజేసింది. విఘ్నేశ్వరుని కృపతో నరేంద్ర ముదిరాజ్ మరిన్ని విజయాలను సాధించాలని సమాజానికి మరింత సేవ చేసే శక్తిని ఆ దేవుడు ప్రసాదించాలని గ్రామ ప్రజలు ఆకాంక్షించారు.

## ఆలేరు నియోజకవర్గంలో నీళ్ల సమస్యకు త్వరలో పరిష్కారం

## మంత్రి కోమటిరెడ్డి

శాసనసభ జీరో అవర్ లో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అడిగిన ప్రశ్నకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమాధానం ఇచ్చారు. ఆలేరు నియోజకవర్గంలో చిన్న మున్సిపాలిటీలు ఇన్కమ్ లేక ఇబ్బందులు పడుతున్నాయి. కొత్తగా ఆర్డిఓ కార్యాలయం మంజూరు చేస్తే ఆలేరు ప్రాంతానికి కేటాయిస్తామని హామీ ఇచ్చారు . ఆలేరు ప్రాంతానికి కేటాయించాలని సభ ద్వారా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్తున్నాను. యాదగిరిగుట్టకు రోజుకు లక్షమంది భక్తులు వస్తున్నారు. బ్రిడ్జ్ స్థానంలో రోడ్ వెడల్పు చేసేందుకు కసరత్తు జరుగుతుంది. కేంద్రం సహకారంతో పర్వత్ మాలా స్కీంలో 2రోప్ వేలు యాదగిరిగుట్ట,తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాము. నీళ్ల సమస్యపై చర్చించి త్వరలోనే పరిష్కారం చూపటం జరుగుతుందని అన్నారు.

## ఆత్మకూరులో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పర్యటన

ఆత్మకూరులో తన పర్యటనలో భాగంగా రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఆత్మకూరులోని వెస్ట్ ఎంపీపీఎస్ పాఠశాల ప్రాంగణంలో రూ.28.30 లక్షల వ్యయంతో నిర్మించిన భవిత భవనాన్ని చిన్నారులతో కలిసి ప్రారంభించారు. ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో రూ.53 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక వనరుల కేంద్రం (ఎంఆర్సీ), ఎంఈఓ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి ఆనం వెల్లడించారు.

ఆత్మకూరు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశంలో మంత్రి పాల్గొన్నారు.

## సిబ్బంది రాక లేటు

## కాలెక్టరేట్ ప్రధాన గేటుకు తాళాలు

యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ ఉద్యోగులు విధులకు సమయానికి రాకపోవడంతో ఇన్చార్జ్ కలెక్టర్ భాస్కర్ రావు కఠిన చర్యలు చేపట్టారు. ఉదయం 11 గంటలవుతున్నా చాలామంది ఉద్యోగులు విధులకు హాజరుకాకపోవడంతో ఆయన ఆదేశాల మేరకు ఉదయం 10:40 గంటలకు కలెక్టరేట్ ప్రధాన గేటును మూసివేశారు.

## ఎంఐఎం ఎమ్మెల్యేలను చూస్తే అధికారులకు......

## పడుతుంది ఎమ్మెల్యే దానం

హైదరాబాద్ ఎంఐఎం ఎమ్మెల్యేలను చూస్తే అధికారులకు ?పడుతుందని కాంగ్రెస్ ఎమ్మెల్యే దానం నాగెందర్ వ్యాఖ్యానించారు. శుక్రవారం నాడు అయన అసెంబ్లీలో మాట్లాడుతూ వాళ్లు అమ్మనా బూతులు తిడతారని ఇందిరమ్మ ఇల్లు వాళ్లకు ఇస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్ల డ్రా ప్రక్రియలో కూడా అధికారులు మాకు విలువ ఇవ్వడం లేదు, ఎంఐఎం ఎమ్మెల్యేలకు భయపడుతున్నారు. నా నియోజకవర్గానికి మంజూరైన ఇందిరమ్మ ఇండ్లలో వేరే నియోజకవర్గం వాళ్లకి ఇచ్చారు. ఈ మాట మంత్రికి చెప్తే కూల్, కూల్ అని అంటున్నాడని అన్నారు.



## పక్కకు ఒరిగిన నాలుగు

## అంతస్తుల భవనం

హైదరాబాద్ హైదరాబాద్ గచ్చిబౌలి పరిధిలోని గోపన్నపల్లిలో నాలుగు అంతస్తుల భవనం ప్రమాదకరంగా ఒక వైపునకు ఒరిగింది. కేవలం 30 చదరపు గజాల చిన్న విస్తీర్ణంలోనే ఎలాంటి పునాది భద్రత లేకుండా నాలుగంతస్తుల నిర్మాణాన్ని నిర్వాహకులు చెపట్టారు. భవనం ఎప్పుడు కూలిపోతుందోనన్న భయంతో అప్రమత్తమైన అధికారులు, చుట్టుపక్కల నివాసితులను ఖాళీ చేయించారు.

## ప్లాట్లు కొనుగోలు చేసి ఏళ్లు గడుస్తున్నా రిజిస్ట్రేషన్

## చేయకపోవడంతో బాధితుల ఆందోళన

మేడ్చల్ జిల్లా ప్లాట్లు కొనుగోలు చేసి ఏళ్లు గడుస్తున్నా రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో బాధితులు ఆందోళనకు దిగారు. మేడిపల్లి పిఎస్ పరిధి పీర్జాదిగూడ బాలాజీనగర్ లోని రియల్ ఎస్టేట్ సంస్థ యజమాని ఆశిష్ ఇంటివద్ద బాధితులు, ఏజెంట్లు టెంట్ వేసుకుని నిరసన చేపట్టారు.2018లో యాదాద్రి భువనగిరి జిల్లా మాసాయిపేటలో సర్వహిత డెవలపర్స్ పేరుతో ఆశిష్, శ్రీకాంత్‌లు వెంచర్ నిర్వహించినట్లు బాధితులు, ఏజెంట్ లు తెలిపారు. ఏజెంట్ల ద్వారా సుమారు 100 మంది ప్లాట్లు కొనుగోలు చేశారని, నెలవారీగా చెల్లింపులు చేస్తూ ఒక్కొక్కరు సుమారు రూ.6 లక్షల నుంచి రూ.20లక్షల వరకు చెల్లించారని పేర్కొన్నారు.వారిలో కొంతమందికి రిజిస్ట్రేషన్లు చేసినప్పటికీ, మరికొందరికి ఇప్పటికీ రిజిస్ట్రేషన్లు చేయలేదని ఆరోపించారు. ఇదే సమయంలో వెంచర్ కోర్టు వివాదంలోకి వెళ్లడంతో ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి నోటీసులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల వివాహాలు, ఇతర అవసరాల కోసం డబ్బులు చెల్లించి ఇబ్బందులు పడుతున్నామని బాధితులు తెలిపారు.గత కొన్నేళ్లుగా సమస్యను ఎదుర్కొంటున్న తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బాధితులు, ఏజెంట్లు ఆశిష్ ఇంటివద్ద నిరసన చేపట్టారు.

సమస్యను పరిష్కరించి తమ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయాలని వారు కోరుతున్నారు.సంఘటన స్థలానికి చేరుకున్న మేడిపల్లి పోలీసులు, బాధితులతో పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.

## వినాయకుడిని దర్శించు కున్న టిడిపి సీనియర్

## నాయకులు రితీష్ రెడ్డి



బద్వేలు, బద్వేలు పట్టణంలో వినాయక చవితి పురస్కరించుకొని శుక్రవారం ఉదయం బద్వేలు పట్టణంలోని నాలుగు రోడ్లకూడల్లోని ఆర్యవైశ్య సంఘం వారు ఏర్పాటుచేసిన వినాయకుని టిడిపి సీనియర్ నాయకులు రితీష్ రెడ్డి, లోయర్ సగిలెర్ ప్రాజెక్ట్ చైర్మన్ ఈగ వెంకట రమణారెడ్డి, దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆర్యవైశ్య వర్తక సంఘం, వినాయక చవితి ఉత్సవ కమిటీ సభ్యులు కెవి సుబ్బారావు, సగల సురేష్, సముద్రాల సురేష్, దొంతంశెట్టి జయకుమార్, ముచ్చర్ల సురేంద్ర, టిడిపి యువ నాయకుడు రీతీష్ రెడ్డిని శాలువా కప్పి ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో రైల్వే కాంట్రాక్టర్ మేరెడ్డి శ్రీనివాసరెడ్డి,ఈగ సుబ్బారెడ్డి, మన్యం సుధాకర్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కనుమరుల పూటీ ప్రసాద్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కొలిశెట్టి నాగరాజా, కనుమరుల పూటీ లక్ష్మయ్య, జగదీశ్వర్ రెడ్డి, విద్యానగర్ సాంబశివారెడ్డి, తెలుగు మండలి యువత నవ జ్యోతి రెడ్డి, బిజి వేముల రాజశేఖర్ రెడ్డి, వెంకటయ్య యాదవ్, పోకల సాంబశివారెడ్డి,పొన్న రాజేష్, బిజివేముల విజయ్ రెడ్డి, అంకన వెంకటసుబ్బారెడ్డి, బైసాని జయరామిరెడ్డి, బెస్తవేముల సునీల్, భూపాలం రాఘవేంద్ర,పెసల సుబ్రహ్మణ్యం, చెవుల కృష్ణమూర్తి, తో పాటు పలువురు టిడిపి నాయకులకు కార్యకర్తలు పాల్గొన్నారు

## వేయి కోట్లు ఇచ్చి ఆ లక్ష కోట్ల ఆస్తులన్నీ తీసుకో

## కేటీఆర్




హైదరాబాద్ రేవంత్ రెడ్డి తనకు బాకా ఊదే అనుకూల మీడియాతో కేసీఆర్ కుటుంబం లక్ష కోట్ల ఆస్తులు కొల్లగొట్టారని చెప్పి రాయించాడు. ఒక పని చేయి రేవంత్ రెడ్డి.. వేయి కోట్లు ఇచ్చి ఆ లక్ష కోట్ల ఆస్తులన్నీ తీసుకో. మిగిలిన 99 వేల కోట్లతో ప్రజలకు చేస్తానన్న హామీలు అమలు చేయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.

హైదరాబాద్కు, రాష్ట్రానికి మంచి పేరు తెచ్చే ఫార్ములా ఈని తెస్తే అందులో ఏదో జరిగిపోయిందని దాన్ని రద్దు చేసి నా మీద కేసు పెట్టారు. నిన్న మొన్న తమిళనాడు సీఎం విజయ్ ఒక మోటార్ రేసింగ్ ఈవెంట్ కోసం లండన్ దాకా పోయి పెట్టుబడులు వచ్చేందుకు కృషి చేశాడు. అదే ప్రయత్నం మేము చేసి ఫార్ములా ఈ తీసుకొస్తే మా మీద కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారు. భూములను 22Aలో పెట్టి 30 శాతం కమిషన్ తీసుకుంటూ రేవంత్ రెడ్డి ఆడుతున్న నాటకాన్ని ఈ రాష్ట్ర ప్రజలు అర్థం చేసుకున్నారు అందుకే దాని నుండి ప్రజల దృష్టి మరల్చడానికి ఇలాంటి చిల్లర ప్రయత్నాలు చేస్తున్నావు . న్యాయస్థానాల మీద, న్యాయ వ్యవస్థ మీద అపారమైన విశ్వాసం ఉంది.. అందుకే రెండోసారి కోర్టు విచారణకు హాజరయ్యాను. భవిష్యత్తులో ఎప్పుడు పిలిచినా మళ్లీ కోర్టు విచారణకు వస్తానని అన్నారు.

## నవంబర్ 25 న అంజిలి రెడ్డి వివాహం

కడప ఎక్స్ వేదికగా కుమార్తె వైఎస్ అంజిలి రెడ్డి వివాహానికి సంబంధించి బిగ్ అప్డేట్ ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి ఇ,చ్చారు. ఈ నెల 24 న వైఎస్ అంజిలి రెడ్డి - సోమల రఘురామ్ రెడ్డి ల నిశ్చితార్థం . నవంబర్ 25 న వివాహం.. డిసెంబర్ 5 న రిసెప్షన్.. ఎక్స్ వేదికగా ప్రకటించారు. తొలి పెళ్లి కార్డును జూఖీ ఘాట్ వద్ద పెట్టి మహానేత ఆశీస్సులు తీసుకున్నామని తెలిపారు.

నాన్న స్వర్గీయ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశీస్సులతో.. - నా కుమార్తె వైఎస్ అంజిలి రెడ్డి - సోమల రఘురామ్ రెడ్డిల పరిశుద్ధ వివాహ మహోత్సవం జూఖీ కుటుంబంలో మరో సంతోషకరమైన క్షణం. ఇరువురి కలయిక దైవ సంకల్పం. నూరేళ్ల జీవితానికి శుభారంభం.

ఈ నెల 24న నిశ్చితార్థం, నవంబర్ 25న పరిణయం, అలాగే డిసెంబర్ 5న రిసెప్షన్ వేడుక శుభవార్తను.

దేవుడి ఆశీర్వాదంతో నాన్న ఘాట్ వేదికగా మీతో పంచుకోవడం అత్యంత ఆనందదాయకమని అన్నారు.

కాబోయే నూతన వధూవరుల దాంపత్య జీవితం కన్నుల పండుగగా, - సుఖసంతోషాలతో సాగాలని, అంజిలి రెడ్డి, రఘురామ్ రెడ్డిల.. - తొలి వివాహ ఆహ్వాన పత్రికను నా కుటుంబ సభ్యులతో, మరియు రఘురామ్ తల్లిదండ్రులతో కలిసి.. ఇడుపులపాయలోని నాన్న వైఎస్సార్ ఘాట్ వద్ద ఉంచి ఆశీస్సులు తీసుకోవడం జరిగింది. నాన్న దీవెనలు బిడ్డల జీవితాలకు కొండంత అండ. - ఆయన చూపిన సన్మార్గం వారికి ఎల్లప్పుడూ ఆదర్శప్రాయమని అన్నారు.

## వ్యవసాయ మార్కెట్ సెక్యూరిటీ గార్డులకు కనీస

## వేతన 26 వేల రూపాయలు ఇవ్వాలి....

### కుమ్మరికుంట్ల నాగన్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు



ఈరోజు సిఐ టి యు అనుబంధ సంఘం సెక్యూరిటీ గార్డుల సమావేశం వ్యవసాయ మార్కెట్లో మంగు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. దీనిని ఉద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కుమ్మరికుంట్ల నాగన్న మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టో కాంగ్రెస్ ప్రభుత్వం సెక్యూరిటీ గార్డ్స్ కి ఇచ్చిన హామీలను పరిష్కరించకుండా ఎప్పటికీ 30 నెలలైనా పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారు ఇంత కాలం తక్కువ వేతనం ఇచ్చి వెట్టి చాకిరి చేయించుకోవడం జరుగుతుంది ఇప్పటికైనా తక్షణమే కనీస వేతనం 26000 ఇవ్వాలని పని భద్రత కల్పించాలని ప్రభుత్వ ఉద్యోగాలు గుర్తించాలని ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యం కల్పించాలని పని ప్రదేశాలలో ఏమైనా జరుగుతే మార్కెట్ వారే వ్యక్తిగత ఇన్సూరెన్స్ చేయించాలని కార్మికుడు మార్కెట్లో పనిచేస్తూ ప్రమాదాల చనిపోతే ప్రభుత్వమే 25 లక్షల ఎక్సిగ్రేషియా ఇవ్వాలని రిటర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని 60 ఏళ్లు దాటిన వారికి వారి కుటుంబంలో ఒకరిని పెట్టుకోవడానికి అవకాశం ఇవ్వాలని అన్నారు ఈ డిమాండ్లన్నీ తక్షణమే పరిష్కరించాలని లేనియెడల రేపు రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి జనార్ధన్ రాములు సారయ్య యాకన్న సరోజన నారాయణ లక్ష్మ నవీను రామ సంధ్య ఆంజనేయులు సురేష్ సోమియా సాయి వెంకట్ నారాయణ తదితరులు పాల్గొన్నారు

## విద్యుత్ శాఖ పై సమీక్ష సమావేశం

## నిర్వహించిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు

### సిబ్బంది పని తీరుపై మండిపడ్డ ఎమ్మెల్యే



కందుకూరు నియోజకవర్గంలో విద్యుత్ శాఖ ద్వారా జరుగుతున్న కార్యక్రమాలు, మరియు విద్యుత్ సరఫరా లో సమస్యలు సిబ్బంది పనితీరుపై ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం పట్టణంలోని తన కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో ఎస్ ఈ కట్ట వెంకటేశ్వర్లు, మరియు నియోజకవర్గంలోని అన్ని మండల ఏఈ లతో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది నియోజకవర్గంలో లోని మండలాల్లో విద్యుత్ సమస్యలపై అదేవిధంగా గ్రామాల్లో జరుగుతున్న ఆర్డీఎస్ స్కిన్ ద్వారా అమలవుతున్న విద్యుత్ పనులపై సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడడం జరిగింది ఈ సమావేశంలో ఎమ్మెల్యే సిబ్బంది పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు విద్యుత్ స్తంభాలు ఇతర పరికరాలు మార్చటలో సిబ్బంది నిర్లక్ష్యంగా ఉంటున్నారని ప్రతిరోజు మీపై ఫిర్యాదులు వస్తున్నాయని చిన్న పని కూడా ప్రజలను పదేపదే కార్యాలయ కార్యాలయాలు చుట్టూ తిప్పుకోవడం జరుగుతుందని ఎమ్మెల్యే కు ప్రజలు ఫిర్యాదు చేయడంతో సిబ్బందిపై ఎమ్మెల్యే మండిపడ్డారు ఇప్పటికైనా మీ పద్ధతులు మార్చుకోవాలని వారిని హెచ్చరించడం జరిగింది

# లైసెన్స్‌కు ముందు భద్రతా పాఠాలు తప్పనిసరి

## (హెచ్.ప్రతాప్)

డ్రైవింగ్ లైసెన్స్ అంటే కేవలం వాహనం నడపగలమనే ధ్రువీకరణ కాదు. రహదారిపై మనతోపాటు ప్రయాణించే వందలాది మంది ప్రాణాలకు బాధ్యత వహించే సామర్థ్యానికి అది గుర్తింపు. అందుకే లైసెన్స్ పొందే ప్రక్రియలో రహదారి భద్రతను ఒక ప్రత్యేక శిక్షణగా చేర్చాలన్న తెలంగాణ ప్రతిపాదన ప్రాధాన్యత సంతరించుకుంది.

ప్రస్తుతం కూకట్‌పల్లి ఆర్టీఓ పరిధిలో ప్రయోగాత్మకంగా అమలవుతున్న ఈ కార్యక్రమంలో సుమారు 1,200 మంది నమోదు చేసుకోగా, దాదాపు 960 మంది కోర్సును పూర్తిచేసినట్లు సమాచారం. శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్ పరీక్షకు స్లాట్ బుక్ చేసుకునే ముందు రెండున్నర గంటల ఆన్‌లైన్ కోర్సును పూర్తిచేయడం ప్రతిపాదిత విధానంలో తప్పనిసరి కానుంది. ఆరు విభాగాల్లో 120కి పైగా వీడియోల ద్వారా రహదారి నియమాలు, రక్షణాత్మక డ్రైవింగ్, ప్రమాదాలను ముందుగానే గుర్తించడం, బాధ్యతాయుతమైన రహదారి ప్రవర్తన వంటి అంశాలను బోధించనున్నారు.

20 మార్కుల మూల్యాంకనంలో కనీసం 15 మార్కులు సాధించినప్పుడే డ్రైవింగ్ పరీక్షకు అవకాశం లభిస్తుంది. పాఠాలను మధ్యలో దాటవేయకుండా, వీడియో వేగాన్ని పెంచకుండా చూడాల్సి ఉండటం, ముఖ గుర్తింపు ద్వారా అభ్యర్థి స్వయంగా శిక్షణ తీసుకుంటున్నాడో లేదో నిర్ధారించడం వంటి చర్యలు కూడా ప్రతిపాదిత విధానంలో ఉన్నాయి. తెలుగు, ఆంగ్లం, హిందీ, ఉర్దూ భాషల్లో ఈ సదుపాయం అందుబాటులో ఉండటం కూడా విస్తృత ప్రయోజనానికి దోహదపడుతుంది.

ఈ చర్య అవసరాన్ని తెలంగాణ రహదారి ప్రమాద గణాంకాలు కూడా గుర్తుచేస్తున్నాయి. రాష్ట్ర రవాణాశాఖ గణాంకాల ప్రకారం 2024లో 25,934 రహదారి ప్రమాదాలు నమోదయ్యాయి. వీటిలో 7,281 మంది ప్రాణాలు కోల్పోగా, 15,401 మంది గాయపడ్డారు. ఈ సంఖ్యలు రహదారి భద్రతను కేవలం పరీక్షలో అడిగే ప్రశ్నగా కాకుండా, డ్రైవింగ్ సంస్కృతిలో భాగంగా మార్చాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తున్నాయి.

అయితే ఆన్‌లైన్ కోర్సు ఒక్కటే పరిష్కారం కాదు. వాస్తవ రహదారి పరిస్థితుల్లో శిక్షణకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. వర్షం, రాత్రి ప్రయాణం, పాదచారుల రద్దీ, అత్యవసర బ్రేకింగ్, అంబులెన్స్‌కు దారి ఇవ్వడం, ద్విచక్ర వాహనదారుల పట్ల అప్రమత్తత వంటి పరిస్థితులను శిక్షణలో ప్రత్యక్షంగా వివరించాలి. డ్రైవింగ్ పాఠశాలల నాణ్యతను పర్యవేక్షించడం, నిబంధనల ఉల్లంఘనపై క్రమబద్ధమైన అవగాహన కల్పించడం కూడా అవసరం.

ఇప్పటికే తెలంగాణ రవాణాశాఖ డ్రైవింగ్ పాఠశాలలను డిజిటల్ వ్యవస్థలతో అనుసంధానించడం, శిక్షణలో పారదర్శకత పెంచడం వంటి చర్యలు చేపడుతోంది. కొత్త ఆన్‌లైన్ కోర్సును ఈ వ్యవస్థతో అనుసంధానిస్తే మరింత సమగ్ర భద్రతా విధానం ఏర్పడుతుంది.

చివరికి డ్రైవింగ్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించడం లక్ష్యం కాకూడదు; సురక్షితంగా ఇంటికి చేరుకోవడం, ఇతరులను సురక్షితంగా ఇంటికి చేర్చడం అసలు లక్ష్యం కావాలి. లైసెన్స్ చేతిలోకి రాకముందే బాధ్యత మనసులోకి వస్తేనే రహదారి భద్రతలో నిజమైన మార్పు మొదలవుతుంది.

# ఆర్టిఐ ముసుగులో వసూళ్ల పర్వం..


**- వీళ్లకు సహకరిస్తున్నది అధికారులేనా ..!**

**- సామాన్యులు రోజులు తిరిగిన అందని సమాచారం వీళ్లకు ఎలా అందుతుంది..!**

**- వసుల్లరాయుల దూకుడుతో వ్యాపారస్తుల కలవరం...**

**- వసూళ్ల రాయులకు చెలమగీతం పాడాల్సిందే..**

హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 18ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు, ప్రభుత్వ శాఖల్లో పారదర్శకతను తీసుకురావడానికి ఉన్న సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ)ను కొందరు వ్యక్తులు దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సామాజిక కార్యకర్తలుగా పరిచయం చేసుకుంటూ వివిధ వ్యాపార సంస్థలు, సంస్థల నిర్వాహకులను లక్ష్యంగా చేసుకుని సమాచారం పేరుతో ఒత్తిళ్లు తెస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.




**అధికారుల సహకారం ఉందా..?**

సామాన్య ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ రోజులు తిరిగినా సకాలంలో అందని సమాచారం, కొందరు వ్యక్తులకు మాత్రం తక్కువ సమయంలోనే ఎలా అందుతోందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సంబంధిత శాఖల్లోని కొందరు అధికారుల సహకారం లేకుండా ఇంత వేగంగా సమాచారం అందుబాటులోకి వస్తుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

**వ్యాపారస్తుల్లో కలవరం**

తరచూ సమాచార అభ్యర్థనలు, నోటీసులు, ఫిర్యాదుల పేరుతో ఒత్తిడి పెరుగుతుండటంతో కొందరు వ్యాపారస్తులు ఆందోళనకు గురవుతున్నట్లు సమాచారం. చట్టబద్ధంగా సమాచారం కోరడం ప్రతి పౌరుడి హక్కే అయినప్పటికీ, ఆ హక్కును వ్యక్తిగత ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారా? అనే ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.

**వసూళ్ల ఆరోపణలపై విచారణ జరగాలి**

ఆర్టీఐ దరఖాస్తులు, ఫిర్యాదులను అడ్డుపెట్టుకుని ఎవరైనా వ్యక్తిగతంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లయితే, దానిపై సంబంధిత అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. నిజంగా వసూళ్లకు పాల్పడుతున్న వారెవరు? వారికి సహకరిస్తున్న అధికారులెవరైనా ఉన్నారా? అన్న అంశాలపై విచారణ జరిగితే వాస్తవాలు బయటపడే అవకాశం ఉంది.

చట్టబద్ధమైన ఆర్టీఐ వినియోగాన్ని గౌరవిస్తూనే, దాని పేరుతో ఎలాంటి అక్రమ వసూళ్లకు పాల్పడకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# రాఘవేంద్ర కాలనీలో వైభవంగా గణేశ ఉత్సవాలు....



నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీ రోడ్ నెంబర్ 1 లో వినాయక చవితి సందర్భంగా బజరంగ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మట్టి గణపతి మహాస్వామి వారికి విశేషంగా వేదమంత్రోచరణల మధ్య పూజా కార్యక్రమాన్ని అర్చకులు గోమటం మురళీమోహన్ ఆచార్యులు నిర్వహించారు. కాలనీవాసులు ఎస్. గోపాల్ రెడ్డి, ఆంజనేయులు, జెట్టి జ్యోతిశ్వరి దంపతులచే శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి నివేదించిన ప్రత్యేక ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తీగల సునీంద్ర,మాజీ వైస్ చైర్మన్ సి.బాబురావు, కాలనీవాసులు జెట్టి ధర్మరాజు,పద్మారావు, బ్యాంక్ శ్రీనివాస్,వేణు గౌడ్,కుర్మయ్య,బజరంగ్ యూత్ అధ్యక్షులు సందీప్ కుమార్,యూత్ సభ్యులు ప్రశాంత్, జ్ఞానేశ్వర్, ప్రవీణ్, నిఖిల్,అఖిల్, నాగరాజ్ కార్తీక్,భరత్, క్రాంతి ,సింహాద్రి,కమల్ కుమార్,కాలనీవాసులు, మహిళలు,చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# దానం నాగేందర్ అనర్హతపై హైకోర్టు తీర్పును స్వాగతించిన బీజేపీ

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**



హైదరాబాద్, సెప్టెంబర్ 18,దానం నాగేందర్ అనర్హతకు సంబంధించిన కేసులో హైకోర్టు ఇచ్చిన తీర్పును భారతీయ జనతా పార్టీ స్వాగతించింది. ప్రజాస్వామ్య పరిరక్షణ, న్యాయం కోసం బీజేపీ అనేక రోజులుగా పోరాటం చేస్తోందని బీజేపీఎల్పీ నేత తెలిపారు. ఒక పార్టీ తరఫున గెలిచి, అనంతరం మరో పార్టీ తరఫున కొనసాగుతున్న దానం నాగేందర్ వ్యవహారంపై బీజేపీ న్యాయస్థానాన్ని ఆశ్రయించిందని ఆయన పేర్కొన్నారు. స్పీకర్ నిర్ణయాన్ని హైకోర్టు కొట్టివేయడం ప్రజాస్వామ్య పరిరక్షణకు కీలకమైన పరిణామమని, ఈ తీర్పు ప్రజాస్వామ్య చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినదని అన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా తన వైఖరిని మార్చుకుని, ఇతర పార్టీల నుంచి తమ వైపు వచ్చిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలని బీజేపీ డిమాండ్ చేసింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలను ప్రోత్సహించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని విమర్శించింది.

బీజేపీ న్యాయం, ప్రజాస్వామ్యం పరిరక్షణ కోసం నిరంతరం పోరాడిందని, బీజేపీఎల్పీ నేతగా తాను దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు తీర్పుతో న్యాయం గెలిచిందని తెలిపారు. సంబంధిత ఎమ్మెల్యేలు వెంటనే రాజీనామా చేసి ప్రజల తీర్పు కోరాలని ఆయన డిమాండ్ చేశారు.

హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్లకుండా, తీర్పును గౌరవించి వెంటనే రాజీనామా చేసి ఎన్నికలకు రావాలని కాంగ్రెస్ పార్టీని కోరారు. ఈ వ్యవహారంలో ప్రతివాదులు సుప్రీంకోర్టును ఆశ్రయించకుండా ఉండేందుకు బీజేపీ తరఫున కేవియట్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. కేవియట్‌ను రేపటిలోగా ఫైల్ చేస్తామని వెల్లడించారు.

ప్రజాస్వామ్యంపై కాంగ్రెస్ పార్టీకి నిజమైన గౌరవం ఉంటే, పార్టీ మారిన ఎమ్మెల్యేలతో వెంటనే రాజీనామా చేయించి ప్రజల తీర్పును స్వీకరించాలని బీజేపీ డిమాండ్ చేసింది.

# ఉప్పరపల్లి వాక్ ల్యాండ్ స్కూల్ లో ఘనంగా టీచర్స్ డే



హైద్రాబాద్ సెప్టెంబర్ 18:హెయిల్ టాటా మణి చారిటబుల్ ట్రస్ట్, పోస్టినా ఫౌండేషన్ నేషనల్ రెండు సంస్థల చైర్మన్ సీఈవో డాక్టర్ కాకుమాను లూర్దు జ్యోతి పిల్లర్ మాత ఫౌండేషన్ చైర్మన్ సీఈవో డాక్టర్ పోలంకి జగదీష్ కుమార్ టీచర్స్ డే ని పురస్కరించుకొని శుక్రవారం వాక్ ల్యాండ్ స్కూల్ ఉప్పరపల్లి లో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి సినీ కవి ఉద్యమకారులు మాస్టర్ జి ముఖ్య అతిధిగా హాజరైనారు. అందులో భాగంగా బలగం సహదేవ్, యువ ఆర్ట్స్ సంస్థ వెంకటరమణ, టిఆర్ఎస్ లీడర్ శ్రీదేవి, ఇంకా కొంత ఉద్యమకారులు టీచర్ స్ అందులో మా సంస్థ ప్రెసిడెంట్స్ బాణాల ప్రేమలత, ౧.శేషు,పోలంకి ఉష రాణి, పుల్లకవిత, ఎం సావిత్రి,బి సహదేవ్, కొంతమంది కళాకారులు తో కలిసి ఈరోజు టీచర్స్ డే ను నిర్వహించినట్లు కకుమాను జ్యోతి టిలిపారు.

# వైష్ణవీ భర్త దారుణ హత్య అన్నంత పనీ చేసిన సంతోష్..

కరీంనగర్, సెప్టెంబర్ 18 యూట్యూబర్ వైష్ణవి హత్య కేసులో ప్రధాన నిందితుడైన ఆమె భర్త చిత్తరి హరిబాబు (26)ను తానే చంపానంటూ వైష్ణవి సోదరుడు సంతోష్ ఓ సెల్ఫీ వీడియో విడుదల చేశాడు. నిజామాబాద్‌లో గురువారం పట్టపగలు నడిరోడ్డుపై దుండగులు హరిబాబును కిరాతకంగా నరికి చంపారు. ఈ హత్య జరిగిన కొన్ని గంటల్లోనే సంతోష్ ఈ వీడియోను విడుదల చేస్తూ పోలీసులకు లొంగిపోతున్నట్టు ప్రకటించాడు. వైష్ణవి హత్యకేసులో గత కొంతకాలంగా బెయిల్‌పై బయట ఉన్న హరిబాబు, తన తల్లితో కలిసి నిజామాబాద్‌లోని ఇంద్రాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. రాజరాజేంద్ర చౌరస్తాలో మొక్కజొన్న కంకులు అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం, దాహం వేయడంతో పక్కనే ఉన్న చాట్‌బండి వద్దకు నీళ్ల కోసం వెళ్లాడు. అదే సమయంలో కారులో వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు అతడిపై దాడి చేశారు. ఒక వ్యక్తి కారులో నుంచి దిగి, పదునైన ఆయుధంతో హరిబాబు తలపై విచక్షణారహితంగా నరికాడు. కేవలం 10 సెకన్లలో 9 సార్లు కత్తితో నరికినట్లు సీసీ కెమెరాల్లో రికార్డయింది. తీవ్ర రక్తస్రావంతో హరిబాబు అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఈ ఏడాది మార్చి 16న జగిత్యాల జిల్లా కోరుట్లలో తన భార్య, నాలుగు నెలల గర్భిణి అయిన వైష్ణవి (19)ని హరిబాబు గొంతు నులిమి, కత్తితో పొడిచి హత్య చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. ఈ కేసులో అరెస్టయిన హరిబాబు, ఇటీవల బెయిల్‌పై బయటకు వచ్చాడు. అయితే, తన చెల్లి హత్య కేసులో ప్రభుత్వం న్యాయం చేయలేకపోయిందని, అందుకే తానే హరిబాబును హత్య చేశానని వైష్ణవి సోదరుడు సంతోష్ వీడియోలో తెలిపాడు. “నా చెల్లిలి హత్య కేసులో ప్రభుత్వం న్యాయం చేయలేకపోయింది. హరిబాబును నేనే చంపా. పోలీసులకు లొంగిపోతున్నా. నాకు శిక్ష పడకుండా ప్రజలు మద్దతు ఇవ్వాలి” అని సంతోష్ ఆ వీడియోలో కోరాడు. కోరుట్లకు చెందిన హరిబాబు, మాదాపూర్ గ్రామానికి చెందిన వైష్ణవి ప్రభుత్వాసుపత్రిలో స్వీపర్లుగా పనిచేస్తూ ప్రేమించుకున్నారు. 14 నెలల క్రితం పెళ్లి చేసుకుని, వైష్ణవి పుట్టింట్లోనే కాపురం పెట్టారు. ఆమె యూట్యూబ్ రీల్స్ చేస్తూ గుర్తింపు తెచ్చుకుంది. అయితే, కొద్దికాలానికే ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో, గర్భిణి అని కూడా చూడకుండా వైష్ణవిని హరిబాబు హత్య చేశాడు. వైష్ణవి తన కుటుంబంలో ఏకైక ఆడపిల్ల కావడంతో పాటు, ఆమెకు సొంత, సమీప బంధువుల కుమారులు కలిపి మొత్తం 13 మంది సోదరులు ఉన్నారు. వారందరికీ ఆమె అంటే ప్రాణం. ఆమె హత్యను జీర్ణించుకోలేకపోయిన సోదరులు, హరిబాబును కఠినంగా శిక్షించాలని, లేదంటే తామే చంపేస్తామని అప్పట్లో ప్రతినబూనారు. అన్నంత పనీ ఇప్పుడు చేయడం కోరుట్లలో చర్చనీయాంశంగా మారింది. ఆరు నెలల వ్యవధిలో జరిగిన ఈ రెండు హత్యలు ఇరు కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న టూ టౌన్ పోలీసులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి క్లూస్ టీమ్స్ సాయంతో సీసీటీవీ పుటేజీలను నిశితంగా పరిశీలిస్తున్నారు. వైష్ణవి కుటుంబ సభ్యుల ప్రమేయంపై పోలీసులు తొలి నుంచి అనుమానాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ, సంతోష్ చేసిన ప్రకటనతో దర్యాప్తు వేగం పుంజుకుంది. చట్టం తన పని తాను చేసుకుపోతుందనే నమ్మకం సన్నగిల్లి, బాధితులే నేరుగా రివెంజ్ కు పాల్పడడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. వ్యవస్థల వైఫల్యమే ఇలాంటి దారుణాలకు ఆస్కారం ఇస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి

# ఆత్మ ఆధ్వర్యంలో రెండు రోజుల ఆర్ పి ఎల్ శిక్షణ.



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 18:**రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటల సాగు, సేంద్రియ వ్యవసాయం, ఉద్యాన పంటలు మరియు పశు పోషణపై అవగాహన కల్పించేందుకు ఆత్మ ఆధ్వర్యంలో వైరా మండలంలోని ఖానాపురం రైతు వేదికలో రెండు రోజుల (జిల్లా పరిధి శిక్షణ కార్యక్రమం) నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆర్ ర్పల్ రికగ్నషన్ అఫ్ ప్రయార్ లెర్నింగ్ ( రిజిస్ట్రేషన్ ప్రయారిటీ లెర్నింగ్ ) అంశంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించారు. రైతులు తమ అనుభవం ద్వారా ఇప్పటికే పొందిన వ్యవసాయ నైపుణ్యాలను గుర్తించి, వాటికి శాస్త్రీయ పరిజ్ఞానాన్ని జోడించడం ద్వారా మరింత మెరుగైన వ్యవసాయ పద్ధతులను అవలంబించే విధానంపై శిక్షణ అందించారు.

ఈ కార్యక్రమంలో ఆత్మ (ఆత్మ ) ప్రాజెక్ట్ డైరెక్టర్ డి డి ఏ భూక్యా సరిత ,ఫ్టీసీ ఏ ఓ అరుణ కుమారి ,ఆత్మ చైర్మన్ మట్టూరి వెంకటేశ్వర రావు ఆత్మ డైరెక్టర్లు, వ్యవసాయ అధికారులు, కేవీకే శాస్త్రవేత్తలు, పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అధికారులు రైతులతో వ్యవసాయానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించి, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటల ఎంపికలో వైవిధ్యాన్ని పాటించాలని సూచించారు. ముఖ్యంగా ఈ కార్యక్రమంలో సరిత మేడం పప్పుధాన్యాల పంటల సాగును ప్రోత్సహించడం పంటల మార్పిడి విధానాన్ని అవలంబించడం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు అదనపు ఆదాయాన్ని పొందే అవకాశాలపై వివరించారు. అదే విధంగా పంటలకు అధిక మోతాదులో ఎరువులు వాడకూడదు అని సూచించారు సిఫార్సు మేరకు ఎరువులను ఉపయోగించి పంటలను పండించాలని తెలియజేశారు.

అదేవిధంగా కేవీకే సైంటిస్ట్ పావని మాట్లాడుతూ ప్రస్తుత పంటలలో సమస్య లపై అవగాహన కల్పించారు. రైతుల సందేహాలను నివృత్తి చేసారు. రైతులు తమ భూమి పరిస్థితులకు అనుగుణంగాప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టిసారించాలని సూచించారు.

సేంద్రియ వ్యవసాయం ప్రాధాన్యతపై ఫ్టీసీ ఏఓ అరుణ కుమారి వివరించారు. నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, సేంద్రియ ఎరువులు మరియు జీవ ఎరువుల వినియోగం, జీవ నియంత్రణ పద్ధతులు, రసాయన ఎరువులు, పురుగు మందులను శాస్త్రీయ సిఫార్సుల మేరకు వినియోగించడం వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. స్థిరమైన మరియు పర్యావరణహితవ్యవసాయ విధానాలను పాటించడం ద్వారా దీర్ఘకాలికంగా మంచి ఫలితాలను సాధించవచ్చని తెలిపారు. ఈ రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ద్వారా రైతులకు వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయం మరియు ప్రాయోగిక అంశాలపై అవగాహన కల్పించారు. శిక్షణలో పొందిన పరిజ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేసి, పంటల ఉత్పాదకతను పెంచడంతో పాటు రైతుల ఆదాయాన్ని పెంపొందించుకునే దిశగా ముందుకు సాగాలని, అదేవిధంగా వైరా మండలం లో 385 రకం పెసలు విత్తనాలు అందుబాటులో ఉన్నాయి కావలసిన రైతులు ఏఈఓ ని సంప్రదించాలి అని వ్యవసాయ అధికారి మంజుఖాన్ సూచించారు.

ఈ కార్యక్రమంలో ఆత్మ పీడీ బి. సరిత , ఫ్టీసీ ఏ శీ అరుణ కుమారి, మండల వ్యవసాయ అధికారి మాయన్ మంజుఖాన్ ఆత్మ చైర్మన్ వైరా మట్టూరు వెంకటేశ్వర రావు ,ఖానాపురం సర్పంచ్ భూక్యా బాలాజీ, వ్యవసాయ విస్తరణ అధికారులు వెంకట నర్సయ్య, కీర్తి, రాజేష్, యశ్వంత్, షేక్ లాల్ మహమ్మద్ , మార్కెట్ కమిటీ డైరెక్టర్ షేక్ మౌలాలి , యన్నాం కోటి రెడ్డి, గుడిపూడి రామకృష్ణ,ఎవి స్ రెడ్డి, ముత్తినేని రామారావు, షబానా, తదితర రైతులు పాల్గొన్నారు.

## మర్పల్లి బాల గజానన వినాయక ఉత్సాహంలో లడ్డు ప్రసాదం నీలి శ్రీమన్ కుటుంబానికి దక్కింది





**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 18 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం మర్పల్లి బాల గజనన వినాయక ప్రసాదం లడ్డు నీలి శ్రీమన్ కుటుంబానికి ప్రసాదం దక్కిందని నీలి శ్రీమన్ తెలిపారు బుజ్జ గణపయ్య లడ్డు వేలం పాటలో హోరాహోరీగా పాల్గొన్నారు కానీ వేలంపాటలో పాల్గొని 3500 కి చివరికి దైవ నిర్ణయం ప్రకారం నీలి శ్రీమన్ కుటుంబానికి లడ్డు దక్కినందుకు కుటుంబమంతా సంతోషం వ్యక్తపరిచినట్టు తెలిపారు

## నిజామాబాద్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో తీవ్ర విషాదం

## రివాల్వర్ మిస్‌ఫైర్ అయి ఆర్ఐ సతీశ్ మృతి

నిజామాబాద్, సెప్టెంబర్ 18 నిజామాబాద్ జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఈ ఉదయం తీవ్ర విషాదకర సంఘటన చోటుచేసుకుంది. విధులు ముగించుకుని తన సర్వీస్ రివాల్వర్‌ను శుభ్రం చేసుకుంటున్న సమయంలో ప్రమాదవశాత్తు తుపాకీ పేలడంతో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ హెచ్. సతీశ్ అక్కడికక్కడే మృతి చెందారు.పోలీసు వర్గాలు అందించిన ప్రాథమిక వివరాల ప్రకారం... ఆర్ఐ సతీశ్ తన విధులు పూర్తి చేసుకున్న అనంతరం హెడ్‌క్వార్టర్స్‌లో తన సర్వీస్ ఆయుధాన్ని శుభ్రం చేసే క్రమంలో ఈ దురదృష్టవశాత్తు ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.నిజాయతీగల అధికారిగా పేరుపొందిన ఆర్ఐ సతీశ్ మృతి చెందడంతో జిల్లా పోలీసు శాఖ తీవ్రగ్భ్రాంతికి గురైంది. పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఒక్కసారిగా విషాద ఛాయలు అలముకోగా, సహచర అధికారులు, సిబ్బంది ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

## రాజాధిరాజ్ యాత్ర’ అక్టోబరు 2 నుంచి

శ్రీకృష్ణుడి జీవితంలోని లీలలు, కథలను సంగీతం, నృత్యం, నాటకం, దృశ్య రూపకాల్లో ఆవిష్కరించే ‘రాజాధిరాజ్ యాత్ర’ ప్రదర్శన నగరంలో అక్టోబరు 2 నుంచి 4 వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. గ్రీన్ ల్యాండ్స్‌లోని హోటల్ ప్లాజాలో రాగ్ రంగ్ రాస్ సంస్థ వ్యవస్థాపకులు రితు షా, రోమిత్ షా కార్యక్రమం గోడపత్రికను ఆవిష్కరించి వివరాలు వెల్లడించారు. హైటెక్ సిటీలోని శిల్పకళా వేదికలో మూడు రోజుల పాటు సాగే ఈ ప్రదర్శనల్లో 120 మందికి పైగా నటీనటులు, సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. ప్రదర్శనకు టికెట్లు బుక్‌మైషోలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

## పంజాగుట్టలో ఐఫోన్ 18 ప్రో ఆవిష్కరణ

హైదరాబాద్ పంజాగుట్టలోని సమీర్ కమ్యూనికేషన్స్‌లో యాపిల్ నూతన ఫ్లాగ్‌షిప్ స్మార్ట్‌ఫోన్ ఐఫోన్ 18 ప్రో, ప్రో మ్యాక్స్ మోడళ్లను ఘనంగా ఆవిష్కరించారు. అత్యాధునిక కెమెరా, ఏ20 ప్రో చిప్, మెరుగైన బ్యాటరీ సామర్థ్యం, ఏఐ ఆధారిత ఫీచర్లతో ఈ కొత్త మోడళ్లు వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయని సంస్థ ప్రతినిధులు తెలిపారు. నూతన ఐఫోన్ మోడళ్లను పరిశీలించేందుకు టెక్నాలజీ ప్రియులు, కస్టమర్లు ఆసక్తి చూపారు.

## ఎస్ఐఆర్ హియరింగ్‌లో తప్పులకు తావివ్వొద్దు

## ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలకు సీఈఓ సుదర్శన్‌రెడ్డి ఆదేశం



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం సెప్టెంబరు 18:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో నోటీసుల హియరింగ్, ధ్రువపత్రాల అప్‌లోడింగ్ ప్రక్రియను ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉప్పల్, హబ్సిగూడ ప్రాంతాల్లో శుక్రవారం జరుగుతున్న ఎస్ఐఆర్ హియరింగ్ ప్రక్రియను ఆయన పరిశీలించారు.



ఓటు నిర్ధారణ, ధ్రువీకరణ పత్రాల సమర్పణ, రికార్డుల పరిశీలన, క్షేత్రస్థాయిలో ఓటర్లకు అందుతున్న సహాయాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు. మ్యాపింగ్ జరగని ఓటర్లు, ఓటరు కార్డుల్లోని వ్యత్యాసాలకు సంబంధించిన రికార్డులు, దరఖాస్తులను నిబంధనల మేరకు క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు హియరింగ్‌కు హాజరైనప్పుడు వారి వివరాలు, ఆధారాలను పూర్తిగా ధ్రువీకరించిన తర్వాతే తదుపరి చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

అర్హులైన ఓటర్ల వివరాలు క్రమపద్ధతిలో నమోదయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. నిర్దేశిత గడువులోగా ప్రక్రియ పూర్తయ్యేలా తగినంత సిబ్బందిని నియమించి, రోజువారీ లక్ష్యాలతో పనిచేయాలని ఆదేశించారు. బీఎల్ఓలు నిర్వహిస్తున్న రిజిస్టర్లు, కంప్యూటర్‌లో ధ్రువపత్రాల అప్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికాగుప్తా, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, తహసీల్దార్ పూల్‌సింగ్, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, సూపర్‌వైజర్లు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

## యువతలో హెచ్ఐవి, ఎయిడ్స్ పై అవగాహన కల్పించాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**హెచ్ఐవి రహిత జిల్లాగా ఖమ్మంను తీర్చిదిద్దాలి**

**ఎయిడ్స్ అవగాహన బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన జిల్లా కలెక్టర్**

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 18:**ఖమ్మం జిల్లాను హెచ్ఐవి, ఎయిడ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మంలోని ఎస్ఆర్‌డబిజిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఎయిడ్స్ అవగాహన బైక్ ర్యాలీని జిల్లా






కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఎస్ఆర్‌డబిజిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ పాత బస్టాండ్ వరకు కొనసాగింది. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, లింక్ వర్కర్లు తదితరులు హెచ్ఐవి, ఎయిడ్స్ నివారణ, నియంత్రణ, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన సందేశాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, హెచ్ఐవి వ్యాప్తిని అరికట్టేందుకు ముందస్తు అవగాహన, జాగ్రత్తలు, బాధ్యతాయుతమైన ఆరోగ్య అలవాట్లు ఎంతో కీలకమని అన్నారు. ముఖ్యంగా యువతలో ఎయిడ్స్ పై శాస్త్రీయమైన అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎయిడ్స్ తో జీవిస్తున్న వ్యక్తుల పట్ల వివక్ష చూపకుండా, వారికి సామాజిక మద్దతు అందించేలా ప్రజల్లో చైతన్యం కల్పించాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా హెచ్ఐవి నివారణ, నియంత్రణ కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేయాలని, ముఖ్యంగా యువత, విద్యార్థులు, అధిక ప్రమాదానికి లోనయ్యే వర్గాల్లో అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఎచ్ఐవి ఎలా వ్యాప్తి చెందుతుంది, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వ్యాధి నిర్ధారణ, చికిత్స, అందుబాటులో ఉన్న ప్రభుత్వ ఆరోగ్య సేవలపై ప్రజలకు సరైన సమాచారాన్ని చేరవేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

జానపద కళాబృందం ఆధ్వర్యంలో నిర్వహించిన కళాజాతా సాంస్కృతిక ప్రదర్శనలు, సంప్రదాయ కథన విధానం ‘పల్లె సుద్దులు’ ద్వారా ఎయిడ్స్ వ్యాప్తి, నివారణ, చికిత్స మరియు వివక్ష నిర్మూలనపై యువత, ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో డియంహెచ్ఓ డా. రామారావు, డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. వేణు మాధవ్, అదనపు జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి (ఎయిడ్స్ ు లెప్రసి) డాక్టర్ ఎల్. ప్రవీణ, ఎస్ఆర్‌డబిజిఎన్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ మహమ్మద్ జాకీరుల్లా, ఆర్ఆర్సీ కోఆర్డినేటర్ డాక్టర్ బి. చెంచు రత్నయ్య, ఐక్యూఎసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. సునంద, జిల్లా ఎయిడ్స్ నివారణ నియంత్రణ విభాగం అధికారులు, సిబ్బంది, కె.సి. పుల్లయ్య స్వచ్ఛంద సేవా సిబ్బంది, జనవాణి స్వచ్ఛంద సేవా సిబ్బంది, లింక్ వర్కర్స్ స్వచ్ఛంద సేవా సిబ్బంది, ఎ. శంకర్, అప్సా ప్రెసిడెంట్, డిగ్రీ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## భూముల రీసర్వే పకడ్బందీగా నిర్వహించాలి:

## కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ భూముల రీసర్వే నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహిస్తూ రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం చిగురుమామిడి మండలం ఉల్లంపల్లిలో కొనసాగుతున్న భూముల సర్వేను కరీంనగర్ ఆర్డీవో షర్మిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సర్వే అధికారులతో మాట్లాడి పలు వివరాలు తెలుసుకున్నారు. రీ సర్వేతో భూముల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు.సర్వే చేసే ముందు సంబంధిత రైతులకు తప్పనిసరిగా సమాచారం ఇచ్చి వారి సమక్షంలోనే సర్వే నిర్వహించాలని ఆదేశించారు. సాంకేతిక పరికరాలతో సర్వే చేస్తున్నందున హద్దుల వివరాల నమోదులో పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.గ్రామంలో రెండు బృందాలు రీసర్వ్ చేస్తున్నాయని.. ఇప్పటివరకు 605 ఎకరాలు సర్వే చేసినట్లు తహసీల్దార్ వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కనుకయ్య, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# డిజెఎఫ్ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి దామోదర రాజనర్సింహ



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 18 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా:**అక్టోబర్ 7న సంగారెడ్డిలో 11వ రాష్ట్ర మహాసభలకు మంత్రి కి ఆహ్వానంసంగారెడ్డి: దళిత జర్నలిస్టుల ఫోరం (డిజెఎఫ్) ఆధ్వర్యంలో అక్టోబర్ 7న సంగారెడ్డిలో నిర్వహించనున్న 11వ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్‌ను మంత్రి దామోదర రాజనర్సింహ ఆవిష్కరించారు.గురువారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తలారి యాదగిరి, జిల్లా అధ్యక్షుడు రామని అశోక్ ఆధ్వర్యంలో నాయకులు మంత్రిని కలిసి మహాసభలకు ఆహ్వానించారు. ఈసందర్భంగా మహాసభల లక్ష్యాలు, నిర్వహణ, డిమాండ్లను మంత్రికి వివరించారు. పోతిరెడ్డిపల్లి ఎక్స్ రోడ్‌లోని పిఎస్ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో మహాసభలు నిర్వహించనున్నట్లుతెలిపారు.దళిత జర్నలిస్టుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం కోసం మహాసభల్లో పలు తీర్మానాలు చేయనున్నట్లు నాయకులు పేర్కొన్నారు. దళిత జర్నలిస్టులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు, అర్హులందరికీ అక్రిడిటేషన్, ఇళ్ల స్థలాలు, పిల్లలకు ఉచిత విద్య, కుటుంబ సభ్యులకు పరిమితి లేని వైద్య సదుపాయం, ఉచిత బస్, రైలు పాసులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అభయహస్తం కింద రూ.12 లక్షలు, అకాల మరణం చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, నిరుద్యోగభృతిగా నెలకు రూ.15 వేలు అందించాలని కోరారు. సీనియర్ దళిత జర్నలిస్టులకు నామినేటెడ్ పదవులతో పాటు ప్రెస్ అకాడమీ చైర్మన్, సభ్యులుగా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మహాసభలను విజయవంతం చేసేందుకు జర్నలిస్టులు, మేధావులు, ప్రజా సంఘాలు సహకరించాలని డిజెఎఫ్ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో డిజెఎఫ్ సలహాదారు మీనంపల్లి కిషన్ రావు, జిల్లా కార్యదర్శి ముక్కగల్ల యాదన్న, జిల్లా ఉపాధ్యక్షుడు దానం మోహన్, కోశాధికారి ఎర్రోళ్ల సంపత్ కుమార్, హెచ్. దాసు తదితరులు పాల్గొన్నారు. మంత్రి వెంట జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా అధికారులు ఉన్నారు.

# సింగూర్ కెనాల్ , పెద్దరెడ్డిపేట్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు వేగవంతం చేయాలి మంత్రి దామోదర్ రాజనర్సింహ .



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 18 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:**జిల్లాలోనీటిపారుల పనులు, వ్యవసాయ రంగానికి నీటి లభ్యత, తాగునీటి అవసరాలు, సంక్షేమ వసతిగృహాల్లో మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమం ,సైన్స్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత శాఖల అధికారులతోగురువారం న మీక్షన మావేశంనిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని నీటిపారుదల ప్రాజెక్టులు, డ్యామ్‌ల భద్రత, తనిఖీ నివేదికలు, నేషనల్ డ్యామ్ సేఫ్టీ నివేదికలపై సమీక్షించారు. సింగూర్ కెనాల్, పెద్దరెడ్డిపేట్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను వేగవంతంగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందుబాటులోకితీసుకురావాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పంటలు సాగు చేసిన రైతులకు సాగునీటి ఇబ్బందులు కలగకుండా, అలాగే ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలనిసూచించారు.జిల్లాలో తాగునీటి అవసరాలపై ముందస్తు ప్రణాళిక రూపొందించాలని మంత్రి ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న నీటి నిల్వల వివరాలను ప్రతి వారం నివేదిక రూపంలో సమర్పించాలని, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నీటి లభ్యతను నిరంతరం పర్యవేక్షించాలనిసూచించారు ఇరిగేషన్ అధికారులు డ్యామ్‌లను క్రమం తప్పకుండా తనిఖీ చేసి, భద్రతకు సంబంధించిన అంశాలపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలన్నారు.

నీటిపారుదల పనులకు ఇసుక కొరత రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, పనుల పురోగతిపై నిరంతరంపర్యవేక్షణ ఉండాలని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వాతావరణ పరిస్థితుల వల్ల ఎదురయ్యే సమస్యలను ముందుగానే అంచనా వేసి జిల్లాలో అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ కొరత తలెత్తకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సాగునీరు, తాగునీరు, నీటి నిల్వలు, చేపట్టిన పనుల పురోగతికి సంబంధించిన అంశాలపై శాఖల వారీగా సమగ్ర నివేదికలు సమర్పించాలని సూచించారు.అందోల్ నియోజకవర్గంలో పోస్ట్‌మెట్రిక్ కళాశాల బాలికల వసతిగృహం ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని మంత్రి సూచించారు. జిల్లాలోని రెసిడెన్షియల్ వసతిగృహాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని, విద్యార్థులకు అవసరమైన అదనపు సౌకర్యాలు, వసతిగృహాల పరిస్థితులను పరిశీలించినివేదికలుసమర్పించాలనిఅధికారులనుఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పాండు, నీటిపారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులు విద్యావతి, జైభీమ్, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ అఖిలేష్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీష్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు....

# అంగన్వాడి సెంటర్లో పోషణ మాసం కార్యక్రమాలు



**ములుగు జిల్లా ప్రజా బలం ప్రతినిధి సెప్టెంబర్ 18** ఏటూరునాగారం ఏటూరు నాగారం మండల కేంద్రంలోపోషణ మాసంలో భాగంగా ఈరోజు తీగల వాయి 2 అంగన్వాడి కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమాన్ని జరిపించడం జరిగింది. ఈ సమావేశంలో భాగంగా దేశవ్యాప్తంగా పోషణ మాస కార్యక్రమం ప్రతి అంగన్వాడీ కేంద్రాలలో ఏర్పాటుచేసి పిల్లలు పోషణ లోపానికి గురికాకుండా ప్రతి కుటుంబం కూడా తమవంతుగా బాధ్యత వహించాలని, ఎవరు కూడా పోషణ లోపానికి గురికాకూడదని, ముఖ్యంగా ఈ రోజు కార్యక్రమంలో తల్లిదండ్రులు పిల్లల పట్ల సంరక్షకులుగా వ్యవహరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ సీతారాములు ఏ సి డి పి ఓ కమల సూపర్వైజర్ అనూష మరియు అంగన్వాడీ టీచర్లు ఆయాలు పాల్గొన్నారు

# వి ఆర్ 4 ట్రస్ట్ ద్వారా ఆదివారం అన్నప్రసాద వితరణ





**గండి పేట మండలం ప్రజా బలం ప్రతి నిధి 18 సెప్టెంబర్ 2026**పార్వతీ నందనుడు గజాననా ! గంగమ్మ ఒడీలోకి తరళి వెళ్లే నిమజ్జనం సందర్భంగా గత నాలుగు సంవత్సరాలుగా వి ఆర్ 4 సహయోగ్ చారిటెబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నార్సింగి మున్సిపల్ సర్కిల్ పరిధిలోని నెక్నంపూర్ సరస్సు ఎదురుగా ఉన్న పార్కింగ్ దారి ప్రక్కన అన్న ప్రసాద వితరణ గావిస్తు, భక్తుల మన్ననలు పొందుతున్న విషయం తెలిసిందే, అదే విధంగా ఈ సంవత్సరం కూడా 20-09-2026 ఆదివారం రోజున భక్తుల సౌకర్యార్థం ఉదయం 9 నుండి రాత్రి 9 గంటల వరకు వి ఆర్ 4 సహయోగ్ చారిటెబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో సేవా భావంతో తలపెట్టిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమానికి అందరినీ సాదరంగా సగౌరవముగ పార్టీలకు అతీతంగా ఆహ్వానించడ మైనది, అందులో భాగంగా స్థానిక నాయకులందరితో పాటు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, బి ఆర్ ఎస్ పార్టీ యువనేత కార్తీక్ రెడ్డిలను ఆహ్వానించడ మైనదని మేనేజింగ్ ట్రస్టీ అందె లక్ష్మణ్ రావు, దిలీపు కక్కడ, బొడ్డు శ్రీధర్, దేవి ప్రియ, మహాలక్ష్మి తదితరులు తెలిపారు.

# వైర్ చోరీ కేసులో నిందితుడి అరెస్టు

**జహీరాబాద్ సెప్టెంబర్ 18 ప్రజాబలం ప్రతినిధి** హద్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మరియంపూర్ గ్రామ శివారులోని చెరువు వద్ద నీటి పారుదల కోసం ఏర్పాటు చేసిన సుమారు 40 మీటర్ల వైర్ చోరీకి గురైన కేసులో ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. చినిగేపల్లి గ్రామానికి చెందిన ఖాజీపురం బక్కారెడ్డి ఫిర్యాదుతో ఎస్ఐ సుజిత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం గంగ్వార్ ఎక్స్ రోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా వచ్చిన వ్యక్తిని పట్టుకుని విచారించగా, న్యాల్కల్‌కు చెందిన ఫకీర్ మోసిన్ వైర్ చోరీ చేసినట్లు అంగీకరించాడు. అతని వద్ద నుంచి చోరీ చేసిన వైర్‌తో పాటు నేరానికి ఉపయోగించిన ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# వినాయక మండపం దగ్గర అన్నదాన కార్యక్రమం



**అమీర్పేట్ (ప్రజాబలం ప్రతినిధి నరేష్) సెప్టెంబర్ 18** రేణుకా నగర్ వెల్ఫేర్ అసోసియేషన్, బాల్కంపేట్ ఆధ్వర్యంలో వినాయక మండపం దగ్గర అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు మరియు కమ్యూనిటీ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముఖ్య అతిథులు గా బూరుగుల శ్యాంసుందర్ గౌడ్ దిశా కమిటీ సభ్యులు కాసాని శ్రీశైలం గౌడ్ ఉపాధ్యక్షులు, మహంకాళి-- సికింద్రాబాద్ జిల్లా చందు ముదిరాజ్ , జనరల్ సెక్రటరీ, ఎస్.ఆర్. నగర్ డివిజన్ ఎం. దుర్గ ప్రసాద్. లాహోర్ సింగ్ శ్రీనివాస్ గౌడ్ లక్ష్మణ్ రావు నవీన్ నిర్వాహకులు, నాయకులు మరియు స్థానిక కమ్యూనిటీ సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.

# హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

## రూ.10 వేల జరిమానా విధించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి పకడ్బందీ దర్యాప్తు, బలమైన సాక్ష్యాధారాలతో తీర్పు

**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి:** హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీరజ శుక్రవారం తీర్పు వెల్లడించారు. సమర్థవంతమైన దర్యాప్తు, శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా నిందితుడికి శిక్ష పడేలా పోలీసులు, ప్రాసిక్యూషన్ సమన్వయంతో కృషి చేసినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు.వేములవాడ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన కోరేపు రాజ్‌కుమార్‌కు, పుడారి శ్రీనివాస్ గౌడ్‌కు గతంలో వివాదాలు ఉండేవి. ఈ నేపథ్యంలో తరచూ ఇద్దరి మధ్య గొడవలు జరిగేవి. ఈ క్రమంలో శ్రీనివాస్ గౌడ్‌ను హత్య చేయాలనే ఉద్దేశంతో 2020 సెప్టెంబర్ 26న పని నిమిత్తం వెళ్తున్న ఆయనపై రాజ్‌కుమార్ గొడ్డలితో దాడి చేశాడు. తీవ్ర గాయాలపాలైన శ్రీనివాస్ గౌడ్ మృతి చెందాడు.ఈ ఘటనపై మృతుడి భార్య పుడారి వసంత ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి వేములవాడ సీఐ వెంకటేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తు అనంతరం నిందితుడు రాజ్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు.



కోర్టు విచారణ సందర్భంగా సిఎంఎస్ ఎస్ఐ శ్రవణ్ యాదవ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ మహేందర్, సిఎంఎస్ కానిస్టేబుల్ నవీన్ తదితరుల సమన్వయంతో ప్రాసిక్యూషన్ 18 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టింది. ప్రాసిక్యూషన్ తరఫున గత పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్, ప్రస్తుత పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజనీకాంత్ వాదనలు వినిపించారు. శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలతో పాటు సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించిన అనంతరం నిందితుడు కోరేపు రాజ్‌కుమార్‌కు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీవిత ఖైదు జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించారు.నిందితులు శిక్ష నుంచి తప్పించుకోలేరు నేరాలకు పాల్పడిన వారు చట్టపరమైన శిక్ష నుంచి తప్పించుకోలేరని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. పోలీసులు, ప్రాసిక్యూషన్ సమన్వయంతో కేసుల దర్యాప్తు, న్యాయ విచారణలో సమర్థవంతంగా పనిచేసి నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కేసులో పకడ్బందీగా దర్యాప్తు చేసి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అప్పటి వేములవాడ సీఐ వెంకటేశ్, ప్రస్తుత సీఐ వీరప్రసాద్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు శ్రీనివాస్, రజనీకాంత్, కోర్టు మానిటరింగ్ ఎస్ఐ శ్రవణ్ యాదవ్, కోర్టు కానిస్టేబుల్ మహేందర్, సి ఎం ఎస్ కానిస్టేబుల్ నవీన్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

### తప్పిన పెను ప్రమాదం

శ్రీ సత్యసాయి జిల్లా గుడిబండ మండలంలో ప్రమాదం తప్పింది. ఏపీఎస్ఆర్టీసీ బస్సు పొలంలోకి దూసుకెళ్లింది. గుడిబండ మండలం కడుపులయపాళ్యం వద్ద టర్నింగ్ వద్ద బస్సు 0అదుపుతప్పింది. ప్రమాద సమయంలో బస్సులో దాదాపు 100 మంది విద్యార్థులు వున్నారు. నాచేపల్లి నుంచి గుడిబండ, రామాయహట్టి, కడుపులయపాళ్యం మీదుగా మడకశిర వెళ్తుండగా ఘటన జరిగింది.

# వినాయకుడిని దర్శించి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



**జహీరాబాద్, సెప్టెంబర్ 18 ప్రజాబలం ప్రతినిధి:** వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా జహీరాబాద్ పట్టణంలోని పలు గణేష్ మండపాలను ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు సందర్శించారు. మహేంద్ర కాలనీలోని వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పుష్పాలు సమర్పించి, నియోజకవర్గ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. వినాయక ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఎమ్మెల్యే కోరారు. మండపాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అనంతరం పట్టణంలోని మరికొన్ని గణేష్ మండపాలను సందర్శించి నిర్వాహకులు, భక్తులతో మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ గుండప్ప, జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణ, మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షుడు సంజీవ్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, ఇంద్రారెడ్డితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మార్కండేయ నగర్‌లో ఘనంగా కుంకుమ పూజలు



**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి:** వేములవాడ పట్టణంలోని మార్కండేయ నగర్ కాలనీలో వివేకానంద యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయకుడి సన్నిధిలో కుంకుమ పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 350 మంది మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి గణనాథుని ఆశీర్వాదం పొందారు. వివేకానంద యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ 18వ వార్షికోత్సవం సందర్భంగా వినాయక నవరాత్రులను పురస్కరించుకుని ప్రతిరోజూ ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమాల ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కుంకుమ పూజకు దాతగా వ్యవహరించిన శ్రీ సన్నిధి వెంకటకృష్ణ దివ్య దంపతులను అసోసియేషన్ సభ్యులు, మార్కండేయ నగర్ కాలనీ ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు, కాలనీ మహిళలు, యువతులు, పద్మశాలి సంఘం కులబాంధవులు తదితరులు పాల్గొన్నారు.

## పట్లూర్ చాపల నాగేష్ మనుమరాలు తొట్టెల కార్యక్రమంలో పాల్గొన్న మాజీ సర్పంచ్ ఇందిరా అశోక్



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 18 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మరుపల్లి మండలం పట్లూర్ బి ఆర్ ఎస్ నాయకులు చాపల నాగేష్ మనుమరాలు తట్టల కార్యక్రమంలో పాల్గొన్న బి ఆర్ ఎస్ నాయకులు మాజి సర్పంచ్ దేవరదేశి ఇందిర అశోక్, బిఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు జి. అశోక్, మాజి ఎంపీటీసీ బి. రవి, మర్పల్లి సోసియేల్ మీడియా కన్వీనర్ కోటపల్లి వికాస్, మాజి వార్డ్ మెంబర్ బాలేష్, శేఖర్, పాండు, శంకర్, పాపయ్య, గౌస్, శ్రీనివాస్, ఇస్మాయిల్,తలారి నర్సిములు తదితరులు పాల్గొని పాపను ఆశీర్వదించిశుభాకాంక్షలు తెలిపారు.

## జమ్మికుంట నాయిని చెరువులో గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన పోలీస్ కమిషనర్ గౌస్ అలాం



**హుజరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 18** జమ్మికుంట పట్టణంలో జరగనున్న శ్రీ గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గణేష్ విగ్రహాల నిమజ్జనం కోసం నాయిని చెరువు వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ గౌస్ అలాం పరిశీలించారు. ఈ సందర్భంగా నిమజ్జన కార్యక్రమాన్ని సురక్షితంగా, వేగవంతంగా నిర్వహించేందుకు మూడు క్రేన్లతో నిమజ్జన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. పరిశీలనలో జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్), మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, హుజరాబాద్ ఏసీపీ మాధవి, సీఐ రామకృష్ణ గౌడ్, ఎస్ఐలు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, గత సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా నాయిని చెరువు వద్ద గణేష్ నిమజ్జనానికి అవసరమైన భద్రతా ఏర్పాట్లు, పారిశుధ్య చర్యలు, విద్యుత్ సౌకర్యాలు, తాగునీటి వసతి, లైటింగ్ మరియు ఇతర మౌలిక సదుపాయాలు సమకూర్చనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు గణేష్ మండపాలను సురక్షితంగా ఏర్పాటు చేసుకోవాలని, ప్రభుత్వం మరియు పోలీసు శాఖ జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటించాలని, భక్తి శ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు.

## కొండూరులో 2 ఏళ్ల కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిపై ఇంటింటి ప్రచారం

బద్వేలు నియోజకవర్గం అట్లూరు మండలం కొండూరు గ్రామంలో “2 ఏళ్ల కూటమి ప్రభుత్వం ? సంక్షేమం, అభివృద్ధి” కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో బద్వేలు టీడీపీ ఇంచార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. మంచూరు సూర్యనారాయణ రెడ్డికి స్థానిక ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమానికి ప్రజలు భారీగా తరలివచ్చి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అట్లూరు మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పంచలింగాల్ డీసీఎల్ సర్వేర్50% నమోదు పూర్తి అయ్యిందని కేసారం సంజీవులు తెలిపారు



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి సెప్టెంబర్ 18(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పంచలింగాల్ గ్రామంలో డి సి ఎల్ సర్వే నమోదు 50% పూర్తి అయిందని కేసారం సంజీవ్ తెలిపారు పంచలింగాల్ గ్రామ రైతులు పొలాల్లో వేసిన పంటలో పరిశీలిస్తూ జిపిఆర్ ద్వారా లొకేషన్ ఫాలఅప్ చేస్తూ పంటలు నమోదు చేస్తున్నట్లు తెలిపారు అంట నమోదు ద్వారా రైతు పండించినటువంటి పంట నమోదు పూర్తయి ధాన్యము కొనుగోలు చేసే ముందు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లి దళారులు లేకుండా ఎలాంటి తూకం తీయకుండా రైతుకు నేరుగా ప్రభుత్వం ప్రకటించిన రేటు ప్రకారం ధాన్యం కొనుగోలు చేసి రైతు యొక్క పాస్ బుక్ అకౌంట్ లో డబ్బులు ధాన్యం కి సరిపడు డబ్బులు రైతు అకౌంట్లో వేయడం జరుగుతుందని తెలిపారు పంటలు నమోదు చేసుకుని ఎడల ప్రైవేటు మార్కెట్లలో దళారులు హెచ్చుతగ్గులు ధరలు కాంట కోతలు ఇలా అనేక పేర్లతో రైతుల వద్ద తూకంలో కటింగులు చేస్తూ ఉంటారు అలాకాకుండా ప్రభుత్వము ఏర్పాటు చేసిన కేంద్రాలకు ధాన్యము తీసుకువెళ్లి రైతుకు ప్రభుత్వం ప్రకటించిన నాణ్యమైన ధరను పొందాలంటే ఈ యొక్క నమోదు కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ సహకరించి మీ ధాన్యాన్ని మీరే విక్రయించుకొని ప్రభుత్వ ఉత్తర్వులను సద్వినియోగం చేసుకోవాలని డి సి ఎల్ సర్వేర్ కేసారం సంజీవులు తెలిపారు

# గునుకులపల్లి – చిగురుమామిడి రోడ్డు మార్గం పరిశీలించిన కలెక్టర్

### ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశం



**కరీంనగర్ జిల్లా ప్రజాబలంప్రతినిధి సెప్టెంబర్ 17** చిగురుమామిడి మండల కేంద్రం నుంచి గునుకులపల్లి వరకు లంబాడి పల్లి మీదుగా నిర్మించే ఇంటర్మీడియట్ రోడ్డు(5.5 మీటర్లు) మార్గాన్ని శుక్రవారం కలెక్టర్ చిత్రా మిశ్రా, కరీంనగర్ ఆర్డిఓ షర్మిలతో కలిసి పరిశీలించారు. ఏడున్నర(7.5)కిలోమీటర్ల మీర ఈ రోడ్డు నిర్మించనున్నారు. ఇందులో ఆరున్నర (6.5)కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి హ్యామ్ పథకం కింద నిధులు మంజూరవగా ఈ ప్రక్రియ టెండర్ దశలో ఉంది. మిగతా ఒక కిలోమీటర్ మేర రోడ్డు నిర్మించేందుకు ఈ రూట్ ను గ్రామాల వారీగా కలెక్టర్ పరిశీలించారు. తహసీల్దార్ కనకయ్య, ఇంజనీరింగ్ అధికారులు జనార్ధన్ ను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిపాదనలు తయారు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

**తగ్గనున్న దూర భారం**

గునుకులపల్లి – చిగురుమామిడి వరకు లంబాడి పల్లె మీదుగా నిర్మించే ఈ రోడ్డు ఇందుర్తి,ఓగులాపూర్,గాగిరెడ్డిపల్లి గ్రామాలను కలుపుతుంది. ఈ రోడ్డు పూర్తయితే ఆయా గ్రామాల ప్రజలకు దూర భారం తగ్గనుంది. వారి వెంట డీపీఆర్ఈ జనార్ధన్, పీఆర్ ఏఈ నిరంజన్ తదితరులున్నారు.

# విద్యార్థుల భవిష్యత్‌కు ‘ఇన్‌స్పైర్ & ఇగ్నైట్’ బాట

### రాష్ట్రవ్యాప్తంగా శిక్షణలు నిర్వహించాలి.. సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే మట్టా రాగమయి విజ్ఞప్తి..



**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 18:** విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వ వికాసం, లక్ష్యసాధనపై అవగాహన పెంపొందించే ‘ఇన్‌స్పైర్ & ఇగ్నైట్’ శిక్షణ కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించాల్సిన అవసరం ఉందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు.

సత్తుపల్లి నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, ప్రేరణాత్మక శిక్షణ అందిస్తున్న ఇన్‌స్పైర్ అండ్ ఇగ్నైట్ ఫౌండేషన్ బృందానికి ఇచ్చిన మాట మేరకు ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు కలుగుతున్న ప్రయోజనాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు, వ్యక్తిత్వ వికాసం, లక్ష్య నిర్దేశం, భవిష్యత్‌పై స్పష్టమైన అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతున్నాయని వివరించారు.

విద్యార్థుల్లో సానుకూల మార్పు తీసుకురావడానికి, వారి భవిష్యత్‌ను మరింత బలంగా తీర్చిదిద్దడానికి ప్రేరణాత్మక శిక్షణలు కీలకంగా నిలుస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సత్తుపల్లిలో అమలవుతున్న ఈ కార్యక్రమాల తరహాలో రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లోనూ ఇలాంటి శిక్షణలు అందించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు.

ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొన్నారు.

**విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేయడమే లక్ష్యం..**

‘ఇన్‌స్పైర్ & ఇగ్నైట్’ శిక్షణలకు రాష్ట్రవ్యాప్త విస్తరణ కోసం ఎమ్మెల్యే మట్టా రాగమయి కృషి.

## నగళ్లపాడు పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ

చాగలమర్రి మండలం నగళ్లపాడు గ్రామంలోని మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం మండల విద్యాశాఖ అధికారి శేషశయనారెడ్డి తనిఖీ చేశారు. వివిధ రికార్డులను పరిశీలించి విద్యా బోధనపై ఉపాధ్యాయులకు పలు కీలక సూచనలు చేశారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం మెనూ ప్రకారం అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు

## దళిత జర్నలిస్ట్ ఫోరం 11వ రాష్ట్ర మహాసభల గోడపత్రిక ఆవిష్కరణ



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 18 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** జోగిపేట: దళిత జర్నలిస్ట్ ఫోరం 11వ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన గోడపత్రికను శు క్రవారం అందోల్ మండలం జోగిపేట పట్టణంలో ఆవిష్కరించారు. స్థానిక ఎమ్మార్వో సాగర్ మధుకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ తిరుపతి చేతుల మీదుగా గోడపత్రికను ఆవిష్కరించారు. ఈసందర్భంగా దళిత జర్నలిస్ట్ ఫోరం నాయకులు జిల్లా ఉపాధ్యక్షులు మాట్లాడుతూ, అక్టోబర్ 7న సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న 11వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జర్నలిస్టులకు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో దళిత జర్నలిస్ట్ ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు దానం మోహన్, జిల్లా కార్యదర్శి జోగ్యల్ల రాజు, జిల్లా సభ్యుడు మాదిగ బుచ్చయ్య, అజ్జిగళ్ల నర్సింలు, కుసంగి మహేష్, మేకల అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## లక్షన్నర కొత్త నోట్లతో లక్ష్మీ గణపతి అలంకరణ..

### సత్తుపల్లి జలగం నగర్‌లో భక్తులను ఆకట్టుకున్న గణనాథుడి అలంకారం.

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 18:** ఖమ్మం జిల్లా సత్తుపల్లి పట్టణంలోని జలగం నగర్‌లో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ కోదండ రామాలయంలో నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గణనాథుడు లక్ష్మీ గణపతి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.



ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు సుమారు రూ. 1.50 లక్షల విలువైన కొత్త కరెన్సీ నోట్లతో గణేశుడిని అలంకరించారు. ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన లక్ష్మీ గణపతిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

అనంతరం ఆలయ ప్రాంగణంలో అష్టలక్ష్మి కుంకుమార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు, అలంకరణలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

## లారీ క్యాబిన్‌లో డ్రైవర్ అనుమానాస్పద మృతి

### ఆర్థిక ఇబ్బందులే కారణమా..?

### పెనుబల్లి మండలం మండాలపాడులో ఘటన



**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 18 :** ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం మండాలపాడు గ్రామ శివారులో లారీ డ్రైవర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన శుక్రవారం వెలుగుచూసింది. విశాఖపట్నం నుంచి నాగర్‌కర్నూల్‌కు బొగ్గు లోడ్‌తో వెళ్తున్న లారీని మండాలపాడు శివారులోని మందాకిని నర్సరీ సమీపంలో రోడ్డుపక్కన నిలిపిన డ్రైవర్ క్యాబిన్‌లోనే మృతి చెందాడు.

సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడిని పల్నాడు జిల్లా తుంబూరు కోట మండలం కొత్తగంగారాజుపల్లి గ్రామానికి చెందిన వాడపల్లి ధనుంజయ్‌గా గుర్తించారు. ప్రాథమిక దర్యాప్తులో క్యాబిన్‌లోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం.

ఆర్థిక ఇబ్బందుల కారణంగానే ఈ ఘటనకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడికానున్నాయి.

మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## గణేశునికి ముళ్ళపాటి దంపతులు పూజలు.



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 18:** 22వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీ సాయి గజానన ఉత్సవ కమిటీ గాంధీనగర్లోని గణేష్ మండపంలో వైరా మున్సిపాలిటీ తొలి వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు 13వ వార్డు కౌన్సిలర్ ముళ్లపాటి విజయలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా మున్సిపాలిటీ తొలి వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు మాట్లాడుతూ ఇది మా సొంత కమిటీ గత 22 సంవత్సరాలుగా స్వామివారికి పూజలు నిర్వహిస్తూ అద్భుతంగా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉన్నాము అదేవిధంగా నవరాత్రి కార్యక్రమాల్లో భాగంగా ముగ్గుల పోటీలు, ఉట్టి వేడుకలు, మహా అన్నదాన కార్యక్రమాలు మరియు అనేక సాంస్కృతిక కార్యక్రమాలు , అన్నింటికంటే ముఖ్యంగా ప్రతిరోజు సాయంత్రం పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మా కమిటీ సభ్యులందరూ కూడా అన్నదమ్ముల వలె ఆప్యాయత అనురాగాలతో ఉంటూ ఎటువంటి పొరపొచ్చాలు లేకుండా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఉన్నాము అని తెలిపారు.

### హనుమకొండ కోర్టుకు హాజరైన ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్

ఎన్నికల సమయంలో నమోదైన కేసుకు సంబంధించిన న్యాయ ప్రక్రియలో భాగంగా ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ గారు ఈరోజు హనుమకొండలోని కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన వెంట పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కోర్టుకు హాజరయ్యారు. ఎన్నికల సమయంలో నమోదైన కేసుకు సంబంధించి కోర్టులో జరుగుతున్న విచారణలో భాగంగానే ఎమ్మెల్యే హాజరైనట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారం తయారు చేసుకోవాలి.

### ఐ సి డి ఎస్ సిడిపివో నిర్మల జ్యోతి



**సత్తుపల్లి , ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 18:** తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అంగన్వాడీ టీచర్లు తయారుచేసి చూపించిన విధంగా చేసుకుని గర్భిణీలు, బాలింతలు తీసుకోవాలని ఐసిడిఎస్ సిడిపివో నిర్మల జ్యోతి అన్నారు . కల్లూరు మండల పరిధిలోని రఘునాథ గూడెం గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో సూపర్వైజర్ సుజాత ఆధ్వర్యంలో నిర్వహించిన 9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమంలో నిర్మల జ్యోతి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు 6 సంవత్సరాల పిల్లల వరకు అంగన్వాడీ కేంద్రాల నుంచి ఇంటికి అందించే టి హెచ్ ఆర్ ఆహార పదార్థాలను ఉపయోగించి అంగన్వాడి టీచర్లు స్వయంగా తయారు చేసిన వంటకాలను ప్రదర్శించారు. సర్పంచ్ సుధారాణి మాట్లాడుతూ

పోషక విలువ ప్రాముఖ్యతను , అవసరాన్ని తయారు చేసుకునే విధానాన్ని వివరించి అవగాహన కల్పించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధులు దరిచేరమన్నారు. మహిళల్లో కిషోర్ బాలికల్లో రక్తహీనత సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు , ఆహారం గురించి వివరించారు .సిడిపిఓ నిర్మల జ్యోతి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ఇంటి వద్ద స్వయంగా తయారు చేసుకుని తీసుకునే రక్తహీనత సమస్యలు లేకుండా ఉండాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా ఆరోగ్య శాఖ అందించే వ్యాధిని ప్రకటికలు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. అనంతరం గర్భిణీలకు సాంప్రదాయ పద్ధతిలో చీర సారె, పూలు, పండ్లు ,గాజులు, సలిమిడితో వడి నింపి సామూహిక సీమంతాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజ్ ర్ సుజాత,గ్రామ సర్పంచ్ సుధారానీ, ఉప సర్పంచ్ కోటేశ్వరీ, వార్డు మెంబర్ , గ్రామ పెద్దలు రానా, కృష్ణారెడ్డి, శ్రీనివాస్, అంగన్వాడీ టీచర్స్ రేవతి పద్మ, ప్రియాంక మంగమణి ,యశోద, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

## అన్ని దానాల్లో కంటే అన్నదానం మిన్న

### బస్వాపురంసర్పంచ్ పాశం హైమావతి వెంకటేశ్వర్లు

### మహా అన్నదానం ప్రారంభించిన

### పాశం వెంకటేశ్వర్లు



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 18:** తల్లాడ మండలంలోని బస్వాపురం గ్రామంల బీసీ కాలనీలో కొలువుదీరిన వినాయకుని మండపం వద్ద గణేష్ నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో కమిటీ సభ్యులు ఆధ్వర్యంలోకొనసాగుతున్నాయి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు నిర్వహించిన గత నాలుగు సంవత్సరాలుగా గ్రామ సర్పంచ్ పాశం హైమావతి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో

మహా అన్నప్రసాద కార్యక్రమానికి దాతలు దంపతులుఆధ్వర్యంలో

భక్తులకు అన్న ప్రసాదం అందించేందుకు సహకరించారు.

ఆ మహా అన్నదానాన్ని దాత బస్వాపురం గ్రామ సర్పంచ్ పాశం హైమావతి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. వారి కుటుంబం అందించే సహకారాన్ని ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. నిర్వహించిన

మహా అన్న ప్రసాదంలో

పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదములు స్వీకరించారు ఈ సందర్భంగా పాశం వెంకటేశ్వర్లు

మాట్లాడుతూ వినాయక ఉత్సవాలు కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలకే పరిమితం కాక ప్రజలందరినీ ఒకే వేదికపై తీసుకొచ్చి సామాజిక వేడుకలుగా నిలుస్తున్నాయని తెలిపారు మండపంలో ప్రతిరోజు భక్తులచే భజన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు అన్ని దానాల్లో కంటి అన్నదానం మిన్నని

పాశం వెంకటేశ్వర్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు నాయుడు కుటుంబరావు, సగుర్తి మురళీకృష్ణ, మట్లాపురం సాయిలు, మట్లాపురం శంకర్‌రావు, సగుర్తి కర్ణాకర్, షేక్ రియాజ్, నాయుడు శ్రీను, బండి వెంకటేశ్వరులు

తదితరులు పాల్గొన్నారు.

## గణపతి నవరాత్రులకు కౌన్సిలర్ వరలక్ష్మి శ్యాంబాబు విరాళం.

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 18:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20 వ వార్డ్ లో వినాయక చవితి పండుగ సందర్భంగా మొత్తం 7 గణపతి విగ్రహాలు ఏర్పాటు చేయడం జరిగింది. కౌన్సిలర్ ఉంద్రు వరలక్ష్మి శ్యాంబాబు వార్డ్ కాంగ్రెస్ నాయకులతో పాటు గా ఈ వినాయక మండపాలను సందర్శించి అన్నదాన కార్యాక్రమాల కొరకు విరాళం అందించడం జరిగింది .ఈ సందర్భంగా మాట్లాడుతూ గణపతి నవరాత్రులను ప్రతిఒక్కరు భక్తి శ్రద్దలతో జరుపుకోవాలని ,ఈ పవిత్రమైన నవరాత్రి ఉత్సవాలలో జరిగే ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు మరియు అన్నదాన కార్యక్రమం విజయవంతం కావాలని కోరారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు కౌన్సిలర్ శాలువాతో సన్మానించి ధన్యవాదములు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కాంగ్రెస్ నాయకులు పువ్వాళ్ళ రాము, బిక్యా, హుస్సేన్ , పృథ్వి,పండు,దుర్గా ,కృష్ణబాబు , హనీఫ్, నవీన్, ముస్తఫా,వెంకటేశ్వర్లు,తదితరులు పాల్గొన్నారు.





Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com